
మంగళవారం 26-12-2023


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 275

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సఫారీ 'టెస్టు' సవాల్

సిరీస్ లక్ష్యంగా దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో తలపడనున్న టీమిండియా -12లో



ఐపీవోలకు కంపెనీల క్యూ..

2024లోనూ మరిన్ని ఇష్యూలు... స్టాక్ నిపుణుల అంచనాలు -13లో



63 కరోనా జేఎన్1 కేసులు

గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా కరోనా జేఎన్1 పాజిటివ్ కేసులు 63 వెలుగుచూసినట్లు కేంద్రం సోమవారం ప్రకటించింది.

- వివరాలు 6లో



కట్టేసి... ఒళ్లంతా బ్లేడుతో కోసి..

అబ్బాయిగా మారిన స్నేహితురాలిని ఎవరూ ఆదరించకపోవడంతో సానుభూతితో మాట్లాడిన పాపానికి ఓ అమ్మాయి హత్యకు గురైంది.

- వివరాలు 6లో



'అల్-మగజి'పై దాడులు

గాజా స్ట్రిప్‌లోని డెయిర్ అల్-మగజి శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో 106 మంది పాలస్తీనియన్లు మరణించారు.

- వివరాలు 6లో



నిరుపేదల సాధికారతే ధ్యేయం

నిరుపేద, అణగారిన వర్గాల సాధికారతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధానమంత్రి మోదీ చెప్పారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

నేడు ఢిల్లీకి రేవంత్, భట్టి




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం ఢిల్లీ బయల్దేరి వెళ్లనున్నారు. రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత దేశ ప్రధానిని కలిసే సంప్రదాయంలో భాగంగా రేవంత్‌తో పాటు భట్టి కూడా ఢిల్లీ వెళ్లనున్నారు.

- వివరాలు 14లో

చేవెళ్లపై బీఆర్‌ఎస్ దృష్టి



వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో చేవెళ్ల నియోజకవర్గ నేతలతో సోమవారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. అభ్యర్థి ఖరారు, గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

- వివరాలు 3లో

'గ్రూప్-2' నిర్వహణపై సందిగ్ధం!



రాష్ట్రంలో గ్రూప్-2 అర్హత పరీక్షలపై అభ్యర్థుల్లో ఆందోళన తీవ్రమవుతోంది. ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడ్డ ఈ పరీక్షలు ఈసారైనా జరుగుతాయో లేదోనని అభ్యర్థులు కలవరపడుతున్నారు.

- వివరాలు 14లో

కోదండరాంకు కీలక పదవి!



ప్రొఫెసర్ కోదండరాం టీజేఎస్ అధ్యక్షుడి హోదాలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. ఆయనకు రాష్ట్ర స్థాయిలో కీలక పదవి ఇస్తారని, లేదంటే ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కూడా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది.

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



సొంత జాగా ఉన్నవారికే!

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

మలివిడతలో జాగా లేని వారికి ఇంటి స్థలాల పంపిణీ

- అమరుల కుటుంబాలకు మాత్రం త్వరలోనే ప్లాట్ల పంపిణీ
- ప్రజాపాలన కార్యక్రమంలో 'ఇందిరమ్మ' దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన పేదలను గుర్తించి పథకం కోసం ఎంపిక
- ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వనున్న సర్కారు
- లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టేలా ఏర్పాట్లు
- ఇళ్ల నిర్మాణ డిజైన్ విషయంలో మాత్రం పలు సందేహాలు
- ఇంటి స్థలాల పంపిణీ కోసం త్వరలోనే భూసేకరణ చేపట్టాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: పేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తొలుత సొంత జాగా ఉన్న వారికి ఇళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. సొంత స్థలం లేనివారికి పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు వంటివి ఆ తర్వాత చేపట్టాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇంటి స్థలాల పంపిణీ కోసం భూమిని సేకరించేందుకు కాస్త సమయం పట్టే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు

ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేశాయి. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో.. మళ్లీ ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. సొంత జాగా ఉన్న అర్హులైన పేదలకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చింది. జాగా లేని పేదలకు స్థలం పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి నిధులు ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఈనెల 28వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో తొలుత సొంత జాగా ఉన్న పేదలకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున నిధులు విడుదల చేసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

తర్వాతే ఇంటి స్థలాల పంపిణీ..

రాష్ట్రంలో సొంత జాగా లేని నిరుపేదలు లక్షల్లో ఉన్నారు. అలాంటి వారికి తొలుత ఇంటి స్థలం ఇచ్చి, అందులో వారు ఇల్లు నిర్మించుకునేందుకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పేదలకు పంపిణీ కోసం భారీగా భూమిని సేకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ కోసం సమయం పట్టే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

ఇళ్ల డిజైన్లపై కసరత్తు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను సిద్ధం చేస్తున్నట్టు ఇటీవల గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతా 3వ పేజీలో ▶

ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించి..

2004– 2014 మధ్య ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రాంతానికి సంబంధించి దాదాపు 19 లక్షల ఇళ్లను నిర్మించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అదే తరహాలో ఇళ్లను నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. గెలిచి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కసరత్తు ప్రారంభించింది. అయితే గత సర్కారు ఎన్నికల ముందు స్వీకరించిన గృహలక్ష్మి దరఖాస్తులను తిరస్కరించాలని ఇప్పటికే నిర్ణయించింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల కోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలోనే పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. వాటిని పరిశీలించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు.

ఆరుగురి జీవితాలను కమ్మేసిన

పొగమంచు

నల్లగొండ జిల్లా నిడమనూరు సమీపంలో రెండు రోడ్డు ప్రమాదాలు

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్.. ఇద్దరు మృతి

- ఆ ఘటనలో చనిపోయిన యువకుడి వద్దకు బయలుదేరిన కుటుంబ సభ్యులు
- వారు వస్తున్న వాహనాన్ని ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్.. నలుగురు మృతి
- బైక్ ప్రమాదం జరిగిన స్థలానికి కిలోమీటర్ దూరంలోనే ఈ ఘటన


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన టాటాఏస్ వాహనం

నిడమనూరు: మృత్యువు దారికాచి వెంటపడినట్టు పొగ మంచు ఓ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదంలో బలితీసుకుంది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి వద్దకు వస్తున్న కుటుంబ సభ్యులు కూడా రోడ్డు ప్రమాదం బారినపడ్డారు. పొగ మంచుకు అతివేగం, నిర్లక్ష్యం తోడై ఆరు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున

మిగతా 2వ పేజీలో ▶

రోడ్డు కనబడక చెరువులోకి దూసుకెళ్లి..

నీట మునిగిన కారు.. ఒకరు మృతి

- ఘటన సమయంలో కారులో ఐదుగురు
- ఈదుకుంటూ బయటపడిన నలుగురు

2 లో

మరింత తగ్గనున్న ఉష్ణోగ్రతలు

- వివరాలు 2లో

ఉత్తరాదిని 'కమ్ముకున్న పొగమంచు' 6 లో


సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా హైదరాబాద్ మియాపూర్ కల్వరి టెంపుల్‌లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు - వివరాలు 2లో

మళ్లీ తెరపైకి

తుమ్మిడిహట్టి!

వార్ధా బ్యారేజీ, చెన్నూరు లిఫ్టులకు మంగళం?

- సాగునీటి ప్రాజెక్టులపై పునఃసమీక్షకు కాంగ్రెస్ సర్కారు నిర్ణయం
- ఎత్తిపోతల వ్యయాలు తగ్గించి గ్రావిటీ ద్వారా నీరిచ్చే యోచన
- ఆదిలాబాద్ జిల్లాలో ప్రాణహిత–చేవెళ్ల పనుల పునరుద్ధరణ
- ఉమ్మడి ఏపీలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకే ప్రాధాన్యం

- వివరాలు 2లో



'షా'రొస్తున్నారు

28న రాష్ట్రానికి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



కమలనాథులకు లోక్‌సభ ఎన్నికలపై దిశానిర్దేశం

- పార్టీ మండల అధ్యక్షుల మొదలు.. నేతలందరితో భేటీ
- బీజేపీ ఎమ్మెల్యేలతోనూ సమావేశం
- అదే రోజు బీజేఎల్పీ నేతను ప్రకటించే అవకాశం

- వివరాలు 3లో

అవి రెండూ అవినీతి పత్రాలే



- శ్వేత, స్వేద పత్రాలపై కిషన్‌రెడ్డి ధ్వజం
- కోవిడ్‌పై రాష్ట్రాలను అలర్ట్ చేశాం
- అవసరమైతే కరోనా కంట్రోల్ రూం ఏర్పాటు... ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు


3 లో

మంత్రుల మేడిగడ్డ బాట!

29న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన

- మేడిగడ్డ వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- ప్రాణహిత–చెవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులతో లాభనష్టాలపై వివరణ
- జరిగిన వ్యయం, ప్రతిపాదిత ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టుపై విశ్లేషణ
- అనంతరం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించి లోపాల పరిశీలన
- హైదరాబాద్ నుంచి మీడియా బృందాన్ని తీసుకెళ్లనున్న రాష్ట్ర ప్రభుత్వం

2 లో



రేపే 'సింగరేణి' ఎన్నికలు

రెండేళ్లుగా వాయిదాపడుతున్న 'గుర్తింపు' సమరం • హైకోర్టు జోక్యంతో 27న నిర్వహణ

అక్టోబర్‌లోనే ముగిసిన నామినేషన్ల ప్రక్రియ • 11 ఏరియాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఈనెల 27న జరగబోతున్నాయి. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రంతో ముగిసింది.

పాతికేళ్ల కిందట మొదలైన ఎన్నికల పోరు

దక్షిణ భారతదేశంలోనే ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా నిలిచిన సింగరేణి పరిధిలో 24 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులు విస్తరించి ఉన్నాయి. ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో సంస్థ విస్తరించి ఉండగా మొత్తం 39 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. 1998 నుంచి సింగరేణిలో కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గుర్తింపు సంఘం కాలపరిమితి మొదట రెండేళ్లు ఉండగా ఆ తర్వాత నాలుగేళ్లకు పెంచారు. చివరి సారిగా 2017 అక్టోబర్‌లో ఎన్నికలు జరగగా గెలుపొందిన యూనియన్ కాలపరిమితి 2021 అక్టోబర్‌తో ముగిసింది. ఆ తర్వాత ప్రభుత్వం ఎన్నికలకు మొగ్గు చూపలేదు. దీంతో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కోర్టును ఆశ్రయించగా ఎన్నికల ప్రక్రియ మొదలైంది.

అక్టోబర్ 6న నోటిఫికేషన్ వచ్చినా..

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నోటిఫికేషన్ గత అక్టోబర్ 6న వెలువడింది. అదేనెల 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేసి కార్మిక సంఘాలకు గుర్తులు కేటాయించారు. అక్టోబర్ 30న పోలింగ్ నిర్వహించాల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికలు రావడం, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు మరోసారి అభ్యంతరం చెప్పడంతో గుర్తింపు ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. చివరకు ఈనెల 27న పోలింగ్ నిర్వహించాల్సిందేనని హైకోర్టు ఈనెల 21న స్పష్టం చేసింది. దీంతో కార్మిక సంఘాలు ప్రచారంలో ఉధృతి పెంచాయి.

మొత్తం 39,773 మంది కార్మికులు

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో మొత్తం 39,773 మంది కార్మికులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. 13 కార్మిక సంఘాలు పోటీ పడుతున్నాయి. ఎన్నికల విధులకు 650 మంది ప్రభుత్వ ఉద్యోగులను, బందోబస్తు విధులకు 460 మంది పోలీసులను కేటాయించారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. 11 ఏరియాల్లో 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అత్యధికంగా శ్రీరాంపూర్ ఏరియాలో 15 కేంద్రాలు ఉండగా ఇల్లెందులో అత్యల్పంగా 3 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు మొదలయ్యే పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత ఏరియాల వారీగా ఓట్లు లెక్కిస్తారు. ముందు ఏరియా వారీగా విజేతలను

మిగతా 5వ పేజీలో ▶

గతంలో జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్మిక సంఘాలు పొందిన ఓట్ల వివరాలు

కార్మిక సంఘం	2012లో	2017లో
టీజీబీకేఎస్	23,311	23,848
ఏఐటీయూసీ	16,724	19,631
ఐఎన్‌టీయూసీ	12,077	–
హెచ్ఎంఎస్	5,983	3,910

రేషన్ బియ్యం రీసైక్లింగ్ ఆగేనా?

రాష్ట్రంలో పక్కదారి పడుతున్న 70 శాతం రేషన్ బియ్యం!

- పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ సమీక్షలో అధికారుల వెల్లడి?
- పక్కదారిపడుతున్న రేషన్ బియ్యాన్ని అరికట్టేందుకు ఐపీఎస్ అధికారికి పౌరసరఫరాల శాఖ కమిషనర్ పగ్గాలు

- వివరాలు 5లో

రీసైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరిక

- వివరాలు 5లో

క్లుప్తంగా...

నేడు ఢిల్లీకి గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాతో గవర్నర్ సమావేశం కానున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం తదనంతర పరిమాణాల నేపథ్యంలో ఇక్కడి రాజకీయ పరిస్థితులపై తమిళిసై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాండిచ్చేరిలో ఉన్న గవర్నర్ చెన్నై నుంచి ఢిల్లీ వెళ్తారని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రధాని మోదీని కలవడానికి ముందుగానే ప్రధానమంత్రితో గవర్నర్ భేటీ కానున్నట్లు సమాచారం.

ఏఐఎస్‌బీ ప్రధాన కార్యదర్శిగా హకీమ్ నమీద్

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అనుబంధ విద్యార్థి సంఘమైన ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హకీమ్ నమీద్ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర చైర్మన్‌గా జవరే రాహుల్, వైస్ చైర్మన్లుగా అతికం రాజశేఖర్‌గౌడ్, దేవర్ల నాగరాజు, జాయింట్ సెక్రెటరీలుగా ఎద్దు ప్రవీణ్‌కుమార్, పుల్లని వేణి, కోశాధికారిగా రోహిత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హకీమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తామని, ఏఐఎస్‌బీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

వార్డు సభలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆదేశం




సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలనలో భాగంగా ఈ నెల 28 నుండి ప్రారంభం కానున్న వార్డు సభలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మునిసిపల్, పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్లతో ప్రజాపాలన సన్నద్ధతపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ పరిధిలోని కమిషనర్లు ప్రత్యక్షంగా, మిగిలినవారు జూమ్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానకిశోర్ మాట్లాడుతూ ప్రజాపాలన, వార్డు సభలకు అధికారుల బృందాలతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, వాటికి రసీదు ఇవ్వడం, ఆ వివరాలను కంప్యూటరీకరించడం తదితర అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు సభల తేదీలను పెద్దఎత్తున ప్రచారం చేయాలని పేర్కొన్నారు. వార్డు సభల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాముల్ని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంపై రోజు వారీ నివేదిక రాష్ట్ర కార్యాలయనికి పంపించాలని స్పష్టం చేశారు. సమీక్షలో సీడీఎంఏ హరిచందన, జాయింట్ డైరెక్టర్లు కృష్ణమోహన్ రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో 10 కరోనా కేసులు

కొత్త వేరియంట్ నమోదు కాలేదన్న డీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం 989 మందికి కరోనా పరీక్షలు చేయగా అందులో 10 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీంద్ర నాయక్ వెల్లడించారు. ఈ మేరకు కరోనా బులెటిన్ విడుదల చేశారు. కరోనా కేసుల్లో హైదరాబాద్‌లో 9, కరీంనగర్ జిల్లాలో ఒకటి నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బులెటిన్ ప్రకారం ప్రస్తుతం 55 మంది బాధితులు ఐసోలేషన్ లేదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తెలంగాణలో ఇప్పటివరకు కొత్త వేరియేంట్ జేఎన్.1 కేసులేవీ నమోదు కాలేదని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ రవీంద్రనాయక్ భరోసా ఇచ్చారు. పెరుగుతున్న జ్వరం, జలుబు, దగ్గు కేసులతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త సంవత్సర వేడుకలు, తర్వాత సంక్రాంతి పండుగ ఉన్న నేపథ్యంలో ప్రయాణాలు లేదా జనసమ్మర్ద ప్రాంతాల్లోకి వెళ్లేటప్పుడు మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎన్‌పీఏలో పోలీస్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్



సాక్షి, హైదరాబాద్: సర్దార్ వల్లభ్‌భాయ్ జాతీయ పోలీస్ అకాడమీలో నేటి నుంచి జనవరి 5 వరకు 42వ ఆల్ ఇండియా ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్, మౌంటెడ్ పోలీస్ డ్యూటీ మీట్ 2023–24 నిర్వహించనున్నారు. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మీట్‌లో 22 గుర్రపుస్వారీ బృందాలతో కలిపి 610 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 340 గుర్రాలు పాల్గొంటున్నాయి. మొత్తం 34 రకాల పోటీలు నిర్వహించనున్నారు. గతేడాది నవంబర్‌లో టేకాన్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ అకాడమీలో ఈ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. 1970 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తుండగా నేషనల్ పోలీస్ అకాడమీలో నిర్వహించడం ఇదే తొలిసారి.

భారీగా చేరి.. బారులు తీరి..!

మెదక్ చర్చిలో వైభవంగా క్రిస్మస్ వేడుకలు • సుమారు 3 లక్షలమంది వచ్చినట్లు అంచనా



మెదక్ చర్చి ఎదుట భక్తుల సందడి

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో సోమవారం క్రిస్మస్ సంబరాలు వైభవంగా జరిగాయి. మెదక్ పట్టణంలోని సుమారు 600 ఎకరాల చర్చి ప్రాంగణం జనంతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి మూడులక్షల మంది భక్తులు తరలివచ్చారని అంచనా. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే ప్రార్థనలు మొదలయ్యాయి. చలితీవ్రతను కూడా లెక్కచేయకుండా భక్తులు యేసయ్య దీవెనల కోసం బారులుతీరారు. ఈ సందర్భంగా బిషప్ కె.పద్మారావు దైవసందేశం ఇచ్చారు. శాంతిద్వారానే సమసమాజ స్థాపన జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ క్రీస్తును ఆరాధించాలని, విశ్వాసంతో ప్రార్థిస్తే ప్రతిసమస్యకూ పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రభువు చూపిన మార్గంలో నడుస్తూ సుఖసంతోషాలతో విరాజిల్లాలంటూ ప్రార్థనలు చేశారు. అంతకుముందు చర్చి వందో యేటా అడుగు పెట్టిన సందర్భంగా రూపొందించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి

'కల్వరి'లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

హఫీజ్‌పేట్(హైదరాబాద్): మియాపూర్ కల్వరి టెంపుల్‌లో సోమవారం వైభవంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు మూడు లక్షలమంది భక్తులు తరలివచ్చి యేసుక్రీస్తు ప్రార్థనలు చేశారు. కల్వరి టెంపుల్ వ్యవస్థాపకుడు డాక్టర్ సతీశ్‌కుమార్ భక్తులకు క్రీస్తు జననం గురించి వివరించి, ప్రవచనాలు అందించారు. ఈ సందర్భంగా క్రీస్తు నాటక ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. టెంపుల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 100 అడుగుల క్రిస్మస్ ట్రీ ఆకట్టుకుంది. దీంతో ట్రీ వద్ద సందర్శకులు పెద్దఎత్తున ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపారు.

మళ్లీ తెరపైకి తుమ్మిడిహట్టి!

సాక్షి, హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పునఃసమీక్షకు సిద్ధమైంది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అంబేడ్కర్ ప్రాణహిత-చెవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ, ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసే అవకాశం ఉంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని కొత్త ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు చర్చ జరుగుతోంది. తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి... అక్కడి నుంచి కాల్వలు, సొరంగాలు, లిఫ్టుల ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లను ఎత్తిపోసే అంశాన్ని కొత్త ప్రభుత్వం పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరంతో పోల్చితే తుమ్మిడిహట్టి వద్ద నిర్మించే బ్యారేజీ నుంచి ఎల్లంపల్లిలోకి నీళ్లను ఎత్తిపోయడానికి నిర్వహణ వ్యయం తక్కువ కానుంది. ఈ నేపథ్యంలో వార్ధా బ్యారేజీ, చెన్నూరు ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని కొత్త ప్రభుత్వం పక్కనబెట్టనుందని నీటిపారుదల శాఖలో చర్చ జరుగుతోంది. ఈ నెల 29న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి డి.శ్రీధర్‌బాబు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించాక తమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ వంటి ప్రాజెక్టులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని కాంగ్రెస్ గతంలో చాలాసార్లు ఆరోపణలు చేసింది. చివరి దశలో ఉన్న ఈ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడాన్ని కొత్త ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా ఎంచుకొనే అవకాశం ఉంది.

వార్ధా, చెన్నూరు లిఫ్ట్ బదులు తుమ్మిడిహట్టి...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనబెట్టి దాని స్థానంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతిపాదించిన ఆయకట్టుకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు సరఫరా చేసే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో తుమ్మిడిహట్టి వద్ద గతంలో ప్రతిపాదించిన బ్యారేజీకి బదులుగా.. వార్ధా బ్యారేజీని నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు సరఫరా చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం డీపీఆర్‌ను సైతం సిద్ధం చేసింది. మేడిగడ్డ బ్యాక్‌వాటర్ నుంచి చెన్నూరు నియోజకవర్గానికి సాగునీటి సరఫరా చేసేందుకు కొత్త ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సైతం పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే వార్ధా బ్యారేజీ, చెన్నూరు ఎత్తిపోతల పథకాలను నిర్మించాల్సిన అవసరం ఉండదు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే చెన్నూరుకు గ్రావిటీతోనే సాగునీరు సరఫరా చేయడానికి అవకాశం ఉండగా గత ప్రభుత్వం అనవసరంగా ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తోందని అప్పట్లో పలువురు రిటైర్డ్ ఇంజనీర్లు ఆరోపించారు.

వార్ధా బ్యారేజీ, చెన్నూరు లిఫ్టులకు మంగళం?

- సాగునీటి ప్రాజెక్టులపై పునఃసమీక్షకు కాంగ్రెస్ సర్కారు నిర్ణయం
- ఎత్తిపోతల వ్యయాలు తగ్గించి గ్రావిటీ ద్వారా నీరిచ్చే యోచన
- ఆదిలాబాద్ జిల్లాలో ప్రాణహిత-చేవెళ్ల పనుల పునరుద్ధరణ
- ఉమ్మడి ఏపీలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకే ప్రాధాన్యత



వేచిచూస్తున్న కాంట్రాక్టర్లు..

బిల్లులు వస్తాయనే భరోసా లేకపోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు ఎత్తిపోతల పథకాల పనుల కొనసాగింపుపై కాంట్రాక్టర్లు సైతం పునరాలోచనలో పడ్డారు. కొత్త ప్రభుత్వ ప్రాథమ్యాలపై స్పష్టత వచ్చే వరకు వేచి చూసే ధోరణిలో కాంట్రాక్టర్లు ఉన్నారని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. గత ప్రభు త్వం చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర, నాగమడుగు వంటి ఎత్తిపోతల పథకాల పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో లోపాలు బయటపడటంతో వాటిపై ఆధారపడి నిర్మిస్తున్న ఈ మూడు ఎత్తిపోతల పథకాలను కొనసాగిస్తారా లేదా? అనే అంశంపై కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకొనే వరకు వేచిచూడాలని కాంట్రాక్టర్లు భావిస్తున్నట్లు తెలిసింది. భూసేకరణకు సంబంధించిన న్యాయ చిక్కులతో కొంతకాలం కిందే సంగమేశ్వర ఎత్తిపోతల పనులు ఆగిపోగా బసవేశ్వర పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. నాబార్డు నుంచి సంగమేశ్వర కోసం రూ. 2,392 కోట్లు, బసవేశ్వర కోసం రూ. 1,774 కోట్ల రుణం కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు మంజూరు కాలేదు.

అత్యంత వెనకబడిన గిరిజనులకు పక్కా ఇళ్లు

- ఏపీ, తెలంగాణ సహా 18 రాష్ట్రాల్లో అమలుకు కేంద్రం సన్నద్ధం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 75 అత్యంత వెనకబడిన గిరిజన సమూహాలకు ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన్-గ్రామీణలో భాగంగా పక్కా ఇళ్ల నిర్మాణం నిమిత్తం అర్హులైన లబ్ధిదారులను గుర్తించడానికి ఏపీ సహా 18 రాష్ట్రాల్లో కేంద్రం సర్వే ప్రారంభించింది. ఇప్పటికే ఏపీ సహా పలు రాష్ట్రాల్లో సర్వే నిర్వహించింది. 28వేల కుటుంబాలు ఈ సర్వే పరిధిలోకి వచ్చిన ట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వర్గాలు చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్ నిమిత్తం డిసెంబర్ 15 నుంచి ఆవాస్-యాప్‌ను ఆధునీకరించి ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు తెలిసింది. జనవరిలో తొలి విడత నిధులు విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వెనకబడిన గిరిజన సమూహాలకు ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కింద 4.9 లక్షల ఇళ్లు నిర్మించడానికి కేంద్రం గతంలో ఆమోదం తెలిపింది. పీఎంఏవై-జీ కింద ఇళ్ల నిర్మాణానికి మైదాన ప్రాంతాల్లో రూ.1.2 లక్షలు, కొండ ప్రాంతాల్లో రూ.1.30 లక్షలు ఇస్తుండగా ఈ సమూహాలకు యూనిట్ ఖర్చును రూ.2లక్షలకు పెంచనున్నట్లు సమాచారం.పీఎంఏవై-జీతో పాటు మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12,500, ఉపాధిలో 90 రోజులు పనిదినాలు (రూ.27వేలు) కలుపుకుంటే వారికి రూ.2.39 లక్షలు లబ్ధి చేకూరుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా ఏపీ, తెలంగాణలో ఈ పథకం ద్వారా గుర్తించిన సమూహాలు.. బోడోగడబా, బోండో పొరోజా, చెంచు, డోంగ్రియా ఖోండ్, గుటోబ్ గడబా, ఖోం పొరోజా, కోలం, కొండరెడ్లు, కొండ సవరలు, కుతియా ఖోండ్, పరెంగి పొరోజా, తోటి ఉన్నాయి.

మంత్రుల మేడిగడ్డ బాట

29న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన

- మేడిగడ్డ వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్..
- ప్రాణహిత-చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులతో లాభనష్టాలపై వివరణ
- జరిగిన వ్యయం, ప్రతిపాదిత ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టుపై విశ్లేషణ
- అనంతరం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించి లోపాల పరిశీలన
- హైదరాబాద్ నుంచి మీడియా బృందాన్ని తీసుకెళ్లనున్న రాష్ట్ర ప్రభుత్వం





సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల యాత్రకు శ్రీకారం చుట్టబోతోంది. ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా గత బీఆర్ఎస్ సర్కారు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ నెల 29న సందర్శించి అక్కడికక్కడే సమీక్ష జరపనున్నారు.

మొదటి నుంచి 'కాళేశ్వరం'ను వ్యతిరేకించిన కాంగ్రెస్

ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టు పనులను మధ్యలోనే నిలుపుదల చేసి దాని బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. దీనిని అప్పట్లో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. అధికారంలోకి వస్తే ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టు పనులను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన నేపథ్యంలో మంత్రుల పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ, ప్రాణహిత మీద తమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంపై తమ ప్రభుత్వ వైఖరిని మంత్రులు ప్రకటించే అవకాశం ఉంది.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్...

ఈ నెల 29న ఉదయం 9 గంటలకు మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మేడిగడ్డ బ్యారేజీ వద్దకి చేరుకుంటారు. హైదరాబాద్ నుంచి తీసుకెళ్లనున్న మీడియా ప్రతినిధుల బృందం సమక్షంలో మేడిగడ్డ వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించనున్నారు. ప్రాణహిత-చేవెళ్ల,, కాళేశ్వరం ప్రాజెక్టుల వివరాలు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో జరిగిన లాభ, నష్టాలు, ప్రాజెక్టు వ్యయం, ప్రతిపాదిత ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టు, ప్రాజెక్టు నిర్వహణ వ్యయం, విద్యుత్ అవసరాలు, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలు, వాటి పరిష్కారాలు తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా సాగునీటి రంగంపై శాసనసభలో శ్వేతపత్రం విడుదలను ప్రభుత్వం వాయిదా వేసుకున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖ రూపొందించిన నివేదికపై కూడా మీడియా సమక్షంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశాలున్నాయి. అనంతరం అక్కడే మంత్రులిద్దరూ సమీక్ష జరపనున్నారు.

కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లూ రావాలని ఆదేశం

ప్రజెంటేషన్ తర్వాత మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను మంత్రులిద్దరూ సందర్శించి లోపాలు, సమస్యలను పరిశీలిస్తారు. గత అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా, ఆ తర్వాత కొన్ని రోజులకే అన్నారం బ్యారేజీకి బుంగలు ఏర్పడి భారీగా నీళ్లు లీకయ్యాయి. కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ పునర్నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ మధ్య పేచీ నడుస్తోంది. సొంతంగా పునర్నిర్మాణం జరుపుతామని గత ప్రభుత్వ హయాంలో హామీ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాటను మార్చింది. ప్రాజెక్టు డిఫెక్ట్ లయబిలిటీ గడువు ముగిసిందని, అనుబంధ ఒప్పందం చేసుకుంటేనే 7వ బ్లాక్ పునర్నిర్మాణం చేపడతామని స్పష్టం చేసింది. నిర్మాణ సంస్థలతో పాటు సబ్ కాంట్రాక్టర్లు, ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధం ఉన్న వారందరూ తమ పర్యటన సందర్భంగా క్షేత్ర స్థాయిలో ఉండి అడిగిన సమాచారం ఇవ్వాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అందరికీ సమాచారం పంపించాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్‌కు స్పష్టం చేశారు.

రోడ్డు కనబడక చెరువులోకి దూసుకెళ్లి..

నీట మునిగిన కారు.. ఒకరు మృతి

- ఘటన సమయంలో కారులో ఐదుగురు
- ఈదుకుంటూ బయటపడిన నలుగురు
- 11 గంటల గాలింపు తర్వాత ఒకరి మృతదేహం లభ్యం
- మృతుడు ఏపీలోని అనకాపల్లి జిల్లాకు చెందిన గుణశేఖర్‌గా గుర్తింపు



అనంతగిరి: సరదాగా విహారయాత్ర కోసం బయలుదేరిన వారిని పొగమంచు కమ్మేసింది. దట్టంగా కమ్ముకున్న పొగమంచుతో రోడ్డు సరిగా కనబడక.. కారు పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న ఐదుగురిలో నలుగురు ఈదుకుంటూ బయటికిరాగా.. ఒకరు నీట మునిగి మృతి చెందారు. వికారాబాద్ పట్టణ శివార్లలోని శివారెడ్డిపేట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం నుంచి బయటపడినవారు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

అనంతగిరి వెళదామని బయలుదేరి..

ఏపీలోని అనకాపల్లి జిల్లా దేవరాంపల్లి మండలం మామిడిపల్లికి చెందిన గుణశేఖర్ (24), వైజాగ్‌కు చెందిన సాగర్, రఘుపతి, చిత్తూరు జిల్లాకు చెందిన పూజిత, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మోహన్ ఐదుగురూ స్నేహితులు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి అనంతగిరి గుట్టలకు విహారయాత్ర కోసం బయలుదేరారు. వికారాబాద్ పట్టణ శివార్లలోని శివారెడ్డిపేట్ చెరువు వద్ద ప్రయాణిస్తున్న సమయంలో పొగ మంచు దట్టంగా అలుముకుని ఉంది. దీనితో రోడ్డు సరిగా కనిపించక కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈత వచ్చిన రఘు నీట మునిగిపోతున్న సాగర్‌ను బయటికి తీసుకువచ్చాడు. కారు నడుపుతున్న మోహన్, పూజిత కూడా సురక్షితంగా బయటికి రాగలిగారు. గుణశేఖర్ నీటిలో మునిగిపోయాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని బాధితులను వికారాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. కారు చెరువులో పడిన సమయంలో తమను కాపాడాలని కేకలు వేసినా.. ఒడ్డున ఉన్న కొందరు సెల్‌ఫోన్లలో వీడియో తీసుకుంటూనే నిలబడ్డారని బాధితులు పేర్కొన్నారు.

సుదీర్ఘ గాలింపు తర్వాత..

గజ ఈతగాళ్లతో గుణశేఖర్ కోసం గాలింపు చేపట్టారు. ప్రమాదం విషయం తెలిసిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఘటనా స్థలికి చేరకుని సహాయక చర్యలను వేగిరం చేయాలని సూచించారు. సుమారు 11 గంటల పాటు గాలించిన తర్వాత సోమవారం సాయంత్రం గుణశేఖర్ మృతదేహం లభ్యమైంది.

...కమ్మేసిన పొగమంచు



శివనాయక్ బుజ్జి పాండు గనియా నాగరాజు సైదులు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ ప్రమాదాలు జరిగాయి.

బైక్‌పై స్వగ్రామానికి వస్తూ..

ఉమ్మడి నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం నిమ్మానాయక్ తండా ఆవాస గ్రామమైన మల్లెవాని కుంట తండాకు చెందిన రమావత్ శివనాయక్ (19) ఏపీలోని గుంటూరులో వేడుకల్లో డీజే సిస్టమ్, పూల అలంకరణ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి గుంటూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. రాత్రి 10 గంటల సమయంలో నిడమనూరు మండలంలోని వేంపాడు స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న బల్గూరి సైదులు (55)ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో వేంపాడుకు చెందిన బల్గూరి సైదులు తలకు తీవ్ర గాయాలై మృతి చెందగా.. శివనాయక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

కుమారుడి వద్దకు వస్తూ..

శివనాయక్ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసి హైదరాబాద్‌లో ఉంటున్న తండ్రి రమావత్ ప్రభాకర్, బంధువులతో కలసి టాటా ఏస్ వాహనంలో మిర్యాలగూడకు బయలుదేరారు. వాహనంలో శివనాయక్ తండ్రి ప్రభాకర్, మేనమామ మూడావత్ పాలేఖ, రమావత్ వినోద్‌తోపాటు పెదనాన్న రమావత్ గనియా (43), బావ దుమావత్ నాగరాజు(25), మేనత్త రమావత్ బుజ్జి (44), డ్రైవర్ రమావత్ పాండు (42) ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వారి వాహనం నిడమనూరు మండలంలోని 3వ నంబర్ కెనాల్ సమీపంలో ప్రయాణిస్తోంది. అదే సమయంలో ఏపీలోని జగ్గయ్యపేట నుంచి కర్నాటకలోని మంగళూరుకు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ టాటా ఏస్ వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. శివనాయక్ బైక్ ప్రమాదం జరిగిన కిలోమీటరు దూరంలోనే ఈ ప్రమాదం జరగడం గమనార్హం.

నలుగురు అక్కడికక్కడే మృతి..

ట్యాంకర్, టాటా ఏస్ ఢీకొన్న ప్రమాదంలో రమావత్ బుజ్జి, రమావత్ పాండు, గనియాలతోపాటు ఏపీలోని దొర్నాలకు చెందిన దుమావత్ నాగరాజు అక్కడిక్కడే మృతి చెందారు. రమావత్ ప్రభాకర్, రమావత్ వినోద్, మూడావత్ పాలేఖకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, తర్వాత స్థానికంగా ఉన్న వేర్వేరు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. నలుగురి మృతదేహాలను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ట్యాంకర్‌ను నడుపుతున్న క్లీనర్..

ఈ రెండు ప్రమాదాలకు పొగ మంచు, అతి వేగంతోపాటు నిర్లక్ష్యంగా నడపడం కూడా కారణమని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో డీజిల్ ట్యాంకర్‌ను డ్రైవర్ శ్రీను కాకుండా క్లీనర్ జయప్రకాశ్ నడుపుతున్నట్టు తేల్చారు. బైక్ ఘటనలో మృతిచెందిన బల్గూరి సైదులు కుమారుడు బల్గూరి వెంకన్న ఫిర్యాదు మేరకు ఒక కేసు.. ట్యాంకర్, టాటా ఏస్‌ను ఢీకొన్న ప్రమాదంలో మృతుడు గనియా భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గోపాల్‌రావు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్

మరింత తగ్గనున్న ఉష్ణోగ్రతలు

- ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన చలి తీవ్రత
- సిర్పూర్‌లో 8.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు.. మరో మూడు రోజుల పాటు ఇదే తరహా వాతావరణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. వాతావరణంలో నెలకొంటున్న మార్పులు, శీతల గాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చాలాచోట్ల సాధారణం కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం రాష్ట్రంలో అత్యధికంగా ఖమ్మంలో 31 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదుకాగా.. అత్యల్పంగా కనిష్ట ఉష్ణోగ్రత సిర్పూర్‌లో 8.3 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయని.. వచ్చే మూడు రోజులు కూడా రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

సోమవారం ప్రధాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు.. (డిగ్రీల సెల్సియస్‌లో)

ఆదిలాబాద్	9.2	హనుమకొండ	15.5
మెదక్	11.6	హైదరాబాద్	15.5
రామగుండం	13.6	నల్లగొండ	16.2
హకీంపేట్	14.6	మహబూబ్‌నగర్	17.6
దుండిగల్	14.7	ఖమ్మం	19.0
నిజామాబాద్	15.1	భద్రాచలం	19.0

శంషాబాద్ నుంచి విమానాల మళ్లింపు

దట్టంగా పొగమంచు కమ్మేయడంతో ల్యాండింగ్‌పై ప్రభావం

శంషాబాద్: పొగ మంచు దట్టంగా కమ్ముకోవడంతో సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో దిగాల్సిన దేశీయ, అంతర్జాతీయ విమానాలను దారి మళ్లించారు. పొగ మంచుతో రన్‌వే సరిగా కనబడక విమానాలను ల్యాండింగ్ చేసే పరిస్థితి లేకపోయిందని.. దాంతో ఇతర విమానాశ్రయాలకు మళ్లించాల్సి వచ్చిందని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ఉదయం 7.35 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగాల్సిన మస్కట్ విమానాన్ని బెంగళూరుకు తరలించారు. తర్వాత రియాద్, జెడ్డాల నుంచి వచ్చిన మరో రెండు విమానాలనూ బెంగళూరు విమానాశ్రయానికి దారి మళ్లించారు. అనంతరం తిరువనంతపురం, గోవా, చండీగఢ్‌ల నుంచి వచ్చిన విమానాలను విజయవాడ గన్నవరం విమానశ్రయానికి.. ముంబై నుంచి వచ్చిన విమానాన్ని నాగ్‌పూర్ విమానాశ్రయానికి తరలించారు.

క్లుప్తంగా...

బీఆర్ఎస్ పని ఖతం
మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ: 'రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయింది. త్వరలోనే ఆ పార్టీ మూడు, నాలుగు ముక్కలు అవుతుంది' అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని బాప్టిస్టు చర్చి, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని ఆరోపించారు. దొంగలకు తాళం చెవి ఇచ్చిన చందంగా.. కేసీఆర్ ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఇవ్వడంతో అవినీతికి పాల్పడ్డారని కోమటిరెడ్డి ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు, నల్లగొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అవినీతి జరిగిందని ఆరోపించారు. వీటిపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించనుందని, నాలుగైదు నెలల్లో నివేదికలు వస్తాయని తెలిపారు. యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో అవినీతికి పాల్పడ్డ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని జైలుకు పంపుతామన్నారు. బీఆర్ఎస్ నేతలు తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలవబోదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిందని, ఇందిరమ్మ మార్కు ప్రజాపాలన కొనసాగిస్తామని తెలిపారు.

రేషన్ కార్డులు లేనివారికి ఆరు హామీలు ఎలా?
తక్షణమే కొత్త కార్డులు మంజూరు చేయండి: బండి సంజయ్



కరీంనగర్ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు హామీల అమలుకు తెల్ల రేషన్‌కార్డే ప్రధాన అర్హతగా ప్రభుత్వం పేర్కొనడంపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ సందేహాలు వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పదేళ్లుగా ఒక్క కొత్త రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, ఇప్పటికే 10 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. తక్షణమే కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించాలని సూచించారు. ఆరు పథకాల అమలుకు అన్ని రాజకీయ పార్టీలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి సందర్భంగా కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో 'సుపరిపాలన దినోత్సవం'నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బండి మాట్లాడుతూ.. వాజ్‌పేయికి నిజమైన వారసుడు ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీయేనన్నారు. ముస్లిం దేశాలు నిషేధించిన తబ్లీగ్‌జమాతే సంస్థ సమావేశాలకు ప్రభుత్వం నిధులెట్లా విడుదల చేస్తుందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, కుట్ర, మభ్యపెట్టడమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని, లేకుంటే పోరాటం చేస్తామని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 రోజులవుతోందని, హామీల అమలు కోసం మరికొన్ని రోజుల సమయమిచ్చి, పరిస్థితిని బట్టి స్పందిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేక ధోరణి ఉందని ఆరోపించారు. ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే నేతలు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా సనాతనధర్మాన్ని అవమానిస్తూ మాట్లాడినప్పుడు, హిందూ మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలంటూ అవహేళన చేసినప్పుడు కూటమిలో కీలకపాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ పథకాల అమల్లో ముందుండండి: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు సోనియాగాంధీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగానే ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. ఈ పథకాలను అమలు చేయడంలో పార్టీ కేడర్ ముందుండి పని చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఏ హామీనీ నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశలో ముందుకెళ్తోందని, ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించడంలో పార్టీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని వీహెచ్ సూచించారు. ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 6 వరకు ప్రజలకు అందుబాటులో ఉండి నిరక్షరాస్యులు, పేద ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులను వీహెచ్ కోరారు.

'షా' రొస్తున్నారు

28న రాష్ట్రానికి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- కమలనాథులకు లోక్‌సభ ఎన్నికలపై దిశానిర్దేశం
- పార్టీ మండల అధ్యక్షుల మొదలు.. నేతలందరితో భేటీ
- బీజేపీ ఎమ్మెల్యేలతోనూ సమావేశం
- అదే రోజు బీజేఎల్పీ నేతను ప్రకటించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలోని మిగతా రాజకీయ పార్టీల కంటే ముందుగా సన్నాహాలకు బీజేపీ తెరలేపింది. ఈ నెల 28న నగర శివారు కొంగరకలాన్‌లోని శ్లోక ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న లోక్‌సభ సన్నాహక సమావేశానికి బీజేపీ అగ్రనేత, కేంద్రహోంమంత్రి అమిత్‌షా హాజరవుతున్నారు. పార్టీ మండల అధ్యక్షులు మొదలుకుని రాష్ట్రస్థాయి వరకు నాయకుల వరకు హాజరయ్యే ఈ భేటీలో రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేయనున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 నుంచి 20 మందిని ఆహ్వానిస్తున్నారు. మొత్తంగా రెండున్నరవేల మంది వరకు నాయకులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. తెలంగాణలో పార్టీకి చెందిన ముఖ్యమైన నాయకులంతా హాజరుకావడం ద్వారా లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధమయ్యేందుకు అవకాశం ఉంటుందని ముఖ్య నేతలు అంచనా వేస్తున్నారు.

ప్రజల వద్దకు ఎలా వెళ్లాలన్న దానిపై ఆ సమావేశంలో స్పష్టత

ప్రధానంగా ఏయే అంశాల ప్రాతిపదికన ప్రజల వద్దకు వెళ్లాలి, లోక్‌సభ ఎన్నికల్లో వివిధ వర్గాల ప్రజల మద్దతు కూడగట్టేందుకు ఏయే అంశాలు ప్రస్తావించాలి, మోదీ సర్కార్ పదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాల ద్వారా అందిన ఫలాలపై ఏ విధంగా ప్రచారం నిర్వహించాలన్న దానిపై ఆ సమావేశం తర్వాత స్పష్టత వస్తుందని చెబుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికలు 2019 ఏప్రిల్‌లో జరగగా, ఈసారి అంతకంటే ముందుగా మార్చి చివరిలోగానే ఎన్నికలు వచ్చే అవకాశాలున్నాయని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. అందుకే అన్ని పార్టీల కంటే ముందుగానే ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడం ద్వారా మంచి ఫలితాలు (గతంలో గెలిచిన 4 ఎంపీ సీట్లకు బదులు 10 వరకు గెలిచి.. సీట్లు పెంచుకోవాలనే లక్ష్యంతో జాతీయ నాయకత్వం ఉంది) సాధిస్తామనే విశ్వాసం పార్టీ నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ భేటీ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, పార్టీ అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడానికి కారణాలపైనా విశ్లేషించవచ్చని చెబుతున్నారు.

లోక్‌సభ ఇన్‌చార్జిల నియామకంపై కసరత్తు

రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు పార్టీపరంగా లోక్‌సభ ఇన్‌చార్జిల నియామకం (17 మంది సంస్థాగతంగా ఫుల్‌టైమర్స్‌కు అదనం)తో పాటు ఎన్నికలకు సంబంధించిన ప్రత్యేక వర్కింగ్ టీమ్ నియామకంపై కూడా ఈ భేటీలో కసరత్తు జరుగనుందని పార్టీ నేతల సమాచారం. ఇటీవల కొత్తగా గెలిచిన 8మంది ఎమ్మెల్యేలతో అమిత్‌షా ప్రత్యేకంగా సమావేశం కావడంతో పాటు... భారతీయ జనతా శాసనసభాపక్షం (బీజేఎల్పీ)నేత ఎన్నిక కూడా అదే రోజు జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఈ పదవి కోసం ఎమ్మెల్యేల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. వరుసగా మూడుసార్లు గెలిచిన టి.రాజాసింగ్, రెండుసార్లు గెలిచిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డిల్లో ఒకరికి ఈ పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోమవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో... పార్టీపరంగా లోక్‌సభకు ముందస్తుగా చేస్తున్న ఏర్పాట్లు, సన్నాహకాలపై రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్‌తో కేంద్ర మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సమీక్షించారు.

చేరికలపై హస్తం ఫోకస్..!

- లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లలో గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ కసరత్తు
- టికెట్ల హామీతో బీజేపీలోని కీలక నేతలను చేర్చుకునే యోచన
- గతంలో కాంగ్రెస్‌లో పనిచేసిన బీసీ నేతలకు ఆహ్వానం
- ఇప్పటికే పలువురితో మంతనాలు..
- కరీంనగర్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలపై దృష్టి
- 15 ఎంపీ స్థానాలు దక్కించుకోవాలన్న ధ్యేయంతో వ్యూహాలు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కువ సీట్లు దక్కించుకునే లక్ష్యంతో కాంగ్రెస్ పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వచ్చి, అధికారం చేపట్టిన నేపథ్యంలో.. పార్టీని మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపాలని భావిస్తోంది. ఈ క్రమంలో గతంలో కాంగ్రెస్‌లో పనిచేసి వెళ్లిన నేతలను, బీజేపీలోని కీలక నేతలను చేర్చుకోవాలని యోచిస్తోంది. ఏఐసీసీ పర్యవేక్షణలో ఇప్పటికే పలువురు బీజేపీ ముఖ్య నాయకులతో కాంగ్రెస్ నేతలు చర్చలు కూడా జరిపినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల నేతలపై ఫోకస్ పెట్టినట్టు సమాచారం. మొత్తమ్మీద 15 ఎంపీ స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నది కాంగ్రెస్ ఆలోచనగా కనిపిస్తోంది.

జాతీయ స్థాయిలో ప్రయోజనం కోసం..

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను పదింట బీజేపీతోనే పోటీ ఉంటుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ శివారు స్థానాలు, ఉత్తర తెలంగాణలోని లోక్‌సభ సీట్లలో కమలనాథుల నుంచి గట్టిపోటీ ఉంటుందని భావిస్తోంది. ఈ క్రమంలో ఆ పార్టీకి చెందిన లోక్‌సభ అభ్యర్థుల స్థాయి నేతలను చేర్చుకోవడం ద్వారా.. ఆదిలోనే బీజేపీకి చెక్ పెట్టవచ్చనే ఆలోచనతో కాంగ్రెస్ ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

ఇప్పటికే మంతనాలు షురూ..

కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ బీజేపీ కీలక నేతను చేర్చుకునే విషయంలో టీపీసీసీ నేతలు ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలిసింది. ఆయనకు కరీంనగర్ లోక్‌సభ స్థానాన్ని ఆఫర్ చేయడంతోపాటు ప్రభుత్వంలో మంచి ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన మాజీ ఎంపీలతోపాటు మెదక్ జిల్లాకు చెందిన ఓ కీలక నేతతోనూ టచ్‌లోకి వెళ్లినట్టు తెలిసింది. మరో ఐదేళ్లదాకా తెలంగాణలో బీజేపీ నిలదొక్కుకోవడం కష్టమని.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా నిలిస్తే, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను పక్కాగా నిలువరించవచ్చని సదరు నేతలకు స్పష్టం చేసినట్టు సమాచారం. ఇక హైదరాబాద్ శివారు నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు బీసీ నేతలు గతంలో కాంగ్రెస్‌లో పనిచేసి ఉన్న నేపథ్యంలో.. వారిని కూడా పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరమైనట్టు తెలిసింది. మొత్తమ్మీద లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందే బీజేపీ కీలక నేతలను చేర్చుకోవడం ద్వారా.. పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగవచ్చని భావిస్తున్నట్టు సమాచారం.

సొంత జాగా ఉన్నవారికే!

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. అయితే నిర్ధారిత డిజైన్‌లో ఇళ్లను నిర్మించాలంటే.. ఒకే చోట భూమిని సేకరించాల్సి ఉంటుంది. సొంత జాగా ఉన్నవారు నిర్మించుకునే ఇళ్ల నిర్ధారిత డిజైన్‌లో ఉండాలంటే ఇబ్బంది ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. కొందరు ఉమ్మడి కుటుంబంగా ఒకే ఇంట్లో ఉంటున్నారు. అందులో పెళ్లిళ్లు అయినవారు కొత్తగా ఇళ్లకు దరఖాస్తు చేసుకునే వీలుంది. వారు ఉంటున్న ఇంటికి ఆనుకుని ఉండే ఖాళీస్థలాల్లో ఇళ్లను నిర్మించుకుంటారు. అలాంటి ఖాళీ స్థలం ఆకృతి, అధికారులు సిద్ధం చేసే డిజైన్ ప్రకారం ఇల్లు నిర్మించేందుకు అనుకూలంగా ఉండకపోవచ్చనే సందేహాలు ఉన్నాయి.

అమరుల కుటుంబాలకు ముందుగానే ప్లాట్లు..: ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు 250 గజాల చొప్పున ప్లాట్లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అదే స్థలాల్లో వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల్లో సొంత జాగా లేనివారికి పట్టాలు ఇచ్చేందుకు కాస్త సమయం తీసుకున్నా.. అమరుల కుటుంబాలకు మాత్రం వెంటనే ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే జాబితా రూపకల్పన, భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది.

కోదండరాంకు కీలక పదవి!

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా నియమించవచ్చని ఊహాగానాలు
- అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి వైస్‌చైర్మన్ పదవి ఇవ్వొచ్చని కూడా చర్చ
- అమరవీరుల సంక్షేమ బోర్డు లాంటి పదవులకూ అవకాశం



సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టితో సమావేశమైన కోదండరాం తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాజకీయ జేఏసీ చైర్మన్ హోదాలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ కోదండరాం సేవలను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వినియోగించుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీజేఎస్ అధ్యక్షుడి హోదాలో ఆయన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో సోమవారం సచివాలయంలో భేటీ కావడంతో ఈ చర్చ ఊపందుకుంది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఆయనకు రాష్ట్ర స్థాయిలో కీలక పదవి ఇస్తారని, లేదంటే ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కూడా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్ర అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి దానికి వైస్‌చైర్మన్‌గా కోదండరాంను నియమించే అవకాశం ఉందని కూడా ఊహాగానాలు వస్తున్నాయి.

బేషరతుగా మద్దతు...

వాస్తవానికి తెలంగాణ జనసమితి (టీజేఎస్) ఏర్పాటు తర్వాత రెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ కోదండరాం కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడ్డారు. 2018 ఎన్నికల్లో పార్టీ తరఫున కొన్ని స్థానాల్లో పోటీ చేసినప్పటికీ 2023లో ఒక్క అసెంబ్లీ స్థానం కోసం కూడా డిమాండ్ చేయకుండా బేషరతుగా కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. ఆ సమయంలోనే కోదండరాంకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తగిన హోదా కల్పిస్తామని, తెలంగాణ అమరవీరుల సంక్షేమాన్ని అమలు చేసే బాధ్యత ఆయనకు అప్పగిస్తామని కాంగ్రెస్ వర్గాలు హామీ ఇచ్చాయి.

మర్యాద పూర్వకమేనని చెబుతున్నా...

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సచివాలయంలో కలిశారు. ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి భట్టిని కలిసి అభినందనలు తెలిపారు. భేటీలో భాగంగా అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్వేతపత్రాలు, వాటిపై ప్రజల అభిప్రాయం, వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ప్రాధాన్యాలపై భట్టితో టీజేఎస్ బృందం చర్చించినట్లు సమాచారం.

అవి రెండూ అవినీతి పత్రాలే..

- శ్వేత, స్వేద పత్రాలపై కిషన్‌రెడ్డి ధ్వజం
- కోవిడ్ వ్యాప్తిపై రాష్ట్రాలను అప్రమత్తం చేశామని వెల్లడి



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం, ప్రతిపక్ష బీఆర్ఎస్ స్వేద పత్రం.. రెండూ అవినీతి పత్రాలేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి విమర్శించారు. ఆ రెండు పత్రాలు కూడా ప్రజలను మభ్యపెట్టి మోసం చేసేందుకేనని నిందించారు. భారతరత్న, దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఇతరనేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ మాట్లాడుతూ... వాజ్‌పేయి జయంతిని కేంద్రం సుశాసన్ దినోత్సవ్ పేరుతో నిర్వహిస్తోందన్నారు. ఒక్క ఓటు తగ్గినా.. నైతిక విలువలకు కట్టుబడి ప్రధాని పదవికి వాజ్ పేయి రాజీనామా చేశారని గుర్తు చేశారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించాలని వాజ్‌పేయి ఆకాంక్షించారని, త్వరలోనే ఆయన కల సాకారం కాబోతుందన్నారు. దేశంలో సుపరిపాలనకు ఆద్యుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అంత్యోదయ నినాదంతో వాజ్‌పేయి దేశంలో సుపరిపాలనకు సరికొత్త నిర్వచనం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా వాజ్‌పేయి చూపిన మార్గంలో.. నడుస్తోందని పేర్కొన్నారు.

కొత్త వేరియెంట్ ప్రమాదకరం కాదు..

కోవిడ్ వ్యాప్తిపై రాష్ట్రాలను అప్రమత్తం చేసినట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. అవసరాన్ని బట్టి కోవిడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఫీవర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొత్త వేరియంట్ వ్యాప్తి వేగంగా ఉంటుందని.. అయితే ప్రమాదకరం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా కోవిడ్ కట్టడికి కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

చేవెళ్లపై బీఆర్ఎస్ దృష్టి

- ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ భేటీ
- పార్లమెంట్ ఎన్నికల్లో వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం
- వచ్చే జనవరి 3వ తేదీ నుంచి జనంలోకి వెళ్లాలని నిర్ణయం



సమావేశానికి హాజరైన కేటీఆర్, సబిత, ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రస్తుతమున్న సిట్టింగ్ ఎంపీ స్థానాలు చేజారకుండా కాపాడుకోవడంతో పాటు మిగిలిన లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ గులాబీ జెండాను రెపరెపలాడించాలని యోచిస్తోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పటోళ్ల సబితాఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, అరికెపూడిగాంధీలతోపాటు మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్‌తో సమావేశం అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలే ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. చేవెళ్ల ఎంపీ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పొందిన ఓట్ల కంటే 1.85 శాతం ఓట్లు మాత్రమే బీఆర్ఎస్‌కు తక్కువగా వచ్చాయి. పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో కొద్దిగా శ్రమిస్తే మళ్లీ చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగరేయొచ్చని ఆ పార్టీ భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను విశ్లేషించడంతో పాటు వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థి ఖరారు, ప్రచారం, గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై కేటీఆర్ వారికి దిశానిర్దేశం చేశారు. మండలాలవారీగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి, జనవరి మూడు నుంచి జనంలోకి వెళ్లాలని నిర్ణయించారు.

మళ్లీ టికెట్ నాకే: ఎంపీ రంజిత్‌రెడ్డి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనకే మళ్లీ టికెట్ ఇచ్చేందుకు పార్టీ అంగీకరించిందని, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ప్రచారానికి ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్‌కూడా ఇచ్చినట్టు సోమవారం మీడియా ముఖంగా ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రకటించారు. జనవరి 3వ తేదీ నుంచి ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తానని చెప్పారు.

అసలు వీళ్లు మంత్రులేనా?

కర్ణాటక మంత్రి కరువు వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ కోసం ఏటా కరువు పరిస్థితులు ఏర్పడాలని రైతులు కోరుకుంటారని కర్ణాటక కాంగ్రెస్ మంత్రి శివానంద పాటిల్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించారు. 'అసలు వీళ్లు మంత్రులేనా.. రైతులపై ఇలాంటి హాస్యాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. అత్యంత కఠినమైన పరిస్థితుల్లో తమకు ప్రభుత్వం సానుభూతితో అండగా ఉండాలని మాత్రమే రైతులు కోరుకుంటారు'.. అని కేటీ రామారావు వ్యాఖ్యానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో మంత్రి పొన్నం, మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

4 కోట్ల జీరో టికెట్లు ఇచ్చాం

దశల వారీగా హామీల అమలు: మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, ఆదిలాబాద్, కైలాస్‌నగర్: ఆర్టీసీ బస్సుల్లో ఈనెల 9నుంచి అమలు చేసిన మహిళలకు ఉచిత రవాణా సదుపాయం ద్వారా ఇప్పటివరకు 4 కోట్ల జీరో టికెట్లు ఇచ్చామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈనెల 28న కాంగ్రెస్ ఆవిర్భావ సదస్సు నాగ్‌పూర్‌లో నిర్వహించనుండగా, ఇక్కడి నుంచి శ్రేణులను సమీకరించే విషయమై ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తామన్నారు. ఈనెల 28 నుంచి నిర్వహించనున్న గ్రామసభల్లో కౌంటర్ల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. సంపదను సృష్టించామని స్వేదపత్రం ద్వారా తెలిపిన కేటీఆర్ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను కూడా వివరిస్తే బాగుండేదని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ రూ.7లక్షల కోట్ల అప్పుల ఊబిలో ఈ రాష్ట్రం కూరుకుపోయిందని ప్రకటించేసరికి బీఆర్ఎస్ నేతలకు చెమటలు పట్టాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నాగ్‌పూర్ సదస్సును విజయవంతం చేయాలన్నారు.

అక్కసుతోనే ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం: దుద్దిళ్ల, పొన్నం

అధికారం కోల్పోయామనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక, అక్కసుతోనే బీఆర్ఎస్ తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం రాత్రి స్థానిక ప్రజాసేవ భవన్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో శ్వేతప్రతంపై తెల్లముఖం వేసిన బీఆర్ఎస్ బయటికొచ్చి.. స్వేదపత్రం పేరిట రాజకీయం చేస్తోందని విమర్శించారు.

మహిళా ప్రజాప్రతినిధులపై కేసు నమోదు

జాతీయ మహిళా కమిషన్ ఆదేశాలతో అధికారుల చర్యలు

శామీర్‌పేట్: జాతీయ మహిళా కమిషన్ ఆదేశాలతో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళా ప్రజాప్రతినిధులపై శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... గత ఏడాది మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ పదేళ్ల సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి అప్పటి జిల్లా మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ మండలం, అంకుషాపూర్ ఎంపీటీసీ శోభారాణి రైతుల సమస్యలపై మాట్లాడుతుండగా ఆగ్రహానికి లోనైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆమెను బయటికి లాక్కెళ్లాలని అక్కడే ఉన్న కొందరు మహిళ ప్రజాప్రతినిధులను ఆదేశించాడు. దీంతో మేడ్చల్ ఎంపీపీ రజిత, శామీర్‌పేట ఎంపీపీ దాసరి యెల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్యలతో పాటు మరికొందరు ప్రజాప్రతినిధులు తనను బయటకు లాక్కెళ్లి అవమానించారని జాతీయ మహిళ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన కమిషన్ ఈ చర్యకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రజిత, దాసరి యెల్లుబాయి, అనిత, మేకల కావ్య లపై శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేపై కూడా కేసు నమోదు చేయాలి: బాధితురాలు శోభారాణి

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశాలతోనే బీఆర్ఎస్ మహిళా ప్రతినిధులు తనపై దాడి చేశారని బాధితురాలు శోభారాణి ఆరోపించింది. రాష్ట్ర మహిళా కమీషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపింది. తనను బయటకు లాక్కెళ్లాలని ఆదేశించిన అప్పటి మంత్రి మల్లారెడ్డితో పాటు మరికొందరు బీఆర్ఎస్ ప్రతినిధులపై కేసు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ప్రజాభవన్ బారికేడ్లను ఢీకొన్న కారు..

కారులో మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు?

పంజగుట్ట: తెల్లవారు జామున అతివేగంగా వచ్చిన ఓ కారు ప్రజాభవన్ ముందు ఉన్న బారికేడ్లను ఢీ కొనడంతో కారుతోపాటు బారికేడ్లు ధ్వంసమైన సంఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలివీ... ఆదివారం తెల్లవారు జామున సోమాజిగూడ రాజీవ్ సర్కిల్ నుంచి ప్రజాభవన్ మీదుగా బేగంపేట వెళుతున్న బీఎండబ్ల్యూ కారు అతి వేగం కారణంగా అదుపుతప్పి ప్రజాభవన్ ముందు ఉన్న బారికేడ్లను ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కావడమే కాకుండా బారికేడ్లు కూడా ధ్వంసమయ్యాయి. సెక్యూరిటీ సిబ్బంది కారుతో పాటు డ్రైవ్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని పంజగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తప్పించారా.. ? తప్పించుకున్నాడా..?

ప్రమాదానికి గురైన కారులో మాజీ ఎమ్మెల్యే కుమారుడితో పాటు మరో ముగ్గురు యువకులు ఉన్నట్లు సమాచారం. పంజగుట్ట పోలీసులు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించి అతడిని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసేందుకు తీసుకెళ్తుండగా అతను మరో కారు ఎక్కి అక్కడి నుంచి తప్పించుకున్నట్లు సమాచారం. కాగా నిందితుడిని కావాలనే తప్పించారా లేక తప్పించుకుపోయాడా అనే అంశంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.



మనందరి వైపు చూసి మృత్యువు నవ్వుతుంది:
మనం చేయగలిగినదల్లా తిరిగి నవ్వడమే!
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 26 డిసెంబర్ 2023

పరువు కోసం కుస్తీ!

ఏదైనా ఒక తప్పు జరిగినప్పుడు... తక్షణమే సరిదిద్దకపోతే, ఆపైన అన్నీ తప్పులే జరుగుతాయట. ప్రాచుర్యంలో ఉన్న లోకోక్తి అది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కథ సరిగ్గా అలానే ఉంది. సమాఖ్యలోని అవకతవకలు, మహిళా మల్లయోధులపై సమాఖ్య అధ్యక్షుడు, కోచ్‌ల లైంగిక వేధింపుల గురించి ఏడాది పైగా వివాదాలు రేగుతూనే ఉన్నాయి. అయినా, కంటితుడుపులకే తప్ప, కఠిన చర్యలకు దిగని కేంద్ర పాలకులు తాజాగా సమాఖ్యపై సస్పెన్షన్ వేటువేయక తప్పలేదు. వివాదాస్పద బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ సారథ్యంలో సమాఖ్య గబ్బుపడితే, తాజాగా ఆయన సహచరుడు సంజయ్ సింగ్ సారథ్యంలో ఏర్పడ్డ కొత్త కార్యవర్గం సైతం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, ఎన్నికైన మూణ్ణాళ్ళకే సస్పెన్షన్ వేటుకు గురైన దుస్థితి. ఆదివారం నాటి ఈ సస్పెన్షన్‌తో మన రెజ్లింగ్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. దేశానికి పేరు తెచ్చిపెట్టిన క్రీడాకారులెందరో ఉన్నప్పటికీ, మన కుస్తీ గోదా కథ ఆశించినంత గొప్పగా లేదని మరోమారు తేలిపోయింది.

ఒలింపిక్ పతకాలు సాధించిన మన మల్లయోధులు సాక్షీ మాలిక్, బజరంగ్ పూనియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతక విజేత వినేశ్ ఫోగట్‌లు సమాఖ్యలో అవతవకలపై గళం విప్పి మరి కొద్ది రోజుల్లో ఏడాది కావస్తోంది. ఈ పన్నెండు నెలల కాలంలో ర్యాలీలు, దేశ రాజధాని నడిబొడ్డున ఆటగాళ్ళ ధర్నాలు, వేధింపుల ఆరోపణలతో బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసుల కేసులు, దర్యాప్తులు... ఇలా అనేక నాటకీయ ఘటనలు చూశాం. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ తప్పనిసరై తన పదవికి దూరం జరిగాడు. అయితే, పేరుకు పదవిలో లేకపోయినా, వెనుక నుంచి చక్రం తిప్పుతున్నది అతగాడేనని సమాఖ్య కొత్త కార్యవర్గం తాజా ఎన్నికల్లోనూ తేలిపోయింది. బ్రిజ్‌భూషణ్‌కు దీర్ఘకాలంగా నమ్మిన బంటైన సంజయ్‌సింగ్ గత గురువారం డిసెంబర్ 21న జరిగిన ఎన్నికల్లో సమాఖ్య కొత్త అధ్యక్షుడయ్యారు. ఎన్నికలు జరిగిన 15 పదవుల్లో 13ను ఆ జట్టే గెలిచింది. పైగా, లైంగిక వేధింపులపై ఇంత రచ్చ జరుగుతున్నా ఎన్నికైనవారిలో కనీసం ఒక్క మహిళైనా లేకపోవడం మరీ విడ్డూరం.

అయినా వ్యవస్థ మారకుండా పేరుకు వ్యక్తులు మారితే ప్రయోజనం ఏముంటుంది! పాత తానులోని ముక్కే అయిన కొత్త అధ్యక్షుడు వస్తూనే సమాఖ్య నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 28 నుంచి యూపీలో అండర్–15, అండర్–20 వారికి జాతీయ ఛాంపియన్‌షిప్స్ జరుగుతాయని ప్రకటించారు. సమాఖ్య సెక్రటరీ జనరల్‌ను సంప్రతించడం లాంటి నియమాలేవీ పాటించనేలేదు. పైగా, లైంగిక వేధింపులు జరిగినట్టు ఆరోపణలున్న ప్రాంగణంలోనే, అదే పాత కాపుల కనుసన్నల్లోనే కొత్త కమిటీ సాగుతుండడం దిగ్భ్రాంతికరం. ఈ రాజ్యాంగ విరుద్ధ చర్య వివాదానికీ, ఫిర్యాదులకూ దారి తీసింది. మరోపక్క ఎన్ని పోరాటాలు చేసినా, ప్రభుత్వానికి మరెన్ని వినతులు ఇచ్చినా పాత కథే పునరావృతం కావడం ఆటగాళ్ళే కాదు, ఎవరూ జీర్ణించుకోలేని విషయం. రెజ్లర్ సాక్షీ మాలిక్ కుస్తీకి పూర్తిగా స్వస్తి చెబుతున్నట్టు కన్నీటి పర్యంతమవుతూ ప్రకటించారు. మరో రెజ్లర్ బజరంగ్ పునియా తన పద్మశ్రీ పతకాన్ని ప్రభుత్వానికి వెనక్కి ఇచ్చేస్తున్నట్టు శుక్రవారం స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో సర్కార్ ఒత్తిడిలో పడింది. హడావిడిగా కొత్త కమిటీపై సస్పెన్షన్ వేటు వేసింది. సమాఖ్య నిర్వహణకు తాత్కాలిక ప్యానెల్‌ను నియమించాల్సిందిగా భారత ఒలింపిక్ సంఘాన్ని (ఐఓఏ) కోరింది.

రెజ్లింగ్ సమాఖ్యను సరిదిద్దేందుకు ఎప్పుడో చర్యలు చేపట్టాల్సిన సర్కార్ ఇప్పటికి గాఢనిద్ర నుంచి మేలుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఈ మాత్రమైనా కదలిక రావడం మంచిదే. కానీ, ఇది సరిపోతుందా అన్నది ప్రశ్న. దేశానికి పతకాలు పండిస్తున్న క్రీడాంశంలో, అందులోనూ అంతర్జాతీయంగా మన ప్రతిష్ఠను పెంచిన ఆటగాళ్ళ నిఖార్సయిన ఆందోళనలపై మన పాలకులు ఇన్నాళ్ళు కాలయాపన చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? స్వపక్ష పార్లమెంట్ సభ్యుడే సమాఖ్య అధ్యక్షుడు కావడం, సార్వత్రిక ఎన్నికల బరిలో ఓట్లు – సీట్ల సంఖ్యను ప్రభావితం చేసే శక్తిమంతుడు కావడంతో బీజేపీ పెద్దలు ఇంతకాలం విషయం సాగదీశారనేది సుస్పష్టం. వినేశ్ ఫోగట్ అన్నట్టు... రెజ్లింగ్ సమాఖ్యలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇక దేశంలో కుస్తీ క్రీడ ఆడపిల్లకు భద్రత లేని అంశంగా మిగిలిపోతుంది. కానీ, 'బేటీ బచావో... బేటీ పఢావో' అంటూ బీరాలు పలికే పాలకులకు ఇది పెద్దగా పట్టినట్టు లేదు.

మన సొంతింటి రెజ్లింగ్ వ్యవహారం ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి అప్రతిష్ఠగా పరిణమించింది. నిజానికి, క్రీడా సంస్థలపై వివాదాలు కొత్త కావు. క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు, ఆటగాళ్ళ ఎంపికలో అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు తరచూ వినబడుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమన చర్యలతోనే సరిపుచ్చుతున్నాయి తప్ప, సమూల ప్రక్షాళనకు సమకట్టడం లేదు. రాజకీయాలకు అతీతంగా సాగాల్సిన క్రీడాసంస్థల్ని అధికార పార్టీల జేబు సంస్థలుగా, వారసత్వపు గడీలుగా నడుపుతున్నారు. పెద్ద స్థానాల్లో ఉన్న ఒకప్పటి స్టార్ ఆటగాళ్ళు సైతం తటస్థంగా, నిష్పక్షపాతంగా ఉండాల్సింది పోయి, తమకా పదవులిచ్చిన పార్టీల ప్రయోజనాలకు డూడూ బసవన్నలవుతున్నారు. ప్రజల్లో నమ్మకం పోగొట్టుకున్న, లోపభూయిష్ఠమైన మన క్రీడా నిర్వహణలో తక్షణ సంస్కరణలు అవసరం. లేదంటే, తీరని నష్టం. పాలకులు స్వపక్షాభిమానం వదిలి, కఠిన కార్యాచరణకు పూనుకోనట్లయితే... మన క్రీడావీరుల కష్టానికీ, కన్నీళ్ళకూ విలువేముంది! రాజకీయం ఆట కావచ్చేమో కానీ, ఆటలు రాజకీయం కాకూడదు!!

భూసమస్యలన్నీ పరిష్కారమయ్యేలా...

అభిప్రాయం



అజేయ కల్లం

దాదాపు వందేళ్ళ క్రితం బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ సర్వేలో భూమిని అనుభవిస్తున్న వారి వివరాలతో వాటి వాస్తవ స్థితిని నిర్ధారించారు. అయితే రెవెన్యూ రికార్డులను సరిగ్గా అప్‌డేట్ చేయకపోవడం, వివిధ చట్టాల్లో తీసుకువచ్చిన మార్పుల కారణంగా క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, వ్యత్యాసాలు భూమి రికార్డుల్లో నమోదు కాలేదు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'రికార్డ్ ఆఫ్ రైట్స్' చట్టాన్ని (భూ యాజమాన్య హక్కు చట్టం) తెచ్చింది. భూ యాజమాన్య హక్కులకు సంబంధించి ఎదురవుతున్న అనేక సమస్యలను పరిష్కరించడానికి డ్రోన్లు, విమానాల ద్వారా భూముల రీ సర్వే చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి భూకమతంలో పట్టాదారు వాస్తవ స్థితిని ధ్రువీకరించేలా సర్వే జరుగుతోంది.

భారతీయుల్లో భూమికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. సమాజంలోని అన్ని వర్గాల సంస్కృతులు భూ యాజమాన్యానికి అనుకూలంగా ఉండడం వల్ల అందరూ దాన్ని కోరుకుంటారు. దేశంలోని గ్రామీణ కుటుంబాల మొత్తం ఆస్తిలో భూమి 73 శాతం ఉండగా, పట్టణ గృహాల ఆస్తిలో భూమి, భవనాలు 90 శాతం ఉన్నట్లు 2013 ఎన్ఎస్ఎస్ఓ నివేదికలో తేలింది. అందుకే పెట్టుబడిదారులు, రుణదాతలు, బ్యాంకర్లు స్పష్టమైన టైటిల్, స్పష్టమైన ల్యాండ్ మ్యాపింగ్, రికార్డుల నిర్వహణ, స్పష్టమైన హక్కులు ఉండాలని కోరుకుంటారు. కానీ మెకెన్సీ సంస్థ నిర్వహించిన ఒక అధ్యయనంలో దేశంలోని ఎక్కువ భూముల యాజమాన్యానికి సంబంధించి చట్టపరమైన వివాదాలున్నాయని తేలింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ తరహా భూముల వివాదాలు 5 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. కానీ మన దేశంలో దాదాపు 70 శాతం సివిల్ వివాదాలున్నాయి.

ప్రస్తుత రెవెన్యూ రికార్డులు ప్రాథమికంగా బ్రిటిష్ ప్రభుత్వం 100 ఏళ్ల క్రితం నిర్వహించిన సర్వే ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. అవన్నీ ప్రభుత్వానికి భూముల ద్వారా ఎక్కువ ఆదాయాన్ని సేకరించే లక్ష్యంతో రూపొందించినవి. స్వాతంత్ర్యం వచ్చాక కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు భూమిని సాగు చేసేవారికి సురక్షితమైన హక్కులు ఉండేలా ప్రోత్సహించడానికి అనేక భూ సంస్కరణలు ప్రవేశపెట్టాయి. 'ఎస్టేట్‌లు – ఇనామ్ నిర్మూలన చట్టం', 'వ్యవసాయ భూముల సీలింగ్ చట్టం', 'పీఓటీ' చట్టం, 'ఆర్ఓఎఫ్ఆర్' వంటి చట్టాలను వరుసగా వచ్చిన ప్రభుత్వాలు సాగుదారులకు అనుకూలంగా తీసుకువచ్చాయి. భూముల యాజమాన్యంలో జరిగిన ఈ మార్పులన్నీ రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కినా... కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల క్రమం తప్పకుండా నవీకరణ (అప్‌డేట్) అవలేదు.

దాదాపు 100 సంవత్సరాల క్రితం జరిగిన సర్వేలో భూమిని అనుభవిస్తున్న వారి వివరాలతో వాటి వాస్తవ స్థితిని నిర్ధారించినా... రెవెన్యూ రికార్డులను సరిగ్గా అప్‌డేట్ చేయకపోవడం, వివిధ చట్టాల్లో తీసుకువచ్చిన మార్పుల కారణంగా క్షేత్ర స్థాయిలో నెలకొన్న పరిస్థితులు, వ్యత్యాసాలు భూమి రికార్డుల్లో నమోదు కాలేదు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఏపీ ప్రభుత్వం 'రికార్డ్ ఆఫ్ రైట్స్' చట్టాన్ని ప్రవేశపెట్టింది. అలాగే ఆ చట్టాన్ని సవరించడం ద్వారా గ్రామాల వారీగా ప్రతి వ్యక్తి అధీనంలో ఉన్న భూమి వివరాలను రికార్డుల్లో అప్‌డేట్ చేసింది. ఇలా హక్కుల రికార్డును ప్రవేశపెట్టిన తర్వాత కూడా భూ వివాదాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రస్తుత రెవెన్యూ రికార్డులు ఊహాజనిత హక్కును మాత్రమే కల్పిస్తాయి. కొన్ని కేసుల్లో రికార్డులు క్షేత్ర స్థాయి పరిస్థితికి విభిన్నంగా ఉంటాయి. కోర్టు కేసులు, వారసత్వాలు, తనఖా వంటి భూమికి సంబంధించిన వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించే ఎలాంటి ఒకే ఒక్క మూలాధారం ప్రస్తుత రికార్డుల్లో లేదు. దీనివల్ల భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్యలన్నింటినీ ఒకేసారి పరిష్కరించేందుకు ఏపీ ప్రభుత్వం రాష్ట్రం మొత్తాన్ని డ్రోన్లు, విమానాల ద్వారా భూముల రీ సర్వే చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి భూ కమతంలో పట్టాదారు వాస్తవ స్థితిని ధ్రువీకరించేలా సర్వే జరుగుతోంది. భూ యాజమాన్యంపై ఉన్న గందరగోళాన్ని తొలగించేలా రీ సర్వేలో ప్రతి భూభాగానికి జియో రిఫరెన్స్ ఇస్తున్నారు. భూమి, దానికి సంబంధించిన రికార్డులను అనేక శాఖలు (రెవెన్యూ, పంచాయితీ రాజ్, పట్టణ స్థానిక సంస్థలు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, రిజిస్ట్రేషన్ శాఖలు) నిర్వహిస్తుండడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. అలాగే పౌరులు వాటికి సంబంధించిన అనుమతులు, సేవలు పొందేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆ పరిస్థితి ఎందుకంటే?

భూమి యాజమాన్యం సార్వభౌమాధికారంతో ఉంటుందని దేశంలో చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసిన విషయం. అనేక అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా నిశ్చయాత్మకమైన టైటిల్ విధానానికి (కన్‌క్లూజివ్ టైటిల్ విధానం) మన దేశం వెళ్లలేదు. ఇప్పుడు ఉన్న ల్యాండ్ టైటిల్ విధానం... యాజమాన్యాన్ని ధ్రువీకరించే నిశ్చయాత్మక టైటిల్‌కు విరుద్ధంగా 'అనుకూల టైటిల్ కాన్సెప్ట్' (ప్రిజెమ్టివ్ టైటిల్) ఆధారంగా రూపొందించబడింది. అంటే భూమి అధీనంలో ఉన్న వ్యక్తి సదరు భూమికి సంబంధించి రెవెన్యూ శాఖకు పన్ను చెల్లిస్తున్న వ్యక్తిగా భావించబడే అర్థంలో ఇచ్చిన టైటిల్ మాత్రమే. అది కూడా '1872 ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్' ప్రకారం చట్టపరమైన స్వాధీనమే. భూమిపై లావాదేవీ జరిగినప్పుడు కూడా టైటిల్ వెరిఫికేషన్ అవసరం లేని వ్యవస్థ కారణంగా భూమి టైటిల్ విధానం పేలవంగా ఉంది. '1908 ఇండియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్' కూడా పత్రాల నమోదుకు సంబంధించిన చట్టమే తప్ప భూమి లేదా టైటిల్ రిజిస్ట్రేషన్‌కి సంబంధించినది కాదు. 1982 ఆస్తి బదిలీ చట్టానికి యాజమాన్యం యొక్క ధ్రువీకరణ అవసరం లేదు. భూమి లావాదేవీల విషయంలో ఆదాయాన్ని పెంచడానికి మాత్రమే ఈ చట్టాలు పరిమితమయ్యాయి. ఆ భూముల యాజమాన్యానికి సంబంధించి ఏదైనా ప్రశ్న తలెత్తితే, అది తనదేనని నిరూపించుకోవాల్సి బాధ్యత యజమానిపైనే ఉంటుంది.



తక్షణ సంస్కరణలు అవసరం

ఈ నేపథ్యంలో భూ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు ఎలా ముందుకు వెళ్లాలో సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. ఈ 'టైటిల్ సర్టిఫికేషన్ టాస్క్‌ఫోర్స్' ఒక సమగ్రమైన భూమి టైటిల్ వ్యవస్థను దేశంలో వీలైనంత త్వరగా తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించింది. దాని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 2011లో ఒక ముసాయిదా ల్యాండ్ టైట్లింగ్ బిల్లును తీసుకువచ్చింది. నిశ్చయాత్మకమైన ఆస్తి హక్కుల (కన్‌క్లూజివ్ ప్రాపర్టీ టైటిల్స్) వ్యవస్థను ఏర్పాటు చేయడం, పాలన, నిర్వహించడం దీని ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా అనుసరించే 'టోరెన్స్' వ్యవస్థ ఆధారంగా దీన్ని రూపొందించారు. టోరెన్స్ వ్యవస్థ 3 సూత్రాలతో ఉంటుంది.

1. మిర్రర్ సూత్రం. ఇది టైటిల్ రిజిస్ట్రేషన్‌ను సూచిస్తుంది. క్షేత్ర స్థాయి వాస్తవికత (గ్రౌండ్ రియాలిటీ)ను కచ్చితంగా ప్రతిబింబిస్తుంది.

2. కర్టెన్ సూత్రం. ఇది గతానికి అడ్డుగా ఒక తెర ఉన్నన్నట్లు సూచిస్తుంది. టైటిల్‌ను రిజిస్టర్‌లో టైటిల్ నమోదు కావడమే ప్రస్తుత టైటిల్ నిశ్చయాత్మక రుజువు అనీ, గతాన్ని పరిశోధించాల్సిన అవసరం లేదనీ చెబుతోంది.

3. హామీ సూత్రం. ఇది టైటిల్‌ను రిజిస్టర్ చేసే క్రమంలోనూ, భూ యజమానులకు జారీ చేసే ధ్రువీకరణ పత్రాలలోనూ దొర్లే తప్పులకు నష్టపరిహారానికి ప్రభుత్వ సంస్థల హామీని ఇస్తుంది. ఇది కోర్టుల్లో కూడా చెల్లుబాటయ్యే పూర్తి అజేయమైన యాజమాన్య ధ్రువీకరణ పత్రంగా ఉంటుంది.

ఈ నేపథ్యంలోనే ఏపీ శాసనసభ 2019లో 'ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టా'న్ని ఆమోదించి దాన్ని భారత రాష్ట్రపతి అంగీకారం కోసం పంపింది. దాన్ని అందుకున్న కేంద్రం భూమి వ్యవహారాలు పర్యవేక్షించే కేంద్ర ఎల్ఓఆర్, ఐటీ, న్యాయ తదితర శాఖల పరిశీలనకు పంపింది. ఆ యా శాఖలు కొంత సమయం తీసుకుని ఈ చట్టంపై అభిప్రాయాలు, వ్యాఖ్యలు పంపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఏపీ ప్రభుత్వం అందుకనుగుణంగా టైట్లింగ్ బిల్లుకు పలు సవరణలు చేసి శాసనసభకు పంపింది. దీనిని 2023లో సభ ఆమోదించింది. ఆ బిల్లును మళ్లీ రాష్ట్రపతి ఆమోదం కోసం పంపగా ఇటీవలే దానికి ఆమోదం లభించింది. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం ఆ చట్టాన్ని నోటిఫై చేసి అమలు చేయడానికి కావల్సిన నియమాలు, మార్గదర్శకాలను రూపొందిస్తోంది.

కానీ చర్చించకుండా హడావిడిగా చట్టం తెచ్చారని కొందరు బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉంది. రెండు సార్లు పూర్తిగా చర్చించి సంతృప్తి చెందిన తర్వాతే అసెంబ్లీ ఈ బిల్లును ఆమోదించింది. మన దేశంలో చట్టాలు ఇదే విధానంలో రూపుదిద్దుకుంటాయి తప్ప వేరే విధానంలో కాదు. ప్రజాస్వామ్యంలో చట్టసభలు ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. రాజ్యాంగ సవరణలు కూడా ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లవు. దీన్ని సమగ్రంగా పరిశీలించడానికి, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు పలు దఫాలుగా పంపిన వివరణలు చూసి ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి నాలుగేళ్లు పట్టింది.

భూముల వ్యవహారంలో రెవెన్యూ శాఖ సమర్థతను ప్రశ్నిస్తూ కొందరు వ్యక్తులు పత్రికలకు ఎక్కడం కూడా దురదృష్టకరం. బహుశా ఈ దేశంలో భూ యాజమాన్య వ్యవస్థల పరిణామం గురించి వారికి తెలియకపోవచ్చు. బ్రిటిష్‌వారు మొదటిసారిగా రైత్వారీ సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు, రెవెన్యూ సిబ్బంది అయిన సెటిల్‌మెంట్ అధికారులే భూమిని అనుభవిస్తున్న ప్రజలకు హక్కులు ఇచ్చారు తప్ప వేరే వారు కాదు. ఆర్ఓఆర్, ఎస్టేట్‌ల రద్దు, ఇనాం రద్దు, ల్యాండ్ సీలింగ్ వంటి భూమికి సంబంధించిన ప్రతి చట్టంలోనూ హక్కుదారులకు సంబంధించిన అంశాలను పరిష్కరించే అధికారం రెవెన్యూ అధికారులకే ఉంది. భూ సమస్యలను పరిష్కరించడంలో, పట్టా హక్కులు లేదా యాజమాన్య హక్కులు ఇవ్వడంలో రెవెన్యూ సిబ్బందికి మించిన జ్ఞానం ఎవరికీ ఉండదు. రెవెన్యూ సిబ్బందికి భూ చట్టాలు/సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం లేదని చెప్పడం సరికాదు. అదే సందర్భంలో ఏ సీనియారిటీ ప్రకారం టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులను నియమిస్తారనే విషయం రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేయాలి. అన్ని వివరాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులను ఖరారు చేస్తుంది.

చట్టం ప్రకారం అప్పీలేట్ అధికారులుగా సర్వీసులో ఉన్న లేదా రిటైర్ అయిన జాయింట్ కలెక్టర్ స్థాయి కంటే తక్కువ కాకుండా ఉన్న వారే నియమితులవుతారు. అప్పీలేట్ అధికారులుగా ఎవరిని నియమించాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్ణయించలేదు. ఈ దశలో ఎవరికి నచ్చినట్లు వారు ఊహించుకోవడం సరికాదు. టైటిల్ రిజిస్టర్‌లో నమోదైన ఎంట్రీలపై అప్పీల్ చేసుకునేందుకు రెండేళ్ల సమయం ఎలా సరిపోతుందని కొందరు ప్రశ్నించారు. ఇది చాలా విడ్డూరంగా కనిపిస్తోంది. మ్యుటేషన్ చట్టం, ఆర్ఓఆర్ వంటి ఏ ఇతర చట్టాల ప్రకారమైనా రికార్డింగ్ అధికారి నిర్ణయాన్ని సవాలు చేయడానికి చరిత్రలో ఎన్నడూ కొన్ని వారాల కంటే ఎక్కువ సమయం ఇవ్వలేదు. రికార్డింగ్ అధికారి నిర్ణయాన్ని సవాలు చేయడానికి కొన్ని వారాల సమయం మాత్రమే ఇస్తారు. కానీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంలో రెండు సంవత్సరాల సమయం ఇచ్చారు. పైన చెప్పిన టోరెన్స్ వ్యవస్థ ప్రకారం పునసమీక్ష, పరిష్కారం తర్వాత, రికార్డింగ్ చేయబడుతుంది, ఇది తాత్కాలికంగా మాత్రమే పరిగణించబడుతుంది. ఈ ప్రక్రియలో పట్టాదారులకు నోటీసులు ఇవ్వబడతాయి. ఈ తాత్కాలికాన్ని సవాలు చేయడానికి ప్రజలకు 2 సంవత్సరాల సమయం ఇస్తారు. 2 సంవత్సరాలలోపు ఎటువంటి ఛాలెంజ్ లేకపోతే, తాత్కాలికమే ఫైనల్ అవుతుంది. ఈ విషయంలో పరిమితి చట్టంలోని నిబంధనలను కోట్ చేయడం అసంబద్ధం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి ప్రధాన సలహాదారు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి: పౌర్ణమి తె.5.02 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి బహుళ పాడ్యమి, నక్షత్రం: మృగశిర రా.10.10 వరకు తదుపరి ఆరుద్ర, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.8.41 నుండి 9.29 వరకు, తదుపరి రా.10.44 నుండి 11.32 వరకు, అమృతఘడియలు: ప.1.18 నుండి 2.55 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ మీడియా

గొప్ప మనుషులు



మిగతా దేశాలకు భిన్నంగా ఒక్క జపాన్‌లోని యాపిల్ స్టోర్లలోనే ఐఫోన్లను కట్టకుండా ఉంచుతారు. ఎందుకంటే అక్కడ ఎవరూ దొంగతనం చేయరు. ఇది జపాన్ అత్యుత్తమ సంస్కృతిని ప్రతిబింబించడం లేదా?

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

నవ్వితే నవ్వండి!



మిమ్మల్ని చూసి జనం నవ్వడాన్ని మీరు ఎంతగా ఆపడానికి ప్రయత్నిస్తే... మీరు అంతగా నగుబాటుకు గురవుతారు. అదే మీరు కూడా వారి నవ్వుతో జత కలిస్తే, ఇక నవ్వులాట ఉండదు. జోక్ ఆగిపోతుంది. ఇది ఇంత మామూలు విషయం. ప్రపంచపు అధికార వ్యవస్థలు ఎంత మారినా, ఇది మారలేదు.

– వీర్ దాస్, కమెడియన్

ఒప్పిస్తారు!




భారతదేశంలో రెండు రకాల వైద్యులున్నారు. 1.నిజమైన వైద్యులు. 2.తమను తాము వైద్యులుగా భావించుకునేవాళ్లు. ఎవరు ఎమిటని మీకు ఎలా తెలుస్తుంది? పెద్ద కష్టపడే పనిలేదు– రెండో కోవలోకి వచ్చేవాళ్లు తాము వైద్యులమేనని ఒప్పించడానికి తాము చేయకూడదనిదంతా చేస్తారు.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

అమృతకాలంలో... అన్నీ వాస్తవాలేనా?

సందర్భం



సి. రామచంద్రయ్య


ఎన్నికల సీజన్‌లో ప్రజలు, ప్రసార మాధ్యమాల దృష్టి ఎక్కువగా రాజకీయాలపైనే కేంద్రీకృతం అవుతుంది. చర్చలన్నీ వాటి చుట్టూనే తిరుగుతాయి. 5 రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచీ అదే జరిగింది. ఇక మరి కొన్ని రాష్ట్రాలకు, అదేవిధంగా లోక్‌సభకు మరో 3 నెలల వ్యవధిలో ఎన్నికలు జరిగే నేపథ్యంలో పార్టీల గెలుపోటముల మీదనే జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

మధ్యప్రదేశ్‌లో వరుసగా నాలుగోసారి అధికారం దక్కించుకోవడంతో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో పాగా వేయడంతో భారతీయ జనతాపార్టీ మంచి జోరు మీద ఉంది. ఈ భారీ విజయాల అనంతరం ప్రధాని నరేంద్రమోదీ స్వరం పెరిగింది. 'మూడవ సారి ప్రధానిని నేనే' అంటూ ఆయన ధీమాగా చెబుతున్నారు. భారత్ వెలిగిపోతోందని చెప్పేందుకు బీజేపీకి వత్తాసు పలికే కొన్ని పత్రికలు, ప్రసార మాధ్యమాలు దేశంలో కాంతులీనుతున్న వంతెనలను, దీపాల వెలుగుల్లో ముచ్చట గొల్పుతున్న హైవేలను చూపుతున్నాయి. 2047 నాటికి దేశం ప్రపంచంలోనే 2వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకోవడం తథ్యం అని ప్రధానితో సహా బీజేపీ అగ్రనేతలు పదేపదే ప్రచారం చేస్తున్నారు.

అయితే, అందుబాటులో ఉన్న గణాంకాలను పరిశీలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ కరిమింగిన వెలగపండు మాదిరిగానే ఉందన్నది ఓ చేదు వాస్తవం. జీడీపీ మెరుపుల వెనుకనున్న మరకల్ని చూపించకపోవడం అన్నది చిరుగుల చొక్కాపై అందమైన కోటు వేసుకోవడం లాంటిదే! ఇక, ఎన్నికలలో విజయం సాధించినపుడు అనేక ప్రతికూల అంశాలు మరుగున పడిపోతాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్య స్థితిని అంచనా వేసే కొలమానాల్లో జీడీపీ వృద్ధిరేటుకు ఇటీవలి కాలంలో పెద్దగా ప్రాధాన్యం లభించడం లేదు. ఆర్థిక విధానాలను సరళీకృతం చేశాక పెరిగిన ఆర్థిక అసమానతల నేపథ్యంలో... ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతను లెక్కించడానికి మూలధన వృద్ధిరేటు (రేట్ ఆఫ్ క్యాపిటల్ ఫార్మేషన్), మానవాభివృద్ధి రేటు, టెక్నాలజీ ఉపయోగిత రేటు, సహజవనరుల వినియోగం, మౌలిక సదుపాయాల వృద్ధి, ఉద్యోగిత పెరుగుదలలో కనిపించే వృద్ధి, విద్యాప్రమాణాల నాణ్యత, జీడీపీలో ప్రైవేటు పెట్టుబడుల నిష్పత్తి, రూపాయి పటిష్ఠత, తలసరి ఆహార లభ్యత, అవినీతి, సుపరిపాలన వంటివి కీలకంగా మారాయి.

ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త 'శ్రీమతి ఉత్స పట్నాయక్' తాజా పుస్తకం 'ఎక్స్‌ప్లోరింగ్ ది పావర్టీ క్వశ్చన్'లో పేర్కొన్న దాని ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని 80 శాతం మంది కనీస స్థాయిలో ఆహార ధాన్యాలు పొందలేకపోతున్నారు. ఆక్స్‌ఫామ్ నివేదిక దీనిని బలపరుస్తూ 2021లో దేశవ్యాప్తంగా 84 శాతం కుటుంబాల ఆదాయం తగ్గిపోయిందని పేర్కొంది. దేశంలో పొదుపు తగ్గిన కారణంగా క్యాపిటల్ ఫార్మేషన్ మందగించింది. దేశ స్థూల ఉత్పత్తిలో ప్రైవేటు అప్పుల నిష్పత్తి బాగా పెరిగిపోయిందనీ, ఇందుకు కారణం బ్యాంకుల నుంచి, ఇతర ప్రైవేటు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు స్వీకరించిన వారు తిరిగి అప్పులు చెల్లించలేక పోవడమేననీ బ్యాంకుల సమాఖ్య వెల్లడించింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కాంట్రాక్టర్లకు, సప్లయిర్లకు చేయవలసిన చెల్లింపులు నిలిచిపోవడమో, లేక మితిమీరిన జాప్యం జరగడమో అవుతోంది. కొందరు కాంట్రాక్టర్లు తమకు రావాల్సిన బకాయిల చెల్లింపులపై విధిలేని పరిస్థితిలో న్యాయస్థానాల గుమ్మాలు తొక్కుతుంటే, ఇంకొందరు రుణభారం మోయలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ దుస్థితి దేశవ్యాప్తంగా ఉంది. 'మనీ ఫ్లో' లేకపోవడం వల్ల వస్తు వినిమయం బాగా తగ్గిపోయింది. ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసరాల ధరలు రోజురోజుకీ పైకి ఎగబాకుతున్నాయి. దీనివల్ల మెజార్టీ ప్రజలు కనీస పోషక విలువలు ఉండే ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. ముఖ్యంగా దేశంలో పేద వర్గాలకు చెందిన అత్యధిక శాతం మంది గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం తగినంత అందకపోవడం అన్నది దేశాన్ని తలదించుకొనేలా చేస్తోంది.




ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో 2015లో 188 దేశాల్లో భారత్‌కు లభించిన స్థానం 130 కాగా, 2021–22లో 191 దేశాల్లో 132వ స్థానం దక్కించుకొంది. అంటే ఆరేడేళ్లల్లో దేశ ప్రజల జీవితాల్లో ఏమాత్రం మెరుగుదల కనపడలేదని అంతర్జాతీయ సమాజం గుర్తిస్తోంటే, ఆశ్చర్యకరంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ... భారతదేశం 2022లో అమృత్‌కాల్ (అమృతకాలం)లోకి ప్రవేశించినట్లు పదేపదే చెబుతున్నారు. అందుకు ఆయన చూపుతున్న ఉదాహరణ భారత ఆర్థిక వ్యవస్థ యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)ను దాటిపోవడం. మరో పాతికేళ్లల్లో మనం చైనాను వెనక్కు నెట్టేస్తామట. ప్రధాని నరేంద్రమోదీ మనల్ని నమ్మమంటున్నారు. నిజానికి, 2047 నాటికి లేదా 2027 నాటికి 'చైనా' స్థానం ఎక్కడకు వెళుతుంది? క్రితం యేడాది ప్రపంచబ్యాంకు నివేదికనే ప్రామాణికంగా తీసుకొంటే చైనా కంటే భారత్ 6 రెట్లు వెనుకబడి ఉంది. ఒక అమెరికన్ డాలర్ భారత్ కరెన్సీకి 82 రూపాయలు. అదే 7 యువాన్లు (చైనా కరెన్సీ) పెడితే ఒక అమెరికా డాలర్! ఈ లెక్కన అంతర్జాతీయ ద్రవ్య విపణిలో చైనా కరెన్సీ ఎంత బలంగా ఉందీ, రూపాయి ఎంత బలహీనంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. భారత్‌కు చైనాకు పోలిక తేవడం దేనికి? 2047లో చైనాను వెనక్కు నెట్టేయడం ఎలా సాధ్యం? భారత్ ఆర్థికంగా పురోగమిస్తుంటే, చైనా చేష్టలు డిగి చూస్తుందా?

ఇక, దేశ కీలక రంగాలకు చెందిన ఆడిట్ రిపోర్టులను తయారుచేసి పార్లమెంట్‌కు సమర్పించేందుకు ఏర్పాటయిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ)ను క్రమంగా నిర్వీర్యం చేసే బాధ్యతను కూడా ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిందా అనే అనుమానం కూడా కలుగుతోంది. ఎందుకంటే, ఏటా 40 రంగాల ఆడిట్ రిపోర్టులు పార్లమెంట్‌కు సమర్పించే సీఏజీ... గత 4 ఏళ్లుగా సగటున 22 నివేదికలు మాత్రమే పార్లమెంట్‌కు సమర్పిస్తోంది. సిఏజీ అన్నది రాజ్యాంగబద్ధ వ్యవస్థ. దీనికి కేటాయించే బడ్జెట్‌ను భారీగా తగ్గించారు. అరకొర నిధులు కేటాయించడం అంటే కీలక రంగాలలో ఏమి జరుగుతున్నదో ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరం లేదని పాలకులు భావించడమే! వాస్తవాలు తెలుసుకోకుండా, అధికారంలో ఉన్నవారు ఏది చెబితే దానిని నమ్మాలా? దేశం అమృతకాలంలోకి ప్రవేశించిందని సంబరాలు జరుపుకోవాలా?

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

ఆధ్యాత్మిక పరిమళాలు

ఇటీవల కాలంలో పండుగలు, పర్వ దినాలు వస్తే గృహ ప్రాంగణాలు, దేవాలయాలు సామూహిక సంకీర్తనా గానంతో మారుమోగి పోతున్నాయి. ఆధ్యాత్మిక పరిమళాలు ఇంటింటా, ఊరూరా ఈ సామూహిక గానంతో వ్యాపించి వికసిస్తున్నాయి. ఇది చాలా సంతోషించ దగిన విషయం.



సామాజిక మాధ్యమాలు అందుబాటులో ఉండటంతో స్త్రీలు, పురుషులు బృందాలుగా ఏర్పడి, సమయాన్ని నిర్ణయించుకుని, ఒకరికొకరు సమాచారాన్ని ఇచ్చుకుని, ఒకచోట కలిసి, లలితా సహస్ర నామాలు, విష్ణు సహస్ర నామాలు, హనుమాన్ చాలీసా, గోవింద నామాలు వంటివి సామూహికంగా గానం చేస్తున్నారు. ఈ విధమైన భగవన్నామ స్మరణ, కీర్తన జనులలో కొత్త శక్తిని నింపుతుంది. అందరూ కలిసి చేసే ఈ నామ సంకీర్తనలో ఆర్తి ఉంటుంది.

రెండు మూడు గంటల పాటు నిర్విరామంగా భగవంతుని సంకీర్తన చేస్తూ, తరువాత కూడా దైవాన్ని గురించే మాట్లాడుకుంటూ ఉండటం వల్ల లౌకికమైన ఈర్ష్య, అసూయ ద్వేష భావాలకు దూరంగా ఉండటం సాధ్యమవుతుంది. తామంతా ఒక్కటే అన్న ఐకమత్య భావన ఈ సామూహిక గానం వల్ల కలుగుతుంది. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన ఈ సంకీర్తన వల్ల వెల్లి విరుస్తుంది.

కలియుగంలో సంకీర్తన ముక్తిదాయకమని పురాణాలు చెబుతున్నాయి.!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

శ్రీరామ అలంకారంలో యాదాద్రీశుడు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన సోమవారం శ్రీస్వామి వారు ఉదయం శ్రీరామ అలంకారంలో, రాత్రి శ్రీవేంకటేశ్వర స్వామి అలంకార సేవలో ఆలయ తిరు, మాడవీధుల్లో ఊరేగారు.

సన్‌బర్న్ ఈవెంట్ ఆర్గనైజర్‌పై చీటింగ్ కేసు

- బుక్‌మైషో ఎండీ, నోడల్ ఆఫీసర్‌కు నోటీసులు

గచ్చిబౌలి (హైదరాబాద్): న్యూ ఇయర్ ఈవెంట్‌కు అనుమతి లేకుండానే టికెట్లు విక్రయించిన సన్‌బర్న్ ఈవెంట్ ఆర్గనైజర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు మాదాపూర్ అడిషనల్ డీసీపీ ఎన్.నర్సింహారెడ్డి తెలిపారు. సన్‌బర్న్ మ్యూజికల్ నైట్ పేరిట న్యూఇయర్ ఈవెంట్ నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు పరిశీలనలో ఉండగానే టికెట్లను విక్రయించినట్లు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు అందిందని, ప్రాథమిక విచారణలో బుక్‌మై షోలో టికెట్లు విక్రయించినట్లు తేలిందన్నారు. దీంతో సన్‌బర్న్ ఈవెంట్ ఆర్గనైజర్ సుమన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుక్ మైషో నోడల్ ఆఫీసర్, ఎండీలకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.

'ఉద్యాన వర్సిటీ స్థలంలో హైకోర్టు భవనం వద్దు'

ఏజీ వర్సిటీ: ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన సుగంధ, ఔషధ మొక్కల పరిశోధన స్థలంలో హైకోర్టు భవనం నిర్మించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (తూటా) కోరింది. ఈ నిర్ణయంతో తెలంగాణను ఉద్యానవన పంటల హబ్‌గా మార్చాలన్న నిర్ణయానికి ఆటంకం ఏర్పడుతుందని తూటా అధ్యక్షుడు బీనా నాయక్, అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో సమావేశమైన వారు, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను కలిసి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు.

తొమ్మిదో తరగతి విద్యార్థి గుండెపోటుతో మృతి



తాళ్లపెల్లి సుశాంత్

కోనరావుపేట (వేములవాడ): కుటుంబ సభ్యులందరూ క్రిస్మస్ వేడుకల్లో మునిగితేలారు. అప్పటి వరకు తమతో ఆడుతూ.. పాడుతూ క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న వారి కొడుకు గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి శంకర్-సరిత దంపతులకు యశ్వంత్, సుశాంత్ కుమారులు. యశ్వంత్ కోనరావుపేట కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. రెండో కొడుకు సుశాంత్ (13) నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు సుశాంత్ కొత్త డ్రెస్ వేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి చర్చికి వెళ్లాడు. అక్కడే గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే సిరిసిల్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

పొలంలోనే ప్రాణం వదిలి..

- గుండెపోటుతో రైతు హఠాన్మరణం



కొమురయ్య

ముత్తారం (మంథని): గుండెపోటుతో రైతు పప్పు కొమురయ్య (43) పొలంలోనే మృతిచెందాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. కొమురయ్య తన రెండున్నర ఎకరాల్లో వరి నాటు వేయిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూలీలు, కుటుంబసభ్యులతో కలిసి పొలం పనుల్లో నిమగ్నమయ్యాడు. కూలీలు నాట్లు వేశాక మందు చల్లుతూ ఉన్నాడు. ఈ క్రమంలో హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో పొలంలోనే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్ద చూపించి ఆ తర్వాత ముత్తారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కొమురయ్య చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. అప్పటిదాకా అందరితో కలిసి పొలం పనులు చేసిన కొమురయ్య హఠాత్తుగా మృతిచెందడంతో కుటుంబసభ్యులు, కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. ఆయనకు భార్య శ్వేత, కూతురు దీపిక, కొడుకు మహేశ్ ఉన్నారు.

రేషన్ బియ్యం రీసైక్లింగ్ ఆగేనా?

- రాష్ట్రంలో పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం 70 శాతం!
- పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ సమీక్షలో అధికారుల వెల్లడి?
- రేషన్ బియ్యం పక్కదారిని అరికట్టడంపై దృష్టి పెట్టామన్న ఉత్తమ్
- ఇందులో భాగంగానే ఐపీఎస్ అధికారికి పౌరసరఫరాల శాఖ కమిషనర్ పగ్గాలు

సాక్షి, హైదరాబాద్: రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న తీరుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే పౌరసరఫరాల సంస్థ తీరు పై సమీక్షించిన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి... పీడీఎస్ బియ్యం సరఫరా తీరుతెన్నుల గురించి ప్రత్యేకంగా వాకబు చేశారు. అయితే ప్రతి నెలా పేదలకు పంపిణీ అవుతున్న 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంలో ఏకంగా 70 శాతం వరకు బియ్యం పక్కదారి పడుతోందని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలిసింది. పీడీఎస్ బియ్యంలో నాణ్యత లోపించడం వల్లే ఇలా జరుగుతోందని తేల్చిన మంత్రి దీనికి ప్రధాన కారణం మిల్లర్లేనని సమావేశంలోనే చెప్పారు. హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తమ్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొందరు మిల్లర్ల చేతివాటం గురించి పూర్తి అవగాహన ఉండటంతో ఆయన ఈ అంశాన్ని తొలి ప్రాధాన్యతగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సోమవారం హుజూర్‌నగర్‌లోని చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసిన ఆయన... రేషన్ బియ్యం దుర్వినియోగంపై ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన పీడీఎస్ రైస్ సరఫరా చేయడంతోపాటు బియ్యం పక్కదారి పట్టడాన్ని నిలువరించడంపై దృష్టి పెట్టారు.

మిల్లర్ల కొనుగోళ్ల చక్రం!

రాష్ట్రంలోని 90.14 లక్షల ఆహార భద్రతా కార్డులకుగాను 2.83 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 3,580 కోట్లు రాయితీ కింద వెచ్చిస్తోంది. అంటే నెలకు రూ. 298 కోట్లు. మొత్తంగా కిలో బియ్యానికి సగటున రూ. 39 వెచ్చిస్తూ సరఫరా చేస్తున్న ఈ బియ్యాన్ని కార్డుదారులకు ఒక్కో యూనిట్ (ఒక్కొక్కరికి)కి నెలకు 6 కిలోల చొప్పున పంపిణీ చేస్తోంది. అయితే ఈ బియ్యాన్ని కార్డుదారుల్లో కొందరు తిరిగి రేషన్ దుకాణాల్లోనే విక్రయించే విచిత్ర పరిస్థితి కొనసాగుతోంది. కార్డుదారుల నుంచి కిలోకు రూ. 6–9 వరకు చెల్లించి కొందరు రేషన్ దుకాణదారులు కొంటుండగా వారి నుంచి కిలోకు రూ. 10–13 చెల్లించి దళారులు కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు పంపుతున్నట్లు తెలుస్తోంది. పక్క రాష్ట్రాలకు సరిహద్దులుగా ఉన్న ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ వంటి జిల్లాల్లో రేషన్ డీలర్లు బియ్యాన్ని దళారుల ద్వారా ఆయా రాష్ట్రాల్లో కిలో రూ. 20 చొప్పున అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఈ తతంగంలో కొందరు అవినీతి అధికారుల పాత్ర కూడా ఉందని.. డీలర్లు, దళారుల నుంచి మామూళ్లు తీసుకొని బియ్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఐపీఎస్ అధికారి నియామకంతో...

ఈ నేపథ్యంలోనే పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్‌ను ప్రభుత్వం నియమించడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. సీఎం రేవంత్‌తోపాటు మంత్రి ఉత్తమ్ కూడా కమిషనర్‌కు ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చౌహాన్‌కు గతంలో ఎఫ్‌సీఐలో పనిచేసిన అనుభవం ఉంది.

రీసైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- మంత్రి ఉత్తమ్ హెచ్చరిక
- హుజూర్‌నగర్‌లోని ఓ రేషన్ దుకాణం తనిఖీ

హుజూర్‌నగర్: రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం కిలో బియ్యానికి రూ. 39 ఖర్చుపెట్టి కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా ఇస్తోందని, ఆ బియ్యాన్ని మిల్లర్లుగానీ, ఇతరులెవరైనా రీసైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం ఆయన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని 33వ నంబరు రేషన్ షాపును తనిఖీ చేశారు. రేషన్ బియ్యం నాణ్యతను పరిశీలించి డీలర్ల కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. కొందరు రేషన్ బియ్యాన్ని కోళ్ల దాణాకు, బీర్ల తయారీకి అమ్ముతున్నారని చెప్పారు. కొన్ని జిల్లాల్లో కొందరు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని పాలిష్ చేయించి తిరిగి వాటినే ప్రభుత్వ (ప్రొక్యూర్‌మెంట్) సేకరణకు ఇస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, మాఫియాలా కొనసాగుతోందని మండిపడ్డారు. ఇక నుంచి రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందాకు అడ్డుకట్ట వేస్తామన్నారు.



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

గత ప్రభుత్వ నిర్వాకం వల్లే నష్టాలు...

గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాకం వల్లే పౌరసరఫరాల సంస్థ రూ. 56 వేల కోట్ల అప్పుల్లో, రూ. 11 వేల కోట్ల నష్టాల్లో ఉందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. అప్పులపై ఏటా రూ. 3 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం రైస్ మిల్లర్ల దగ్గర రూ. 22 వేల కోట్ల విలువైన ధాన్యం నిల్వలు పెట్టడంపై సమీక్షిస్తున్నామని... మిల్లర్ల దగ్గర ఉన్న ధాన్యం రికవరీకి తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణ పద్ధతులను, రేషన్ వ్యవస్థను మెరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మంత్రి వెంట ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న తదితరులు ఉన్నారు.

సత్యదేవుడిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కాకినాడ జిల్లా రత్నగిరిపై సత్యదేవుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట పలువురు న్యాయాధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శినికి స్వాగతం పలుకుతున్న పండితులు

250 గజాల స్థలం.. వడ్డీలేని రుణం

- సింగరేణి డే రోజున వేతనంతో కూడిన సెలవు
- కార్మికులకు మంత్రి పొంగులేటి హామీ

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. కార్మికుల సొంతింటి కల సాకారం చేసేందుకు ఒక్కొక్కరికి 250 గజాల స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ.20 లక్షల వడ్డీలేని రుణం అందజేస్తామని ప్రకటించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, సత్తుపల్లి ఏరియాల్లోని బొగ్గు గనుల వద్ద జరిగిన సభల్లో మాట్లాడారు. సింగరేణి డే రోజున కార్మికులకు సెలవు దినంగా ప్రకటిస్తామని, మహిళా ఉద్యోగులకు అండర్ గ్రౌండ్‌లో కాకుండా సర్ఫేస్ విధులు కేటాయించేలా అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కొత్తగూడెం ఏరియాలో రాంపూర్ భూగర్భ గని, వీకే- 7తో పాటు మరో ఓసీ ఏర్పాటుకు కృషి చేస్తామని, గత ప్రభుత్వ నిర్వాకంతో తగ్గిన కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచుతామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మెడికల్ ఇన్‌వాలిడిటేషన్ కోసం కార్మికులు రూ.6 నుంచి రూ.8 లక్షలు వెచ్చించాల్సి వచ్చేదని, ఈ ప్రభుత్వంలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అర్హులందరికీ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అందరి నాయకుడని, కార్మికుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. మాయమాటలు చెప్పి రెండుసార్లు కార్మికుల ఓట్లతో గెలుపొందిన బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్.. ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కాగానే, సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఇచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో గడియారం గుర్తుపై ఓటు వేసి ఐఎన్‌టీయూసీని గెలిపించాలని పొంగులేటి కోరారు. ఆయా కార్యక్రమాల్లో పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు, సత్తుపల్లి ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, మట్టా రాగమయి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందులో సింగరేణి కార్మికులు ధరించే చెమ్మాస్, టోపీతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అలీఘర్‌లో చైనీయుల అనుచరుడు

- వారు చేసే సైబర్ నేరాలకు ఇతగాడి వత్తాసు
- బినాన్స్ యాప్, క్రిప్టో కరెన్సీతో సహకారం
- ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: చైనా సహా వివిధ దేశాల్లో మకాం వేసి, దేశంలోని వివిధ రకాలైన సైబర్ నేరాలకు పాల్పడే చైనీయులకు సహకరిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ వాసి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కాడు. చైనీయులు ఆదేశాల మేరకు బినాన్స్ యాప్ ఓపెన్ చేసిన ఇతగాడు దాని ద్వారానే క్రిప్టో కరెన్సీ ఖరీదు చేసి, చైనీయులకు పంపిస్తున్నట్లు జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ సోమవారం ప్రకటించారు. అలీఘర్‌కు చెంది హర్ష్ కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. ఆన్‌లైన్‌లో వివిధ రకాలైన గేమ్స్ ఆడటానికి అలవాటుపడిన అతను చైనీయులు రూపొందించిన గేమ్స్ సైతం పలుమార్లు ఆడాడు. ఈ నేపథ్యంలోనే ఇతడికి వీటిని నిర్వహించే చైనీయులతో టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. గేమింగ్ యాప్స్, కలర్ ప్రిడెక్షన్, బెట్టింగ్ సహా వివిధ రకాలైన ఆన్‌లైన్ దందాలు, సైబర్ నేరాలకు చైనీయులే సూత్రధారులుగా ఉంటున్నారు. అయితే భారతీయుల నుంచి కాజేసిన డబ్బు నేరుగా విదేశాలకు తరలించడం వీరికి సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే ఇక్కడే ఉన్న కొందరిని తమ దళారులుగా మార్చుకుని కథ నడుపుతుంటారు. ఇదే తరహాలో టెలిగ్రామ్ యాప్ ద్వారా హర్ష్‌ను కూడా తమ ఏజెంట్‌గా మార్చుకున్నారు. చైనీయులు సూత్రధారులుగా ఉండి చేసే సైబర్ కొరియర్ ఫ్రాడ్ ఒకటి. భారతీయులకు చెందిన సెల్‌ఫోన్ నెంబర్ల డేటాబేస్‌ను డార్క్ వెబ్ ద్వారా సంగ్రహిస్తారు. దీనిని ఉత్తరాదిలో అక్రమ కాల్ సెంటర్లు నిర్వహించే తమ అనుచరులకు అందిస్తారు. వీరు ఆయా నెంబర్లకు ఫోన్లు చేసి వివిధ రకాలైన కొరియర్ సంస్థల నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మిస్తారు. మీ పేరుతో, ఆధార్ కార్డు ఆధారంగా ఓ పార్శిల్ బుక్ అయిందని చెప్తారు. అయితే తనిఖీల నేపథ్యంలో అందులో డ్రగ్స్ సహా నిషేధిత వస్తువులు ఉన్నట్లు గుర్తించామని చెబుతారు. దీనిపై కేసులు నమోదు కాకుండా ఉండాలంటే విషయం సెటిల్ చేసుకోవాలని, భారీ మొత్తం జరిమానాగా చెల్లించాలని బెదిరిస్తారు. ఈ మాటల వల్లో పడిన వారి నుంచి అందినకాడికి వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఖాతాల్లోకి బదిలీ చేయిస్తారు. ఈ మొత్తం ఉత్తరాదిలో చైనీయుల కోసం పని చేసే హర్ష్ లాంటి వాళ్ల ఖాతాల్లోకి వెళ్తాయి. ప్రత్యేకంగా బినాన్స్ లాంటి యాప్స్‌లో ఖాతాలు తెరిచే వీరు తమ ఖాతాల్లో పడిన మొత్తాలను వీటి ద్వారా క్రిప్టో కరెన్సీగా మారుస్తారు. ఈ డిజిటల్ కరెన్సీని చైనీయులకు పంపిస్తారు. చైనీయుడైన లియో ఆదేశాలతో పని చేస్తున్న హర్ష్ ప్రతి లావాదేవీలోనూ 10 నుంచి 15 శాతం కమీషన్ తీసుకునేవాడు. నగరంలోని తార్నాక ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి ఫెడెక్స్ కొరియర్ సంస్థ ముంబై బ్రాంచ్ పేరుతో ఫోన్ వచ్చింది. తైవాన్‌కు బుక్ అయిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని బెదిరించి రూ.5.98 లక్షలు కాజేశారు. పదేపదే డబ్బు డిమాండ్ చేస్తుండటంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ కె.హరి భూషణ్ రావు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు బట్టి నిందితుడు హర్ష్‌గా గుర్తించారు. అలీఘర్ వెళ్లిన ప్రత్యేక బృందం అతడిని అరెస్టు చేసింది. ఈ పంథాలో ఎందరిని, ఏ మేరకు మోసం చేశాడో తెలుసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.



హర్ష్

నాన్నా.. నేను చనిపోతున్నా..

- బాబుతో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నా..
- తండ్రికి మెసేజ్ పంపి వివాహిత బలవన్మరణం



ధనశ్రీ (ఫైల్)

రామగుండం: 'నాన్నా.. కట్నం వేధింపులు భరించలేకపోతున్నా.. చావుతోనే నాకు విముక్తి.. అందుకే నా బాబుతో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నా.. (రియల్లీ ఐ వాంట్ టూ డై విత్ మై బేబీ) నన్ను క్షమించండి'అంటూ ఓ వివాహిత తండ్రికి మెసేజ్ పంపి ఆత్మ హత్య చేసుకుంది. పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై వెంకట్ కథనం ప్రకారం.. రామగుండం రైల్వేస్టేషన్ ఏరియా భరత్‌నగర్‌కు చెందిన మాణిక్యాల సదానందరెడ్డి కూతురు ధనశ్రీ.. అదే కాలనీకి చెందిన దండుగుల రాకేశ్ ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యు లు కాదనడంతో వారిని ఎదిరించిన ధనశ్రీ గతేడాది మేలో రాకేశ్‌ను ఆదర్శ వి వాహం చేసుకుంది. అయి తే, కొంతకాలం తర్వాత ధనశ్రీకి పుట్టింటితో సఖ్యత కుదిరింది. రెండు కుటుంబాలు కలిసి పోయా యి. అయితే పెళ్లి తర్వాత రాకేశ్ ఏ పనిచేయకుండా నిత్యం మద్యం తాగడం, కట్నం తేవా లని భార్యను వేధించడం ప్రారంభించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు బాధితురాలు మొ రపెట్టుకోగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించి రూ.50 వేలను ధనశ్రీ అత్తింటి వారికి అప్పగించారు. ధనశ్రీ కూడా ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతూ కొంత ఆదాయం సంపాదిస్తోంది. ఇలా సాఫీగానే సాగిన క్రమంలో వారికి కుమారుడు (4 నెలలు) పుట్టాడు. అ యినప్పటికీ రాకేశ్ ప్రవర్తనలో మార్పురాలేదు. భర్త మద్యం తాగి కట్నం కోసం వేధించడం, అత్తామామల సూటిపోటి మాటలతో ధనశ్రీ విసిగిపోయింది. ఆదివారం తన తల్లిగారింటికి వెళ్లి అత్తింటి వేధింపులపై వారితో మొరపెట్టుకుంది. వారు సర్దిచెప్పగా సాయంత్రానికి తిరిగి అత్తగారింటికి వచ్చిన ధనశ్రీ.. గదిలో ఎవరూ లేని సమయంలో తాను బిడ్డతో కలిసి చనిపోతున్నానంటూ తండ్రికి ఫోన్‌లో మెసేజ్ పెట్టింది. తొలుత బాబుతో కలిసి ఉరివేసుకోవాలని అనుకున్నా.. బిడ్డపై మమకారంతో బాబును వదిలేసి తానే దూలానికి చీరతో ఉరి వేసుకుంది. చప్పుడు కావడంతో గదిలోకి వచ్చిన కు టుంబ సభ్యులు.. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ధనశ్రీని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. తన కూతురు మృతికి ఆమె అత్తింటివారే కారణమని సదా నందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'మేడారం' పనుల్లో వేగం పెంచాలి

- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



జాతర ఏర్పాట్లను మంత్రికి వివరిస్తున్న అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతరలో భక్తులకు ఇబ్బందులు రానీయకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారంలో అధికారులతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి జాతర పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గోవిందరావుపేట మండలంలోని పస్రా వద్ద గుండ్లవాగు బ్రిడ్జి, దయ్యాలవాగు సమీపంలోని రోడ్డును పరిశీలించారు. తాడ్వాయి మండలం నార్లాపూర్ చింతల్ క్రాస్ వద్ద దెబ్బతిన్న రోడ్డు, ఊరట్టం బ్రిడ్జి, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. చిలకలగుట్ట వద్ద వీఐపీ పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్ ప్రదేశాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంతకుముందు మంత్రి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ద బోయిన జగ్గారావు, పూజారులు మంత్రికి పట్టు చీర బహూకరించి, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ గాష్ ఆలం, ఐటీడీఏ పీఓ అంకిత్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

గువ్వలగుట్టను సందర్శించిన అధికారులు

- సాక్షి కథనానికి స్పందన



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

చందంపేట: నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని గువ్వలగుట్ట గ్రామస్తులు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో 'కిడ్నీ రాళ్ల గుట్ట'అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గణేశ్, మిషన్ భగీరథ ఏఈ నరేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్ గువ్వలగుట్ట గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామానికి కృష్ణా జలాలు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సూచించినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు వారు వెల్లడించారు.

డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుని అరెస్టు

- మాదకద్రవ్యాలు వినియోగించిన పలువురికి నోటీసులు

సనత్‌నగర్ (హైదరాబాద్): సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో ఎస్ఆర్‌నగర్ పోలీసులు ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సంఘటనలో గోవా నుంచి మాదకద్రవ్యాలు తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న ఐదుగురిలో ఆశిక్ యాదవ్ (26), రాజేష్ (27)లను ఇప్పటికే అరెస్టు చేయడం తెలిసిందే. వారి ద్వారా గోవా నుంచి మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు హనుమంతు బాబుసో దివాకర్ అలియాస్ బాబ (50)ను సోమవారం అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు సాయిచరణ్, ఎడ్విన్‌ల కోసం గాలిస్తున్నారు. కాగా మాదక ద్రవ్యాలు వినియోగించిన 33 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో 12 మందిని అదుపులోకి తీసుకుని వారికి నోటీసులు జారీ చేశారు. మిగిలిన వినియోగదారుల్లో కూడా తాజాగా పలువురిని అదుపులోకి తీసుకుని.. వారికి కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

తల్లీబిడ్డలను బలిగొన్న కుటుంబకలహాలు

- కూతురును బావిలోకి తోసి తల్లి ఆత్మహత్య
- కరీంనగర్ జిల్లా రామంచలో ఘటన



అంజలి, తనుశ్రీ (ఫైల్)

చిగురుమామిడి(హుస్నాబాద్): కుటుంబకలహాలు రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. ఓ తల్లి కూతురును బావిలో తోసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... రామంచకు చెందిన అంజలి, మునుపాల గగన్ దంపతులు. వీరికి కుమారులు రేశాంత్, రేవంత్ అనే కవలలతోపాటు కూతురు తనుశ్రీ(5) సంతానం. అయితే భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. కుటుంబకలహాలతో తీవ్ర మనస్తాపం చెందిన అంజలి సోమవారం వేకువజామున కూతురును తీసుకొని బయటకు వెళ్లింది. కల్లాపి కోసం పశువుల పేడ తెచ్చేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పింది. పొద్దుపోయే వరకూ ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు చుట్టుపక్కల వెతికారు. ఈ క్రమంలో గ్రామసమీపంలోని బావిలో తల్లీకూతుళ్ల శవమై కనిపించారు. ఎస్సై రాజేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని బావిలోంచి మృతదేహాలను బయటకు తీయించారు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది అంజలి కూతురుతోసహా ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి ఓదవ్వ తెలిపింది.

రేపే 'సింగరేణి' ఎన్నికలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటిస్తారు. ఆ తర్వాత మొత్తం పోలైన ఓట్లలో సగానికంటే ఎక్కువ ఓట్లు సాధించిన సంఘానికి గుర్తింపు హోదా కేటాయిస్తారు.

'గుర్తింపు'ఎవరికో..?

తెలంగాణ ఉద్యమం 2009లో ఉవ్వెత్తున ఎగిసిన తర్వాత సింగరేణిలో బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అనూహ్యంగా బలపడింది. వరుసగా 2012, 2017 ఎన్నికల్లో గెలుపొందింది. 2017లో ఏకంగా టీబీజీకేఎస్ తొమ్మిది ఏరియాల్లో గెలుపొందగా, ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేవలం మందమర్రి, భూపాలపల్లి ఏరియాల్లోనే విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ.. ఏఐటీయూసీకి మద్దతు ఇచ్చింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఒక దశలో పోటీకి టీబీజీకేఎస్ వెనుకంజ వేసింది. గత ఎన్నికల్లో పోటీ చేయని ఐఎన్‌టీయూసీ ఇప్పుడు అనూహ్యంగా పుంజుకుంది. మెజారిటీ ఏరియాలను కైవసం చేసుకోవాలని, గుర్తింపు సంఘం హోదా కూడా సాధించాలని గురి పెట్టింది.

కాషాయ ప్ర'దక్షిణం'..!

దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బీజేపీ కసరత్తు

- 130 స్థానాల్లో 80 దాకా గెలవడమే టార్గెట్
- 2019లో 29 సీట్లతో సరిపెట్టుకున్న కమలదళం



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయాలన్న గట్టిపట్టుదలతో ఉన్న బీజేపీ తన దృష్టినంతా దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రీకరించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ హవా కొనసాగుతోంది. కొరకరాని కొయ్యలా ఉన్న దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధిస్తే కేంద్రంలో వరుస గా మూడోసారి అధికారం దక్కించుకోవడం ఆ పార్టీకి నల్లేరుపై నడకే. ఉత్తరాదితో పోలిస్తే ముందునుంచీ సవాలుగానే ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని బీజేపీ పట్టుదలగా ఉంది...

ఆరునూరైనా 60 దాటాల్సిందే...!

కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పుదుచ్చేరిలలో కలిపి మొత్తం 130 లోక్‌సభ స్థానాలున్నాయి. 2024 సాధారణ ఎన్నికల్లో వాటిలో 80 సీట్ల సాధనే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే వాటిలో కర్ణాటక మినహా మిగతా దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో కమలదళం పోటీ పడలేకపోతోంది. గత ఎన్నికల్లో కాషాయపార్టీ ఈ 130 సీట్లలో కేవలం 29 చోట్ల గెలిచింది. కర్ణాటకలో 28 సీట్లకు ఏకంగా 25 నెగ్గగా తెలంగాణలో 17 స్థానాలకుగాను నాలుగు చోట్ల గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌లో 25, తమిళనాడులో 39, కేరళలో 20 స్థానాలకు గాను ఒక్కటంటే ఒక్కటి కూడా గెలవలేక చతికిలపడింది. ఈసారి మాత్రం దక్షిణాదిన ఎలాగైనా కనీసం 60 సీట్లలో గెలుపే లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా జరిగిన బీజేపీ పదాధికారుల భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఇదే విషయాన్ని నొక్కిచెప్పారు. బీజేపీ ఎత్తుగడలను ఇటీవలి కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దెబ్బ తీశాయనే చెప్పాలి. కర్ణాటక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు 42.88 శాతం ఓట్లు రాగా, బీజేపీ 36 శాతం ఓట్లకు పరిమితం కావడమే గాక రాష్ట్రంలో అధికారం కూడా కోల్పోయింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో 13 శాతం ఓట్లు సాధించిన జేడీ(ఎస్)తో కలిసి లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. కాంగ్రెస్‌ను ఎలాగైనా సింగిల్ డిజిట్‌కే పరిమితం చేసేలా వ్యూహాలు రచిస్తోంది. అయితే సీట్ల పంపకాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. జేడీ(ఎస్) నేత కుమారస్వామి ఇటీవలే ప్రధాని మోదీతో ఈ అంశమై చర్చలు జరిపారు. ఇక 2019లో నాలుగు లోక్‌సభ సీట్లు సాధించిన తెలంగాణలో ఈసారి కనీసం రెట్టింపు చోట్ల గెలవాలని బీజేపీ యోచిస్తోంది. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 7 శాతం ఓట్లు సాధించిన బీజేపీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో దాన్ని రెట్టింపునకు పెంచుకుని 14 శాతం ఓట్లు రాబట్టింది. ఈ లెక్కన ఎంపీ సీట్లను కూడా డబుల్ చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదనే ఆశపడుతోంది. పదాధికారుల భేటీలో మోదీ, షా ద్వయం ఇదే విషయాన్ని తెలంగాణ బీజేపీ నేతలకు నూరిపోశారు.

కేరళలో...

కేరళలో వామపక్ష సంకీర్ణ కూటమితో తలపడటం బీజేపీకి పెద్ద సవాల్‌గా మారింది. వరుసగా 2104, 2019 ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన బీజేపీ ఈసారి కనీసం ఎనిమిది సీట్లు సాధించాలని చూస్తోంది. గత ఎన్నికల్లో 12 శాతం ఓట్లను రాబట్టుకున్న పార్టీ ఈసారి 25 శాతం ఓట్లు లక్ష్యంగా కార్యాచరణను రూపొందిస్తోంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో తన పట్టు పెంచుకునేందుకు బీజేపీ ఎక్కువగా పొత్తులపైనే ఆధారపడుతోంది. జనసేనతో పొత్తు కొనసాగినా అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈసారి 24 సీట్ల దాకా ఖాయమన్న వస్తాయన్న సర్వే సంస్థల వెల్లడి నేపథ్యంలో బీజేపీ ఇక్కడ ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితే కనిపిస్తోంది.

ఉత్తరాది నేతలకు బాధ్యతలు

దక్షిణాది రాష్ట్రాల్లో పాగా దిశగా వ్యూహ రచనకు బీజేపీ ఇప్పటికే టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి, ఉపాధ్యక్షులు బైజయంత్ పాండా, దిలీప్ ఘోష్, లాల్‌సింగ్ ఆర్య ఇందులో ఉన్నారు. రాష్ట్రాలవారీగా పార్టీ పరిస్థితులను అంచనా వేసి, తదనుగుణంగా గెలుపు వ్యూహాలను అధిష్టానం సిద్ధం చేసింది. వాటి అమలు బాధ్యతను గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కీలక నేతలకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. యూపీ నేతలు కేశవ్ ప్రసాద్ మౌర్య, సునీల్ బన్సల్, స్వతంత్ర దేవ్ సింగ్, గుజరాత్‌కు చెందిన పర్ణేశ్ మోదీ, విజయ్ రూపానీ సేవలను కూడా వినియోగించుకోనుంది.

– సాక్షి, న్యూఢిల్లీ

దక్షిణాదిన ఈసారి బీజేపీ ప్రధానంగా దృష్టి సారించిన రాష్ట్రం తమిళనాడు. ఇక్కడ ఆ పార్టీ ఇప్పటిదాకా బోణీ కొట్టలేకపోయింది. అధికార డీఎంకే అక్కడ కాంగ్రెస్‌తో అంటకాగడం బీజేపీకి మింగుడు పడట్లేదు. జయలలిత హయాంలో బీజేపీకి ఏఐఏడీఎంకేతో పొత్తుండేది. అయితే 2014లో అన్నాడీఎంకే 44 శాతం ఓట్లతో 37 సీట్లు నెగ్గితే మిత్రపక్షంగా బీజేపీ కేవలం 5.56 శాతం ఓట్లతో సరిపెట్టుకుంది. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ బీజేపీ పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఓట్ల శాతం 3.66 శాతానికి తగ్గింది. ఈ నేపథ్యంలో అక్కడ ఓట్ల శాతాన్ని పెంచుకుని, దాన్ని సీట్లలోకి కూడా మార్చుకోవడం బీజేపీకి కత్తిమీద సామే. మోదీ కరిష్మాతో ఈ పరిస్థితిని అధిగమించాలని పార్టీ భావిస్తోంది. ఇందుకోసం మోదీని తమిళనాడు నుంచి రాష్ట్రం నుంచి బరిలో నిలపాలని రాష్ట్ర బీజేపీ నేతలు భావిస్తున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కోయంబత్తూరు, కన్యాకుమారి, రామనాథపురంలో ఏదైనా ఒక లోక్‌సభ స్థానం నుంచి మోదీ పోటీ చేయవచ్చే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి బలాన్నిస్తూ మోదీ తమిళనాడులో పదేపదే పర్యటిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. దీనికి తోడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలైకి అధిష్టానం పూర్తి స్వేచ్ఛనిచ్చింది. ఆయన డీఎంకే ప్రభుత్వ పనితీరు, అవినీతిపై తీవ్రంగా విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. అవినీతి ఆరోపణలపై ఇద్దరు డీఎంకే మంత్రులు ఇప్పటికే జైలుకు వెళ్లగా, మరింత మందికి శిక్ష తప్పదనే సంకేతాలను బీజేపీ పంపుతోంది!

తమిళనాడు నుంచి లోక్‌సభ బరిలో మోదీ...?

బీజేపీ వీడియోతో డీఎంకే ఎదురుదాడి

చెన్నై: హిందీ మాట్లాడేవాళ్లు తమిళనాడులో టాయిలెట్లు కడుగుతున్నారంటూ మార్చి నెలలో డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యల వీడియోపై బీజేపీ దుమ్మెత్తి పోస్తుండటంతో డీఎంకే ఘాటుగా స్పందించింది. దక్షిణాది ప్రజలు నల్లగా ఉంటారంటూ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యల వీడియోను తెరమీదకు తెచ్చింది. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు 'నల్లని మనుషులు' అంటూ బీజేపీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు తరుణ్ విజయ్ చేసిన వ్యాఖ్యల పాత వీడియోను డీఎంకే తాజాగా షేర్ చేసి దీనిపై బీజేపీ నేతలు ఏమంటారని ప్రశ్నించింది. 2017 సంవత్సరంలో అల్ జజీరా టీవీ చానల్‌లో చర్చా కార్యక్రమంలో తరుణ్ చేసిన వ్యాఖ్యలు ఆనాడు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. తర్వాత ఆయన క్షమాపణలు చెప్పారు. '' ఉత్తరాది రాష్ట్రాల ప్రజలకు నిజంగానే జాతి వివక్ష చూపే అవలక్షణమే ఉంటే మాకు మొత్తం దక్షిణాదితో అవసరమేముంది?. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్.. ఇలా ఈ రాష్ట్రాల ప్రజలతో ఎందుకు కలిసి మెలిసి ఉంటాం?. మా చుట్టూ మొత్తం నలుపు మనుషులే ఉన్నారు'' అని తరుణ్ విజయ్ మాట్లాడిన వీడియోను డీఎంకే ఐటీ విభాగం షేర్ చేసింది. ''యూపీ, బిహార్ ప్రజలు ఇంగ్లిష్‌ను గాలికొదిలి హిందీని పట్టుకుని వేలాడి తమిళనాడులో టాయిలెట్లు కడుగుతున్నారు'' అని డీఎంకే నేత దయానిధి మారన్ గతంలో చేసిన వ్యాఖ్యలు తాజాగా దేశవ్యాప్తంగా వివాదం రేపడం తెలిసిందే.

దేశవ్యాప్తంగా 63 కరోనా జేఎన్1 కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: వేగవంతమైన సాంక్రమణ సామర్థ్యమున్న కరోనా జేఎన్1 రకం వైరస్ వ్యాప్తి దేశంలో పెరుగుతోంది. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఈ ఉపవేరియంట్ రకం కరోనా పాజిటివ్ కేసులు 63 వెలుగుచూసినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. ఒక్క గోవాలోనే 34 ఈ రకం వైరస్ కేసులు బయటపడ్డాయి. మహారాష్ట్రలో తొమ్మిది, కర్ణాటకలో ఎనిమిది, కేరళలో ఆరు, తమిళనాడులో నాలుగు, తెలంగాణలో రెండు ఈ రకం కేసులు నమోదయ్యాయి. అన్ని వేరియంట్లు కలుపుకుని గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా కొత్తగా మొత్తం 628 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 4,054కు చేరినట్లు కేంద్రం తెలిపింది. కేరళలో 128 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రాలు కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యను, వైరస్ నిఘా వ్యవస్థను పెంచాలని కేంద్రం సూచించింది.



సోమవారం ఉదయం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తిగా కమ్మేసిన పొగ మంచు

ఉత్తరాదిని 'కమ్ముకున్న పొగమంచు'

సాక్షి, న్యూఢిల్లీ: చలి పులికి ఉత్తరాది రాష్ట్రాలు గజగజ వణుకుతున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాల్లో మంచుతెరలు దట్టంగా పరుచుకున్నాయి. ఢిల్లీసహా ఆరు రాష్ట్రాల విమానాశ్రయాల్లో సోమవారం ఉదయం పొగమంచు తీవ్రతంగా ఉండటంతో రన్‌వే కూడా కనిపించని పరిస్తితి ఏర్పడింది. దీంతో పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఏర్పడటంతో పలు విమానాలను అధికారులు దారి మళ్లించారు. సోమవారం ఉదయం ఢిల్లీ, అమృత్‌సర్, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్, గ్వాలియర్, జైసల్మేర్ విమానాశ్రయాల్లో జీరో విజిబిలిటీ నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. వచ్చే కొద్ది రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ అంచనావేసింది. ప్రతికూల వాతావరణ ప్రభావంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. సోమవారం ఉదయం పొగమంచు కారణంగా ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు విమానాల రాకపోకలపై ప్రభావం పడింది.

ప్రాణం తీసిన పొగమంచు!

బహ్రెయిచ్(యూపీ): దట్టంగా కమ్ముకున్న పొగమంచు ముగ్గురి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్–బల్‌రామ్‌పూర్ రహదారిలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. మంచుదుప్పటి కప్పిన రోడ్డుపై వేగంగా వస్తున్న ట్రక్కును ప్రయాణికుల బస్సు ఢీకొట్టింది. డ్రైవర్లతో పాటు ఒక ప్రయాణికుడు మరణించాడు. 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి.

నిరుపేద, అణగారిన వర్గాల సాధికారతే ధ్యేయం: మోదీ

ఇండోర్: సమాజంలో నిరుపేద, అణగారిన వర్గాల సాధికారతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయా వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో హుకుంచంద్ మిల్లు కార్మికులకు రూ.224 కోట్ల మేర బకాయిలు చెల్లించే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభించారు. బకాయిల చెల్లింపుతో 4,800 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో మధ్యప్రదేశ్‌లో అభివృద్ధి వేగం పుంజుకుందని హర్షం వ్యక్తం చేశారు. బిల్లు కార్మికులకు చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు.

మాలవీయ పుస్తకం ఆవిష్కరణ

బెనారస్ హిందూ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, స్వాతంత్య్ర సమరయోధుడు మదన్ మోహన్ మాలవీయ రచనలు, లేఖలు, కరపత్రాలు, ప్రసంగాలతో కూడిన పుస్తకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఢిల్లీలో ఆవిష్కరించారు. మాలవీయ 162వ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. మాలవీయ రచనలను ఆంగ్లం, హిందీ భాషల్లో 11 సంపుటాలుగా ప్రచురించారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు

సమాజానికి సరైన దశ దిశను చూపడంలో, ప్రజలకు సేవలందించడంలో క్రైస్తవుల పాత్ర పట్ల దేశం గర్విస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో వారు ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆయన క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో క్రైస్తవులతో సమావేశమయ్యారు. క్రైస్తవ వర్గం ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పేదలకు సేవలందించడంలో క్రైస్తవులు ఎల్లప్పుడూ ముందంజలో ఉంటున్నారని కొనియాడారు. విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఎనలేని సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. యేసు ప్రభువు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు.



సోమవారం ఢిల్లీలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

వాజ్‌పేయికి ముర్ము, మోదీ నివాళులు

దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన స్మారకం 'సదైవ్ అటల్' వద్ద సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ అభివృద్ధి కోసం వాజ్‌పేయి అహర్నిశలూ కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, హర్దీప్‌సింగ్ పురి, అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విషాహారం

ఒకరి మృతి..70 మందికి అస్వస్థత

బెంగళూరు: బెంగళూరు శివారులోని హోస్‌కోటే ప్రాంతంలో ఒక ఆలయంలో ప్రసాదం తిని ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. 70 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆలయంలో విషాహారం ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం వెంటనే దర్యాప్తునకు ఆదేశించింది. ఆదివారం ఒక ఆలయంలో అక్కడి భక్తులు ప్రసాదం తిన్నాక వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతూ వేర్వేరు ఆస్పత్రుల్లో చేరారు. ఆరోగ్యం పూర్తిగా విషమించి ఒక మహిళ సోమవారం ఆస్పత్రిలో కన్నుమూసింది. ఫుడ్ పాయిజన్‌కు కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఒక ఆస్పత్రిలో ఒక ఫ్లోర్ మొత్తం ఐసీయూ పేషెంట్ల కోసం కేటాయించి చికిత్స చేస్తోంది. ప్రసాదం తినడం వల్లే తమ ఆరోగ్యం చెడిపోయిందని కొందరు చెప్పగా, ప్రసాదం తినకపోయినా ఆరోగ్య సమస్యలు తలెత్తాయని ఇంకొందరు చెప్పారు! దీనిపై నుంచి నివేదిక రావాల్సి ఉందని పోలీసులన్నారు.

కట్టేసి.. ఒళ్లంతా బ్లేడుతో కోసి.. పెట్రోల్ పోసి తగలబెట్టి..

స్నేహితురాలి దారుణ హత్య

చెన్నైలో 'ట్రాన్స్‌మ్యాన్' ఘాతకం

చెన్నై: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితురాలు. అబ్బాయిగా మారింది. దాంతో ఎవరూ ఆదరించడం లేదు. దాంతో అయ్యో పాపమని తనతో సానుభూతితో మాట్లాడింది. ఆ పాపానికి ప్రాణమే కోల్పోయిందో అమ్మాయి! మరెవరికీ దక్కొద్దనే అత్యాశతో అబ్బాయిగా మారిన (ట్రాన్స్‌మ్యాన్) అమ్మాయే ఆమెను పొట్టన పెట్టుకుంది. ఈ దారుణం తమిళనాడులో జరిగింది.

తానే సర్వస్వంగా ఉండాలనే అత్యాశ

మదురైకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆర్.నందినికి పాండీ మహేశ్వరి బాల్య స్నేహితురాలు. ఇద్దరూ పదో తరగతి వరకు కలిసే చదువుకున్నారు. ప్రస్తుతం థొరైపాకంలో ఎనిమిది నెలలుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. 26 ఏళ్ల పాండీ మహేశ్వరి కొంతకాలం క్రితం అబ్బాయిగా మారింది. వెట్రిమారన్ అని పేరు మార్చుకుంది. దాంతో తనకు స్నేహితులు లేకుండా పోయారు. తన బాధ చూడలేక సానుభూతితో నందిని మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ నందిని తనతోనే మాట్లాడాలి, తనతోనే ఉండాలనేంతగా వెట్రిమారన్ తీరులో మార్పు వచ్చింది. ఇతర స్నేహితులతో మాట్లాడితే అస్సలు నచ్చేది కాదు. దాంతో నందిని అతడిని దూరం పెట్టేందుకు ప్రయత్నించింది. చెన్నైలో దగ్గరి బంధువుల ఇంటికి మకాం మార్చింది. ఉద్యోగం చేసేది.

బర్త్‌డే సర్‌ప్రైజ్ అని తీసుకెళ్లి...

నందిని తనను అస్సలు పట్టించుకోవట్లేదన్న కసితో ఎలాగైనా చంపేయాలని వెట్రిమాన్ నిర్ణయించుకున్నాడు. డిసెంబర్ 24న నందిని పుట్టినరోజు కావడంతో సర్‌ప్రైజ్‌చేస్తానంటూ ముందు రోజు శనివారం ఆమెను వెంటబెట్టుకుని తాంబరం సమీపంలోని అనాథాశ్రయానికి తీసుకెళ్లి విరాళం ఇచ్చాడు. కొత్త బట్టలు కొనిచ్చి పొన్మార్ వద్ద నిర్మానుష్య ప్రదేశంలో ఆగాడు. సర్‌ప్రైజ్ చేస్తానంటూ గంతలు కట్టి, కాళ్లు, చేతులు కట్టేశాడు. బ్లేడుతో విచక్షణారహితంగా మెడపై, ఛాతిపై, ఒళ్లంతా కోశాడు. భయంతో కేకలు వేస్తున్న నందినిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. యువతి హాహాకారాలు విన్న చుట్టుపక్కల జనం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ''మేం ఘటనాస్థలికి చేరుకున్నపుడు వెట్రిమారన్ కూడానే ఉన్నాడు. కాలిపోయింది నందిని అని అతనే చెప్పాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించేటపుడూ వెంట వచ్చాడు'' అని పోలీసులు చెప్పారు. నందిని మరణవాంగ్మూలంలో వెట్రిమారన్ గురించి చెప్పడంతో అతడిని పట్టుకున్నారు. నందిని మృతదేహాన్ని ఆమె పుట్టినరోజు నాడే కుటుంబానికి అప్పగించారు. కుటుంబసభ్యుల రోదన చూసిన వారందరికీ హృదయం ద్రవించింది.

పెద్ద పదవులు కోరుకోవడం లేదు: నితీశ్

పాట్నా: గత వారం ఢిల్లీలో జరిగిన విపక్ష 'ఇండియా' కూటమి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పట్ల తాను అసంతృప్తితో ఉన్నానంటూ వెలువడిన వార్తలను బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ ఖండించారు. తమ కూటమిలో భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు త్వరలోనే పూర్తవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరును మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి నేతలు ప్రతిపాదించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. నితీశ్ కుమార్ సోమవారం పాట్నాలో మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగతంగా తనకు పెద్ద కోరికలేవీ లేవని తెలిపారు. పెద్ద పదవులను తాను ఆశించడం లేదన్నారు. 'ఇండియా' కూటమి నిర్ణయాలపై తనకు ఎలాంటి అసంతృప్తి లేదని ఉద్ఘాటించారు. జేడీ(యూ) నేతల మధ్య తీవ్ర విభేదాలున్నాయన్న ప్రచారాన్ని నితీశ్ కొట్టిపారేశారు. పార్టీలో ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు.



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సోమవారం వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ బాసిలికా బాల్కనీ నుంచి విశ్వాసులకు ఆశీస్సులు అందిస్తున్న పోప్ ఫ్రాన్సిస్

బాల యేసులు ఎందరో యుద్ధంలో మరణిస్తున్నారు

- ఇజ్రాయెల్ దాడులు మరణాల నెత్తురు పంట పండిస్తున్నాయి
- క్రిస్మస్ సందేశంలో ఆవేదన వ్యక్తం చేసిన పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ తన సందేశంలో గాజాపై ఇజ్రాయెల్ హేయ దాడులను ప్రస్తావించారు. పాలస్తీనియన్ల అపార ప్రాణనష్టానికి హేతువైన ఇజ్రాయెల్ దాడులను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చి ప్రధాన బాల్కనీ నుంచి సోమవారం పోప్ తన సందేశం వినిపించారు. '' గాజా సహా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల్లో బాలలు కన్నుమూస్తున్నారు. వారంతా నేటి తరం బాల యేసులు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు అక్కడి అమాయక పౌరుల నెత్తుటి పంట పండిస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై అక్టోబర్‌లో హమాస్ మెరుపు దాడి దారుణం. నాడు అపహరించుకుపోయిన వారందర్నీ హమాస్ విడిచిపెట్టాలి. ప్రపంచ ఆయుధ విపణి యుద్ధవీణ తంత్రులను మోగిస్తోంది. గాజా, ఉక్రెయిన్, సిరియా, యెమెన్, లెబనాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లలో సైనిక, సామాజిక, రాజకీయ సంక్షోభాలు సమసిపోవాలి. ప్రపంచవ్యాప్తంగా శరణార్థుల హక్కులు పరిరక్షించబడాలి. గాజా స్ట్రిప్‌లో మానవతా సాయానికి దారులు తెరచి మానవీయ సంక్షోభాన్ని నివారించాలి'' అని పోప్ వ్యాఖ్యానించారు. విశ్వవ్యాప్తంగా పెరిగిన ఆయుధ కొనుగోళ్లపై స్పందించారు. ''ఆయుధాల ఉత్పత్తి, కొనుగోలు, రవాణా ఊహకందనంత పెరిగిన ఈ తరుణంలో కనీసం శాంతి అన్న పదం మనం ఉచ్చరించగలమా?'' అని పోప్ ఆవేదన వ్యక్తంచేశారు.

రష్యా సంప్రదాయాలకు ఉక్రెయిన్ 'నో'

అందరిలాగే ఇకపై డిసెంబర్ 25న క్రిస్మస్



ఉక్రెయిన్ రాజధాని కీవ్ శివార్లలోని ఓ గ్రామంలో వేడుకగా క్రిస్మస్ పర్వదినాన్ని జరుపుకుంటున్న చిన్నారులు

కీవ్: తమ భూభాగంపై దురాక్రమణకు దిగిన రష్యాపై ఆగ్రహంగా ఉన్న ఉక్రెయిన్ శతాబ్దకాలంగా పాటిస్తూ వస్తున్న సంప్రదాయానికీ తిలోదకాలు ఇచ్చింది. వందేళ్లకుపైగా ఉక్రెయిన్ జనవరి ఏడో తేదీనే క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటోంది. రష్యా దండయాత్రతో ఆ దేశంతో శత్రుత్వం మరింత పెంచుకున్న ఉక్రెయిన్.. రష్యాతోపాటు అనుసరిస్తున్న రోమన్లకాలంనాటి జూలియన్ క్యాలెండర్‌ను పట్టించుకోవద్దని నిర్ణయించుకుంది. ప్రపంచంలో అత్యధిక క్రైస్తవ మెజారిటీ దేశాలు పాటించే గ్రెగోరియన్ క్యాలెండర్‌ను ఇకపై అనుసరించాలని తుది నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన చట్టానికి ఈ జూలై నెలలోనే దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆమోదముద్ర వేశారు. దీని ప్రకారం ఈఏడాది తొలిసారిగా డిసెంబర్ 25వ తేదీనే క్రిస్మస్ వేడుకలు ఉక్రెయిన్ అంతటా జరిగాయి. దేశంలో డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ వేడుకలు జరగడం వందేళ్లలో ఇదే తొలిసారి. ఇన్నాళ్లూ రష్యాతోపాటు జూలియన్ క్యాలెండర్‌ను అనుసరిస్తూ జనవరి ఏడో తేదీన క్రిస్మస్‌ను జరుపుకుంది. ఈ సంవత్సరంతో ఉక్రెయిన్ కొత్త సంప్రదాయానికి తెరతీసింది. ' ఉక్రేనియన్లు సొంత సంప్రదాయాలు, సెలవులు, సొంత పర్వదినాలతో జీవించనున్నారు' అని ఈ సందర్భంగా జెలెన్‌స్కీ అన్నారు. ఉక్రెయిన్‌లో క్రైస్తవ జనాభానే అధికం. ఉక్రెయిన్‌లో దశాబ్దాలుగా రష్యన్ ప్రాచీన చర్చి సంప్రదాయాలనే ఎక్కువగా పాటిస్తుండటం గమనార్హం.

బెత్లెహంలో సాదాసీదాగా క్రిస్మస్



వెస్ట్‌బ్యాంక్‌లోని బెత్లహంలో జీసస్ జన్మస్థలంగా భావించే చాపెల్ ఆఫ్ సెయింట్ కాథరిన్‌లో సోమవారం క్రిస్మస్ ప్రార్థనలు

బెత్లెహం: క్రీస్తు జన్మస్థలం బెత్లెహం నగరంలో క్రిస్మస్ పర్వదినాన సందడి కన్పించలేదు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం నేపథ్యంలో ఈసారి అక్కడ సంబరాలు నిర్వహించరాదని నిర్ణయించారు. దాంతో క్రిస్మస్ ప్రత్యేక వేడుకలేవీ నిర్వహించలేదు. పండగ వెలుగులు, ఏటా వచ్చే వేలాది మంది పర్యాటకులు, సందర్శకులు, భక్తుల కోలాహలం లేక బెత్లెహం వెలవెలబోయింది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో హమాస్ మద్దతుదారుల కోసం కోసం ఇజ్రాయెల్ సేనలు గాలింపు ముమ్మరం చేశాయి. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై సోమవారం ఉదయం వైమానిక దాడులు చేశాయి. క్రిస్మస్ ఏర్పాట్లలో మునిగిపోయిన జనం ఈ దాడులతో భయాందోళనకు గురయ్యారు. యేసు జన్మించిన ప్రదేశంగా భావించే బెత్లహంలోనూ వైమానిక దాడులు జరిగాయి.

'అల్‌–మగజి'పై అసాధారణ దాడులు

106 మంది పాలస్తీనియన్ల దుర్మరణం

గాజా స్ట్రిప్: భీకర గగనతల, భూతల దాడులతో తలో దిక్కూ పారిపోతూ శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ క్షిపణులు కనికరం చూపడం లేదు. సోమవారం సెంట్రల్ గాజా స్ట్రిప్‌లోని డెయిర్ అల్–బాలాహ్ పట్టణం సమీపంలోని అల్–మగజి శరణార్థి శిబిరంపై ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో ఏకంగా 106 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మూడు అంతస్తుల భవంతి పూర్తిగా నేలమట్టమైంది. భవన శిథిలాల నుంచి డజన్ల కొద్దీ మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యాలు అంతర్జాతీయ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. మరణాల సంఖ్య పెరగవచ్చని హమాస్ ఆరోగ్య విభాగం తెలిపింది. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దురాక్రమణ మొదలయ్యాక జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదీ ఒకటి. గాజా స్ట్రిప్‌లో మొత్తంగా గత 24 గంటల్లో 250 మంది మరణించారని, 500 మందికి పైగా పాలస్తీనియన్లు గాయపడ్డారని హమాస్ పేర్కొంది. ఇజ్రాయెల్ కాల్పుల విరమణను ప్రకటించనుందన్న వార్తలను ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తోసిపుచ్చారు. త్వరలోనే యుద్ధాన్ని మరింతగా విస్తరిస్తామన్నారు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023

సీఎస్ఐ చర్చిలో క్రిస్టియన్లు







సీఎస్ఐ చర్చిలో దైవ సందేశమిస్తున్న పాస్టర్



ఇరుకుల్లలో ఫాదర్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

కరీంనగర్‌కల్చరల్: జిల్లాలో క్రిస్మస్ వేడుకలను సోమవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే చిన్నారులు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి చర్చిల్లో ప్రార్థనలు, ప్రత్యేక గీతాలాపనలు చేశారు. ప్రభువు నామసర్మణతో క్రైస్తవ మందిరాలు కిటకిటలాడయి. ఫాదర్స్, పాస్టర్స్ దైవ సందేశం, బోధనలు శ్రద్ధగా విన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కరీంనగర్‌లోని వివిధ కాలనీల్లోని చర్చిల్లో ఉదయం నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమీపంలోని సీఎస్ఐ వెస్లీ కెథెడ్రల్ చర్చిలో ఫాస్టరేట్ చైర్మన్ పాల్ కొమ్మాల్ ప్రార్థనలు చేయించి దైవ సందేశమిచ్చారు. క్రిస్టియన్‌కాలనీ సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చిలో ఫాస్టరేట్ చైర్మన్ ఎస్.జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అతిథులుగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. విజయరఘునందన్ రోడ్డులోని సెయింట్ మార్క్ చర్చిలో సాలీ ప్రభుదాస్ మెమోరియల్ ఆశ్రమ విద్యార్థులు, క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. జ్యోతినగర్‌లోని లూర్దుమాతా చర్చి ఫాదర్ ఆర్.థామస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సందేశాన్నిచ్చారు.

కరీంనగర్ మండలంలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గుంటూరుపల్లి, మొగ్దుంపూర్, నగునూరు తదితర గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇరుకుల్ల చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని కేక్ కట్ చేశారు.



సీఎస్ఐ చర్చిలో భక్తి గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు



క్రిస్టియన్‌కాలనీ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కమలాకర్, మేయర్ సునీల్‌రావు తదితరులు



క్రిస్టియన్‌కాలనీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

న్యూస్‌రీల్

మళ్లీ కరోనా..

- కరీంనగర్‌లో రెండు కేసులు నమోదు

కరీంనగర్‌టౌన్: ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమస్య పోయిందని అనుకుంటున్న తరుణంలో మళ్లీ వెలుగు చూస్తోంది. రెండేళ్ల తర్వాత కోవిడ్ కేసులు జిల్లాలో బోణీ అయ్యాయి. కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. ఒకరు హాస్పిటల్లో పనిచేసే నర్సు కాగా, మరొకరు జనరల్ సర్జరీ కోసం వచ్చిన మహిళకు అనుమానంతో ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయగా పాజిటివ్‌గా తేలినట్లు తెలిపారు. కాగా రెండు శాంపిల్స్‌ను జీనోమ్ పరీక్షల కోసం గాంధీ ఆసుపత్రికి పంపించారు. రాష్ట్రంలో ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్–1 సబ్ వేరియంట్ నమోదవుతున్న దృష్ట్యా శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపించినట్లు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పితో బాధపడుతూ వారానికి పైగా సమస్య తగ్గకపోతే వెంటనే ఆసుపత్రికి వచ్చి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. రద్దీ ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సూచించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కరీంనగర్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్టాఫ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి రాజిరెడ్డి, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం మాట్లాడుతూ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ సత్వరమే పరిష్కరించడానికి అధికారులతో కూడిన కమిటీ వేసి అందులో యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని పేర్కొన్నారు. 2019 సమ్మె సమయంలో కార్మికులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని, చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ అయినవారి కుటుంబ సభ్యులకు రెగ్యులర్ ప్రతిపాదికన ఉద్యోగాలు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే బస్సుభవన్‌లో అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి యూనియన్లతో మాట్లాడుతానని హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జి.అబ్రహం, గోపాల్, సాయిరెడ్డి, సుభాష్, డీవీఎస్ రెడ్డి, టి.రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, చారి తదితరులు ఉన్నారు.

జిల్లా జైలు తనిఖీ



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా జైలును సోమవారం జైళ్లశాఖ వరంగల్, హైదరాబాద్ రేంజ్ డీఐజీ సంపత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల యోగక్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్, జైలు ఆసుపత్రి, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, కిచెన్‌తో పాటు ఇండస్ట్రీని సందర్శించారు. జైలు పెట్రోల్ బంక్ పనితీరును చూసి అభినందించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య, జైలు వైద్యాధికారి వేణు, జైలర్ పి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



చొప్పదండి: ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు శ్రీగాధ సంతోష్ తెలిపారు. ఇటీవల వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించిన పోటీల్లో సన్‌రైజ్ తైక్వాండో అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి ఈ నెల 30 నుంచి జనవరి 5 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అండర్– 14 విభాగంలో సమీక్ష, అండర్– 17 విభాగంలో లాస్యప్రియ, అండర్– 19 విభాగంలో మధుబుహ, నాసిర్, రమ్య ఎంపికై నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తైక్వాండో అసోషియేషన్ జిల్లా బాధ్యులు అభినందించారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దొంగలుపడ్డారు

- మూడు తలుపుల తాళాలు వగులగొట్టి లోనికి..
- ఓ వ్యక్తి రికార్డు రూంకు వచ్చి వలు దస్త్రాలతో వెళ్లినట్లు గుర్తింపు
- వివరాలు సేకరించిన క్లూస్‌టీం.. కొనసాగుతున్న విచారణ



రిజిస్ట్రేషన్ కార్యాలయం



రికార్డు రూం తాళం పగులగొట్టి ఉన్న దృశ్యం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. సోమవారం ఉదయం కార్యాలయ సిబ్బంది వచ్చి చూసేసరికి రెండు ప్రవేశ ద్వారాలతో పాటు రికార్డు రూం తాళాలు పగులగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకొని పోలీసులకు దొంగలు పడ్డారన్న విషయం చెప్పారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి వచ్చి వెళ్లినట్లు తెలుస్తుంది.

రికార్డు గదియే టార్గెట్

రిజిస్ట్రేషన్ రికార్డులు భద్రపరిచే గదిని టార్గెట్ చేసుకొని చొరబడిన ఓ వ్యక్తి ఆది, సోమవారాలు వరుస సెలవులు ఉండడం చూసి పలు దస్త్రాలు ఎత్తుకెళ్లడానికి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. రికార్డు రూంలో దాదాపు 1990 సంవత్సరం నుంచి అంతకు పూర్వపు దస్త్రాలు భద్రపరుస్తుంటారు. రూంలోకి వెళ్లి బయటకు వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి చేతిలో పలు దస్త్రాలు ఉన్నట్లు పోలీసులు సీసీ పుటేజీ ద్వారా గుర్తించారు. కాగా రికార్డు రూంలో సరిగ్గా అక్కడే తనకు కావాల్సిన పేపర్లు ఉంటాయని ఎలా తెలుస్తుంది.. ఎవరి సూచనల ప్రకారం వచ్చి ఉంటాడు.. కార్యాలయానికి చెందిన వాడా లేదా బయటి వాడా.. కార్యాలయంలోకి ఎలా వచ్చాడు.. దేని గురించి వచ్చాడు.. అతడు తీసుకెళ్లిన దస్త్రాలు ఏమిటి.. అన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. రిజిస్ట్రేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రాత్రిపూట కాపలా కరువు

కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రాత్రిపూట ఎవరూ ఉండడం లేదని తెలుస్తోంది. కార్యాలయ సమయం పూర్తయ్యాక విధులు ముగించుకొని అన్ని తాళాలు వేసి వెళ్తున్నట్లు తెలిసింది. ఉదయం 9 గంటల తర్వాత వచ్చి మళ్లీ తెరుస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం రాత్రి వేళ కార్యాలయానికి కాపాలా ఉండేందుకు అటెండర్లకు ఉన్నతాధికారులు పలు దఫాలుగా విధులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ విధుల్లో ఉన్న అటెండర్ కార్యాలయం మూసివేసిన సమయం నుంచి మరుసటి రోజు రిలీవ్ అయ్యే వరకు కాపలా ఉండాలి. ఏ సమయంలోనైనా రిజిస్ట్రేషన్ కార్యాలయం కాపలా లేకుండా ఉండకూడదు. నైట్ విధులు సరిగా నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాన్ని కార్యాలయ అధికారి అప్పుడప్పుడు తనిఖీ చేసి తెలుసుకోవాలి. కార్యాలయ పనివేళల్లో కాకుండా ఇతర సమయాల్లో కాపలా విధులు నిర్వహించేందుకు ప్యాట్రోల్ (ఫారం రిజిస్ట్రేషన్-11) రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అలాంటిదేమీ నిర్వహించడం లేదని ఆరోపణలున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

28 నుంచి 'ప్రజాపాలన'

- పది రోజులపాటు అమలుకు శ్రీకారం
- గ్రామ పంచాయతీల్లో కలెక్టర్ల పర్యటన
- ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ



సాక్షిప్రతినిధి, కరీంనగర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సరికొత్త నిర్ణయాలతో ముందుకు సాగనుంది. ప్రభుత్వ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళ్లేందుకు 'ప్రజాపాలన' పేరుతో పదిరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈనెల 28న ఈ కార్యక్రమానికి అంకుర్పారణ జరగనుంది. వచ్చేనెల 6వరకు 'ప్రజాపాలన' పేరుతో గ్రామపంచాయతీల్లోనే మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకం (ఆరు గ్యారంటీలు) దరఖాస్తులు స్వీకరించనుంది. పరిపాలనను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లటంతోపాటు సమస్యల పరిష్కారానికి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక యంత్రాంగం గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా విని అక్కడికక్కడే పరిష్కరించాలనేది ప్రధాన ఉద్దేశం. ఇటీవల హైదరాబాద్‌లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో నిర్వహించిన సదస్సులో జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజాపాలన వేదిక దిక్సూచీగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామస్థాయిలో విద్య, వైద్యం, భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేసింది. తొలుత పది రోజుల పాటు గ్రామస్థాయిలో ప్రజాపాలన పెద్దఎత్తున నిర్వహించాలని, ఆ తరువాత వారానికి రెండు రోజులు లేదా నెలలో కొన్ని రోజులు నిర్వహించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

కలెక్టర్లు నేరుగా గ్రామాలకు

జిల్లా కలెక్టర్ గ్రామాలకు వెళ్లి నేరుగా ప్రజల గోడు విని అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేసేలా ఈ కార్యక్రమం ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. అధికారులు ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో సభలు నిర్వహిస్తారు. ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను ఈ గ్రామసభల్లో స్వీకరించి రశీదులు ఇవ్వనున్నారు. దరఖాస్తులను నింపడానికి ఇబ్బంది లేకుండా గ్రామాల్లో ప్రజలకు ముందే దరఖాస్తుల ఫారాలు అందించనున్నారు. ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడమే లక్ష్యంగా 'ప్రజాపాలన' ఉండేలా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

రాముని ఆరాధనతో సకల శుభాలు



బైక్‌ర్యాలీలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు

కరీంనగర్‌కల్చరల్: అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర సోమవారం నగరంలో వైభవంగా జరిగింది. వైశ్యభవన్ వద్ద విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో అక్షింతలతోపాటు రాముని విగ్రహంతో కూడిన ప్రత్యేక వాహన శోభాయాత్రను పరంధామాశ్రమం-పంచముఖ హనుమాన్ పీఠాధిపతి పరబ్రహ్మానందగిరి స్వామి ప్రారంభించారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ, రాముని విగ్రహ ప్రతిష్ఠ అయోధ్యలో జరుగబోతుండటం దేశానికి శుభ పరిణామమన్నారు. రాముడు అందరివాడని, ఆయనను ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. ప్రపంచంలో నదులు, పర్వతాలు ఉన్నంతకాలం రామాయణ కావ్యం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల బైక్ ర్యాలీ రాజీవ్‌చౌక్, ప్రకాశంగంజ్, కమాన్, బస్టాండ్, తెలంగాణచౌక్, కోర్టు చౌరస్తా మీదుగా సుభాష్‌నగర్‌లోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయానికి చేరింది. యాత్ర సందర్భంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, రమేశ్, బజరంగదళ్ జోనల్ ఇన్‌చార్జి ప్రదీప్, ఉపాధ్యక్షులు టి.రాజేందర్, స్వరూపారాణి, పట్టణ బాధ్యుడు జి.రాజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా జనవరి 1 నుంచి 15 వరకు అక్షింతలను జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ వితరణ చేయనున్నట్లు విద్యాసాగర్ తెలిపారు.



శోభాయాత్రను ప్రారంభిస్తున్న స్వామిజీ

రాజకీయాల్లో విలువలు పాటించిన వాజ్‌పేయి



వాజ్‌పేయి జయంతిలో కేక్‌కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: దేశ రాజకీయాల్లో నైతిక విలువలు పాటించిన వ్యక్తిగా వాజ్‌పేయి ఆదర్శంగా నిలిచారని బీజేపీ సీనియర్ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. సోమవారం తెలంగాణచౌక్‌లో మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో మౌలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టారని, ప్రజాసంక్షేమం, దేశ అభివృద్ధి, సుపరిపాలన అందించిన మహనీయులని అన్నారు. కార్గిల్ యుద్ధ సమయంలో పాకిస్తాన్ కుట్రలు, కుతంత్రాలను తిప్పి కొట్టి దేశ ప్రతిష్ఠను పెంచిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కన్నబోయిన ఓదేలు, దుర్గం మారుతి, తాడూరి బ్రహ్మం, మిర్యాల్కార్ ఆనంద్, గుడిపాటి జితేందర్‌రెడ్డి, గంప జగన్, తిరుపతి, సంజిత్‌సింగ్, బాసం కుమార్, బ్రావణ్, భగవాన్, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, కుమార్, నరహరి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా పనిచేసినా ఓడించారు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: 'నేను నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేస్తున్నా. ఎక్కడా అవినీతికి పాల్పడలేదు. నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ హిందూ ధర్మం కోసం పనిచేస్తున్నా. అయినా నన్ను ఓడించారు. దీనికి కారణమెవరో హిందువులంతా ఆలోచించాలి. వచ్చే ఎన్నికల్లో హిందూ సంఘటిత శక్తిని చాటండి'.. అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజలను కోరారు. సోమవారం కరీంనగర్‌లోని వైశ్య భవన్‌లో ఆర్య వైశ్య పట్టణ సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చానని, అధికారంలోకి రాలేకపోయినా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల్లో ఎంతో మంది పేదలున్నారని, వారికి ఆర్థికంగా, విద్యాపరంగా చేయూత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

సంజయ్ చేతుల మీదుగా అన్నదానం

మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని సోమవారం కరీంనగర్‌లోని 59వ డివిజన్‌లో ఆయన చిత్రపటానికి ఎంపీ సంజయ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మార్వాడీ యువ మంచ్ ఆధర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను తిలకించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ


కరీంనగర్‌స్పోర్ట్స్: తొర్రూర్‌లో జరిగిన 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్– 14 బాలబాలికల బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు సత్తా చాటాయి. బాలుర జట్టు ద్వితీయస్థానం కైవసం చేసుకోగా బాలికల జట్టు తృతీయస్థానం కైవసం చేసుకుంది. జట్లకు కోచ్, మేనేజర్లుగా ఆలేటి సంపత్‌కుమార్, రాకేశ్, మహేశ్ వ్యవహరించారు. ఈసందర్భంగా జిల్లా జట్లు విజయం సాధించడంపై జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్‌రావు, తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్, డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా బేస్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిష్‌పాష, సంఘం బాధ్యులు బిట్ర శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీనివాస్‌రావు, వీరన్న, మహేశ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బాలబాలికల జట్లు

క్లుప్తంగా

గుండెపోటుతో ఈజీఎస్‌ కూలీ మృతి


కనకయ్య (ఫైల్‌)

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని లింగాపూర్‌లో ఈజీఎస్‌ పనులకు వెళ్లిన కూలీ గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. గ్రామానికి చెందిన వేల్పుల కనకయ్య(60) రోజువారీ కూలీ పనుల్లో భాగంగా సోమవారం ఈజీఎస్‌ పనులకు వెళ్లాడు. హాజరు తీసుకున్న తర్వాత పని ప్రారంభించడానికి ముందుగానే తల తిప్పినట్లు అవుతుందని తోటి కూలీలకు చెప్పాడు. ఇంటికి వెళ్తూ 108 వాహనానికి సమాచారం అందించారు. చికిత్స కోసం 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు


సంఘటన స్థలం వద్ద పాపయ్య

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓ గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడిన ఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడిగే పాపయ్య వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో మోకు జారడంతో కిందపడి గాయపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే హుజూరాబాద్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న బైక్‌

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని 28వ వార్డు శ్రీ రాంనగర్‌లో ప్రమాదవశాత్తు ఓ ద్విచక్రవాహనం దగ్ధమైంది. శ్రీరాంనగర్‌కు చెందిన యూసిఫ్‌ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచాడు. ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు.

ఊపిరితిత్తుల వ్యాధితో యువకుడి మృతి


మృతుడు జలంధర్‌ (ఫైల్‌)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం నర్సింగపూర్‌కు చెందిన పూడూరి జలంధర్‌(24) ఊపిరితిత్తుల వ్యాధితో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. నర్సింగపూర్‌కు చెందిన జలంధర్‌ రెండు నెలలుగా తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్నాడు. వైద్యపరీక్షలు చేయించగా ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని చెప్పారు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడు జలంధర్‌కు తల్లిదండ్రులు సత్తయ్య, లక్ష్మి, భార్య మల్లేశ్వరి, ఏడాది వయసు గల కుమారుడు ఉన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్‌


నాగారం శ్రీనివాస్‌

సిరిసిల్ల: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నాగారం శ్రీనివాస్‌ను సోమవారం నియమించారు. వేములవాడకు చెందిన శ్రీనివాస్‌ దేవాదాయశాఖలో ఎగ్జిక్యూటీవ్‌ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. కరీంనగర్‌ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం ఆఫీస్‌ను ప్రారంభించిన సందర్భంగా శ్రీనివాస్‌ను బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మర్రి శ్రీనివాస్‌యాదవ్‌, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్‌ ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన శ్రీనివాస్‌కు పలువురు బీసీ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.


రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు




ధర్మగుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు

రాజన్న దారిలో..

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆలయం రద్దీగా మారింది. వీఐపీ, గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌, ఇతర అధికారులు పరిశీలించారు.

జగిత్యాలలో నాలుగిళ్లలో చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు


దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాలజిల్లా కేంద్రంలోని సాయిరాంనగర్‌లో తాళం వేసి ఉన్న నాలుగిళ్లలో దొంగలు చొరబడ్డారు. శ్రీనివాస్‌ అనే వ్యక్తి కిరాణషాపు తాళాలు పగులకొట్టి రూ.10 వేలు ఎత్తుకెళ్లారు. మరో మూడిళ్లలో బంగారు ఆభరణాలు, డబ్బులు ఎత్తుకెళ్లారు. ఇంట్లోని సామగ్రిని చిందరవందర చేసి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని ఫింగర్‌ ప్రింట్‌ బృందాన్ని రప్పించి నమూనాలు సేకరించారు.

కొడుకు గొడవ పడ్డాడని.. తండ్రి ఆత్మహత్య


నర్సయ్య (ఫైల్‌)

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన చెప్యాల నర్సయ్య(73) ఆదివారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌ తెలిపారు. తన కొడుకుతో ఇంటి విషయమై గొడవ జరిగింది. కుమారుడు గొడవకు దిగడంతో ఇక తనతోపాటు తన భార్య లక్ష్మి బాగోగులు చూసుకునే వారు లేరని నర్సయ్య తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. ఆ తర్వాత పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. చి కిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. మృతుడి కూతురు కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

సంకెపల్లిలో చోరీ

వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం సంకెపల్లికి చెందిన పోచంపల్లి శ్రీనివాస్‌ శనివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉండడంతో స్థానికులు అతనికి సమాచారం అందించారు. ఇంటికొచ్చిన శ్రీనివాస్‌ ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న రూ.50వేలు, 2 తులాల బంగారం చోరీ జరిగినట్లు పోలీసుకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి వచ్చిన క్లూస్‌టీమ్‌ సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న వేములవాడటౌన్‌ సీఐ కరుణాకర్‌ తెలిపారు.

అల్ఫోర్స్‌ విద్యార్థుల విహారయాత్ర


పార్కు సందర్శనలో విద్యార్థులు

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్‌ పాఠశాల విద్యార్థులు సోమవారం విహారయాత్రకు వెళ్లారు. హైదరాబాద్‌లోని మౌంట్‌ ఒపెరా అమ్యూజ్మెంట్‌ పార్కును సందర్శించారు. అక్కడ పలు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్‌ విద్యా సంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రానికి చెందిన యువతి (19) సోమవారం అదృశ్యమైనట్లు టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై మన్మథరావు కథనం ప్రకారం సారంగాపూర్‌ మండలం బట్టపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి తన తల్లి, చెల్లెతో కలిసి జిల్లా కేంద్రంలోని మిషన్‌కాంపౌండ్‌ చర్చికి వచ్చింది. ప్రార్థనలు ముగించుకుని బయటకు వచ్చేసరికి కూతురు కనిపించకపోవడంతో తల్లి పలుచోట్ల గాలించింది. కూతురు ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ద్విచక్రవాహనం నుంచి పెట్రోల్‌ చోరీ చేస్తుండగా..

- ప్రమాదవశాత్తు కాలిబూడిదైన బైక్‌.. వ్యక్తికి తీవ్రగాయాలు


కాలిబూడిదైన ద్విచక్ర వాహనం

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): ఇంటి ఎదుట పార్క్‌ చేసిన ద్విచక్ర వాహనం నుంచి ఓ వ్యక్తి పెట్రోల్‌ దొంగతనం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా బైక్‌ పూర్తిగా దగ్ధమైంది. సదరు వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన ఇల్లందకుంట మండలం రాచపల్లిలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పిడి రాజు ఆదివారం రాత్రి తన ఇంటి ఎదుట బైక్‌ పార్క్‌ చేశాడు. ఈక్రమంలో అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన బొడ్డు రాంచరణ్‌ అనే యువకుడు పార్క్‌ చేసిన వాహనం నుంచి పెట్రోల్‌ చోరీ చేస్తుండగా బాటిల్‌లో పెట్రోల్‌ ఎంత వరకు నిండిందని తన దగ్గరున్న లైటర్‌ ఆన్‌ చేసి చూసేక్రమంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌ పూర్తిగా కాలిపోగా దొంగతనం చేసిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన గ్రామస్తులు అతడిని చికిత్స కోసం వరంగల్‌ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

వీణవంక(హుజూరాబాద్‌): మండల కేంద్రంలోని ఎయిర్‌టెల్‌ టవర్‌లో రూ.50వేల విలువ గల వస్తువు చోరీకి గురైందని టవర్‌ ఏటీసీ తాళ్ళపెల్లి గంగారాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక పెంట్రోల్‌బంకులో సీసీ ఫుటేజీని పరిశీలించగా ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఓ వ్యక్తి టవర్‌ సమీపంలో ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆసిఫ్‌ తెలిపారు.

ట్రాక్టర్‌ బోల్తా పడి ఒకరి మృతి

- పొలం పనులు చేయించేందుకు అత్తారింటికొచ్చిన అల్లుడు
- కాల్వలో పడిపోయిన ట్రాక్టర్‌
- క్రేన్‌ సాయంతో బయటకు తీసిన పోలీసులు
- వల్లంపట్లలో సంఘటన.. కొలనూర్‌లో విషాదం


మేరుగు శ్రీనివాస్‌ (ఫైల్‌)


క్రేన్‌తో ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల)/కోనరావుపేట(వేములవాడ): ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో సోమవారం ట్రాక్టర్‌ బోల్తాపడిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకంట మండలం వల్లంపట్లలో ట్రాక్టర్‌ ఇంజిన్‌తో వరినారు తీసుకెళ్తున్న మెరుగు శ్రీనివాస్‌(35) కల్వర్టు వద్ద అదుపుతప్పి కాల్వలో పడిపోయింది. ట్రాక్టర్‌ శ్రీనివాస్‌పై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాస్‌ స్వగ్రామం కోనరావుపేట మండలంలోని కొలనూరు. నెల రోజుల క్రితం శ్రీనివాస్‌ మామ మృతిచెందాడు. అత్తగారింటి వద్ద వ్యవసాయపనుల్లో సాయం కోసం వచ్చాడు. పొలంలో నాటు వేయిస్తుండగా ఈ సంఘటన జరిగింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను, శ్రీనివాస్‌ మృతదేహాన్ని బయటకు తీసేసరికి రాత్రి అయ్యింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఇల్లంతకుంట పోలీసులు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు శ్రీనివాస్‌కు భార్య సంధ్య, కొడుకు హర్షవర్ధన్‌ ఉన్నారు. సంధ్య ప్రస్తుతం గర్భిణి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేములవాడ: వేములవాడలోని మొదటి బైపాస్‌రోడ్డులో కారు, లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. గంగాధరకు చెందిన దంపతులు రామిడి జలపతి, విజయలక్ష్మి ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. జలపతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వేములవాడ టౌన్‌ సీఐ కరుణాకర్‌ తెలిపారు.

ప్రైవేట్‌ ఆసుపత్రి నిర్లక్ష్యంపై కేసు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌లోని తీగల గుట్టపల్లి పరిధిలోగల ఓ ప్రైవేట్‌ హాస్పిటల్‌లో మహిళకు డెలివరీ చేసి బ్యాండేజ్‌ శరీరంలోనే మర్చిపోయిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కరీంనగర్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాలు.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌ పేటకు చెందిన మహిళ సెప్టెంబర్‌ 28న డెలివరీ కోసం ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేరింది. డెలివరీ చేసిన వైద్యురాలు శరీరంలోనే బ్యాండేజ్‌ మరిచిపోయారు. డిశ్చార్జ్‌ అయి ఇంటికి వెళ్లిన కొద్ది రోజులకు బ్యాండేజ్‌ బయటికి కనిపించగా, తిరిగి హాస్పిటల్‌కి వచ్చారు. బ్యాండేజ్‌ తొలగించిన వైద్యురాలు స్కానింగ్‌ చేసి ఇక శరీరంలో ఏమీ లేదని చెప్పారు. ఆ తర్వాత బాలింత అస్వస్థతకు గురికాగా నవంబర్‌ 10న నగరంలోని మరో హాస్పిటల్లో చూపించుకోగా అక్కడ వైద్యురాలు శరీరంలో మరో బ్యాండేజీని కనుక్కొని బయటకు తీశారు. సదరు మహిళ అప్పటికే ఇన్ఫెక్షన్‌ అవస్థతో బాధపడుతూ బిడ్డకు పాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉంది. ఈ పరిస్థితిలో ఒకసారి పాయిజన్‌ కూడా తీసుకుంది. ఇన్ని రకాల ఇబ్బందులకు కారణమైన సదరు తీగలగుట్టపల్లిలోని ప్రైవేట్‌ ఆసుపత్రిపై కరీంనగర్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతలు.. చాలాదూరం


రామగుండం పోలీస్‌స్టేషన్‌

- రామగుండం ఠాణాకు చెంతనే రెండు గ్రామాలు
- 7 కి.మీ.దూరంలోని అంతర్గాం పోలీసుస్టేషన్‌కు బాధ్యతలు
- ఇబ్బందుల్లో కుందనపల్లి, లింగాపూర్‌ వాసులు

రామగుండం:సుమారు ఐదేళ్ల క్రితం అంతర్గాం మండల కేంద్రంగా ఆవిర్భవించింది. దీంతో రామగుండం పోలీస్‌స్టేషన్‌ పరిధి కేవలం నాలుగు డివిజన్లకే పరిమితమైంది. దూరభారంతో సంబంధం లేకుండా గ్రామీణ ప్రాంతాలన్నీ అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోకి వచ్చిచేరాయి. అయితే, రామగుండం పట్టణానికి అతి సమీపంలోనే ఉన్న కుందనపల్లి, లింగాపూర్‌ గ్రామాలు అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోకి వెళ్లాయి. ఈ గ్రామాల ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా చాలాదూరంలోని అంతర్గాం పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది.

రాజీవ్‌ రహదారి చెంతనే..

కుందనపల్లి గ్రామ శివారు రాజీవ్‌ రహదారికి సమీపంలోనే ఉంది. రాత్రివేళల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి. ఫిర్యాదు చేసేందుకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలోని అంతర్గాం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీనికితోడు రవాణా వ్యవస్థ అందుబాటులో లేక ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకునేందుకు నానాఅవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మార్గమధ్యంలోని కుందనపల్లి రైల్వేగేట్‌ అడ్డంకిగా మారుతోంది. లింగాపూర్‌, కుందనపల్లి గ్రామాలను రామగుండం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చేర్చితే త్వరగా ఘటన స్థలానికి చేరుకునే అవకాశం ఉంది.

వైభవం కోల్పోతున్న రామగుండం ఠాణా..

బసంత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ ఏర్పాటుకు ముందు 1998లో 40 గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ బాధ్యత రామగుండం ఠాణాకే ఉండేది. దీని పరిధిలోనే రైల్వేస్టేషన్‌, విద్యుత్‌ కేంద్రాలు, ప్రధాన రహదారి, బొగ్గు గనులు, బుగ్గరామేశ్వరాలయం ఉండేవి. ప్రస్తుత పాలకుర్తి మండలంలో అప్పట్లో పీపుల్స్‌వార్‌కు చెందిన ప్రముఖుల ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, బాంబ్‌బ్లాస్టింగులు జరిగాయి. అంతే కాదు.. రాష్ట్రంలోనే అతిపెద్ద ఠాణాగా రామగుండానికి ప్రత్యేక గుర్తింపు ఉండేది.

ఒకప్పుడు ఔట్‌పోస్టు.. ఇప్పుడు ఠాణా..

అప్పట్లో అంతర్గాం పోలీసు ఔట్‌పోస్టుగా ఉండేది. ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌గా ఆవిర్భవించింది. అంతే కాదు.. విశాలమైన అధునాతన భవనంతోపాటు సరిపడా పోలీసు సిబ్బంది.. ఇరవైకిపైగా గ్రామపంచాయతీలు, అనుబంధ గ్రామాలకు శాంతిభద్రతల పరిరక్షణకు కేంద్రంగా మారింది.

15వేల మందికే ప్రత్యేక ఠాణా..

కార్పొరేషన్‌లోని నాలుగు డివిజన్లలో 15వేల మంది మాత్రమే రామగుండం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఉన్నారు. ఠాణాకు అతి సమీపంలో ఉండే కుందనపల్లి, లింగాపూర్‌లో శాంతిభద్రతల పర్యవేక్షణకు రామగుండం ఠాణాను పరిమితం చేయకుండా అన్ని బాధ్యతలు అప్పగిస్తే ప్రజలకు సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుంది.

దశాబ్దం క్రితమే మోడల్‌ ఠాణాగా గుర్తింపు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం 2012 ఆగస్టులో కరీంనగర్‌ జిల్లాలో రెండు పోలీస్‌స్టేషన్లను ఆదర్శ(మోడల్‌) పోలీస్‌స్టేషన్లుగా గుర్తించింది. అందులో రామగుండం, మంథని పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఆదర్శ పోలీస్‌స్టేషన్‌ నిర్వహణకు అనుగుణంగా ఠాణాలు నిర్మించారు. ప్రభుత్వం మారడం, తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో ఆ ప్రక్రియ అంతటితోనే నిలిచిపోయింది.

రామగుండంలో విలీనం చేయాలి



రామగుండం పోలీస్‌స్టేషన్‌ మీదుగా లింగాపూర్‌ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామంలో ఏదైనా అనూహ్య ఘటన జరిగితే అంతర్గాం వెళ్లాల్సి వస్తోంది. అటు అసౌకర్యంగా ఉంటుంది. అంతర్గాం పోలీసులు మా గ్రామానికి చేరుకోవాలన్నా ఎక్కువ సమయమే పడుతుంది. గ్రామ శాంతి భద్రతల బాధ్యతలను రామగుండం ఠాణాకు అప్పగించాలి.

– కందుల సంధ్యారాణి, లింగాపూర్‌

సేవలకే పరిమితం చేయాలి



సత్వర పోలీసుసేవలు పొందేందుకు కుందనపల్లి గ్రామ బాధ్యతలను రామగుండం ఠాణాకు అప్పగించాలి. ఇలా చేస్తేనే మాకు అనుకూలంగా ఉంటుంది. రాజీవ్‌ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఘటన స్థలానికి చేరుకునేందుకు రామగుండం పోలీసులకు అనుకూలంగా ఉంటుంది. దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచించాలి.

– సంగనవేణి శేఖర్‌, కుందనపల్లి

కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో క్రిస్మస్‌ వేడుకలు


తెలంగాణ చౌక్‌లో కేక్‌ కట్‌ చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: క్రిస్మస్‌ పండుగ సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్‌ కేక్‌ను కట్‌ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ఆశీర్వాదంతో జిల్లా ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. శాంతి దూత అయిన ఏసు ప్రభువు ప్రజలందరిలో జ్ఞాన జ్యోతి వెలిగించి, వారిని సన్మార్గం వైపు నడిపించాలన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ పాలనలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు ఎం.డి.తాజొద్దీన్‌, నాయకులు సిరికొండ శివప్రసాద్‌, గడ్డం విలాస్‌రెడ్డి, లింగంపల్లి బాబు, ధనసింగ్‌, నాగప్రసాద్‌, నేహాల్‌ అహ్మద్‌, అప్సర్‌, బత్తిని చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూరి.. బంగారు గొలుసు చోరీ

పెద్దపల్లిరూరల్‌: జిల్లా కేంద్రంలోని కూనారం రోడ్డు సినిమా థియేటర్‌ సమీపంలో ఓ ఇంట్లో దూరిని దొంగ.. ఇంట్లోని గనిబోయిన రమాదేవి మెడలోంచి బంగారు గొలుసు అపహరించాడు. రమాదేవి తన ఇంట్లో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడని ఎస్సై మహేందర్‌ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు.

క్లుప్తంగా

గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలి

కరీంనగర్‌రూరల్: గొల్లకుర్మలకు సబ్సిడీ గొర్రెలకు బదులుగా నగదు బదిలీ పథకం అమలు చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్నయాదవ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారుడి వాటా కింద రూ.43,750 డీడీలు చెల్లించి రెండు సంవత్సరాలవుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకంపై సమీక్ష నిర్వహించి గొర్రెలకు బదులుగా లబ్ధిదారులకు నగదు బదిలీ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభం

కరీంనగర్: జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యాలయాన్ని రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో బీసీ ఉద్యోగుల సంఘాన్ని పటిష్టపరచడానికి సభ్యత్వం అధిక సంఖ్యలో చేయించాలన్నారు. రాబోయే రోజుల్లో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్రంలో బలమైన సంఘంగా ఏర్పాటు కాబోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్ర సుధాకర్, ఉప్పు సుదర్శన్, మురారి ప్రవీణ్, పూదరి రాజు, ప్రభాకర్, రమేశ్, శ్రీనివాస్, రాజేశం, కృష్ణస్వామి, సంపత్, శ్రీనివాస్, సుమన్, రాజేశ్, వెంకటేశ్వర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్


నియామక పత్రం అందుకున్న శ్రీనివాస్

కరీంనగర్: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నాగారపు శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం తిరుమలనగర్‌లో ఉమ్మడి జిల్లా బీసీ ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని నాగారపు శ్రీనివాస్‌ని రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. చంద్రశేఖర్‌గౌడ్, మర్రి శ్రీనివాస్‌యాదవ్, తోటి ఉద్యోగ సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు శ్రీరామ అక్షింతల శోభాయాత్ర

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామ జన్మభూమి కలశ, అక్షింతల శోభాయాత్రను మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు వీహెచ్‌పీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. దుర్శేడ్ ప్రధాన రహదారి నుంచి గ్రామంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం వరకు మేళతాళాలతో కొనసాగే శోభాయాత్రలో భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డిప్యూటీ మేయర్ చల్లా దంపతుల జన్మదిన వేడుకలు

కరీంనగర్: కరీంనగర్ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి-హరిశంకర్ జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్ నగర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సన్మానించారు. శ్రీరామా సహిత సత్యనారాయణస్వామి శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేశారు.

అన్నదానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

పూడికతీత పనులు

సైదాపూర్: తోటపల్లి రిజర్వాయర్ ద్వారా సైదాపూర్ మండలానికి సాగునీటి కోసం తవ్విన కెనాల్ ఇసుక మేటలతో కూడుకుపోవడంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు గుండారపు శ్రీనివాస్, దుద్దెనపల్లి ఎంపీటీసీ చాడ చైతన్యకొండాల్‌రెడ్డి కెనాల్ పూడికతీత పనులు చేపట్టారు. యాసంగికి సాగునీటికి ఇబ్బందులు లేకుండా కెనాల్ పూడిక పనులు చేపట్టాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం మేరకు అధికారులు స్పందించారు. ఈమేరకు ప్రొక్లెయిన్‌తో బొమ్మనపల్లి వద్ద కూడుకుపోయిన మట్టి తీత పనులు చేపట్టారు. మండలానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా మంత్రి పొన్నం చర్యలు చేపట్టారని శ్రీనివాస్ తెలిపారు. మండలంలో అన్ని గ్రామాలకు సాగునీరు అందేలా అన్ని గ్రామాల్లో కెనాల్ పనులు చేయించనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శంకరపట్నం: లింగాపూర్‌లో ఎంపీ సంజయ్ ఆధ్వర్యంలో డీఎమ్ఎఫ్‌టీ నుంచి మంజూరైన రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ అంతం లతా రాజిరెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు.

మొక్కజొన్నకు కత్తెర కాటు

- ఆందోళనలో అన్నదాతలు


కత్తెర పురుగు సోకిన ఆకులు


ఎలబోతారంలో మొక్కజొన్న పంట

కరీంనగర్‌రూరల్: మొక్కజొన్న పంటకు ఆదిలోనే తెగుళ్లు ఆశించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కత్తెర తెగులు సోకుతుండటంతో క్రిమిసంహారక మందులను ఉపయోగిస్తున్నారు. కరీంనగర్ మండలంలో యాసంగి సీజన్‌లో దాదాపు 350 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. చెర్లభూత్కూర్, చామనపల్లి, ఎలబోతారం, నగునూరు, బొమ్మకల్, గోపాల్‌పూర్, మొగ్దుంపూర్, దుర్శేడ్ తదితర గ్రామాల్లోని మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకడంతో.. మొక్కజొన్న ఆకులకు రంధ్రాలు పడుతున్నాయి. పంటలో ఎదుగుదల లోపించింది. అయితే క్షేత్రస్థాయిలో పర్యటించి పంటను పరిశీలించి సలహాలు, సూచనలు అందించాల్సిన వ్యవసాయాధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నామనే నెపంతో పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

లింగాకర్షక బుట్టల ఏర్పాటు

కత్తెర పురుగు బారి నుంచి పంటను రక్షించుకునేందుకు కొందరు రైతులు చేనులో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేస్తున్నారు. పది రోజులకోసారి క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. మొక్కజొన్న సుడుల్లో ఎకరానికి 10 నుంచి 12 కిలోల గుళికలను వేస్తున్నారు. ఇప్పటికే తెగుళ్ల నివారణకు, క్రిమిసంహారక మందులకు ఎకరానికి రూ.15వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మొక్కజొన్న పంటలో ఎకరానికి ఆరు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. కత్తెర పురుగు నియంత్రణకు 5 మిల్లీలీటర్ల న్యూరెమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇమామెక్టిన్ బెన్‌జోట్ 0.4 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసినా ప్రయోజనముంటుంది.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి

ఎరుకల తెగ ఉద్యోగుల సంఘం సమావేశం


ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కరీంనగర్: సామాజిక పరివర్తన దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కృషిభవన్‌లో ఆదివాసి ఎరుకల తెగ(కుర్రు) ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లచ్చయ్య మాట్లాడారు. ఎరుకుల కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారని, సమాజంలో జరుగుతున్న మంచిచెడులను బేరీజు వేసుకొని ఆ దిశగా సంఘం అభివృద్ధికి ప్రతి సంఘ సభ్యుడు పాటుపడాలని కోరారు. ఎరుకుల భాష లిపి రాయడం కోసం కృషి చేస్తున్న కుమారి ఇంద్రానికి సంఘం పక్షాన రూ.10,116 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వోలుగొత్తుల పోశయ్య, మొగిలి బుచ్చయ్య, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కేవై ప్రసాద్, కుర్రు సమ్మయ్య, మానుపాటి రాజయ్య, మొగిలి ప్రమీల, రాజేశ్వరి, రాజేశం, పద్మ, సదయ్య, రెవల్లి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

చిగురుమామిడి: సుందరగిరి గ్రామ ఎక్స్‌రోడ్డు వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. అటుగా వెళ్లేవారికి చేతికి అందే ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని రైతు నాగరాజు ఎన్నిసార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయాడు. మూడు వైర్ల తీగలు కాకుండా బంచ్‌వైరు అయినప్పటికీ అందులో కరెంటు తీగ అల్లుకొని ఉంది. వైరు ఏదైనా అయినప్పటికి దానికి తప్పని సరిగా కరెంటు సరఫరా అవుతున్నందున ప్రమాదకరమైన విద్యుత్ లైన్ ను సవరించాలని పలువురు కోరుతున్నారు. ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో లైన్‌మెన్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

చకిలం స్వప్నకు సత్కారం


స్వప్నను సత్కరిస్తున్న మంత్రులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏబీసీ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7,200 మందితో భరతనాట్యం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్‌కు చెందిన మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న పాల్గొన్నారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క శాలువాతో స్వప్నను సత్కరించారు.



పైప్‌లైన్ లీకేజీలు.. తరచూ మరమ్మతు

శంకరపట్నం: తాగునీటిని అందించే పైప్‌లైన్లు తరచూ లీకేజీ అవుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంకరపట్నం మండలం కేశవపట్నం, కొత్తగట్టు, గొల్లపల్లి తదితర గ్రామాలకు మిషన్ భగీరథ పథకంలో తాగునీటి పైప్‌లైన్లు వేశారు. కేశవపట్నంలో పైప్‌లైన్‌ల లీకేజీలకు మరమ్మతు చేయడానికి చాలా రోజులు పట్టింది. గొల్లపల్లి గ్రామ శివారులో మిషన్ భగీరథ పైప్‌ల లీకేజీలకు మరమ్మతు చేసేందుకు జేసీబీతో మట్టి తీసి పైప్‌లు సరిచేశారు. తరచూ లీకేజీలతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడుతోంది.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

శంకరపట్నం: జర్నలిస్టుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలని సామాజిక కార్యకర్త కొరిమి వెంకటస్వామి కోరారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన జర్నలిస్టులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టులకు రూ.20 లక్షల వరకు కార్పొరేట్ హాస్పిటల్‌లో వైద్య సదుపాయం అందించాలన్నారు.

ఐఎన్‌టీయూసీ వైస్ చైర్మన్‌గా జక్కుల


జక్కుల మల్లేశంగౌడ్

కరీంనగర్: ఐఎన్‌టీయూసీ-ఎస్‌డబ్ల్యూయూ టీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా, కార్యనిర్వాహకుడిగా జిల్లాకు చెందిన జక్కుల మల్లేశంగౌడ్‌ను కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ నుంచి ఏకగ్రీవంగా రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. గతంలో పలు సంఘాల్లో పని చేసిన జక్కుల మల్లేశం కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఎస్‌డబ్ల్యూయూలో చేరిన వెంటనే రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల కరీంనగర్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌కే రాజు, టీఆర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి పదవి కట్టబెట్టేందుకు కృషి చేసిన రాష్ట్ర గౌరవ కార్యదర్శి కె.రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్‌కు కరీంనగర్ రీజియన్ విభాగం నుంచి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఐఎన్‌టీయూసీ-ఎస్‌డబ్ల్యూయూ రీజనల్ స్థాయి సమావేశం జనవరి 2న కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు, సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని డిపోల నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాజ్‌పేయి జయంతి వేడుకలు



బొమ్మకల్‌లో నివాళి అర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో సోమవారం బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో దివంగత ప్రధానమంత్రి ఏబీ వాజ్‌పేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి పాశం తిరుపతి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పుట్టపాక శ్రీధర్, నాయకులు దాది సుధాకర్, గాలిపల్లి నారాయణ, పెద్ది లక్ష్మణ్, నేరెల్ల శ్రీనివాస్, సాయిచంద్, కోమాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం


ప్రతులను కాల్చేస్తున్న జలపతి తదితరులు

తిమ్మాపూర్: మను ధర్మాన్ని వ్యతిరేకిద్దాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పారునంది జలపతి అన్నారు. మన్నెంపల్లి గ్రామంలో అంబేడ్కర్ సంఘం నాయకులతో కలిసి బహుజనులు ఎలాంటి హక్కులు లేకుండా బ్రాహ్మణవాదుల కాలంలో చితికిపోయారని ఆరోపిస్తూ మనుధర్మ శాస్త్ర సిద్ధాంతం ప్రతులను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ మనుధర్మ సిద్ధాంతం బ్రాహ్మణ వ్యవస్థను కాపాడుకోవడానికి, అగ్ర వర్ణాల దోపిడీ వ్యవస్థకు రక్షణగా పుట్టిందేనని అన్నారు. దేశంలో మెజార్టీ ప్రజలకు సహజ సిద్ధమైన వనరులను దూరం చేయడానికి కర్మ, గ్రహచారం అని నమ్మించడానికి ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దుర్మార్గపు సిద్ధాంతం మనదేశాన్ని పట్టిపీడిస్తుందన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు బోయిని ఎల్లయ్య, భూమయ్య పారునంది దుర్గయ్య, కుమార్, వీరయ్య, మల్లయ్య, రవి, రాజయ్య, ఎల్లయ్య, జూల చందు, దప్పు నర్సయ్య పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి

మానకొండూర్: అన్నారంలో బీజేపీ నాయకులు సోమవారం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, కేంద్రసెన్సార్‌బోర్డు మెంబర్ రంగు భాస్కరాచారి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. వాజ్‌పేయి సేవలను కొనియాడారు. వాజ్‌పేయి జయంతిని సుపరిపాలన దివస్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు.

శంకరపట్నం: కేశవపట్నంలో బీజేపీ నాయకులు వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కేశవపట్నంలో పండ్లు పంపిణీ చేశారు.

రామడుగు: మండలంలోని వెలిచాలలో బీజేపీ నాయకులు వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం మిఠాయిలను పంపిణీ చేశారు.


రామడుగు: నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లందకుంట: బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడారు. నాయకులు, కార్యకర్తలకు ఆయన ఆదర్శమని, వారుచూపిన బాటలోనే నడుస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు వెంకటరమణరెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మానకొండూర్‌రూరల్: మండలంలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టి.శేఖర్, ఉపసర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, కార్యకర్తలు ప్రవీణ్, మధు, శ్యాంసన్, శ్రీనుప రవి, నారాయణ, శ్రీధర్, సతీష్, తిరుపతి, ఎల్లయ్య, మానకొండూర్ సర్పంచ్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన దైవాల అఖిల్‌గౌడ్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని సోమవారం రామడుగు సింగిల్‌విండో చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పరామర్శించారు.


చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న జీవీఆర్

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



తిమ్మాపూర్: అయోధ్య శ్రీరాముడి తలంబ్రాలు సోమవారం మండలంలోని రామకృష్ణకాలనీ, మొగిలిపాలెం గ్రామానికి చేరాయి. గ్రామస్తులు మేళ తాళాలతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామి, చెన్నకేశవ ఆలయంలోకి శ్రీరామతీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శోభాయాత్రగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ.. అయోధ్య శ్రీరాముడి ఆలయం ప్రాణప్రతిష్ఠ జనవరి 22న జరుగుతున్న దృష్ట్యా రాముడి పాదాల చెంత పూజించబడిన తలంబ్రాలు మొగిలిపాలెంలోని గడగడపకు జనవరి 1 నుంచి 15 వరకు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మోరపల్లి సుస్మితారెడ్డి, భజన మండలి, సేవాదళ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గా విగ్రహ ప్రతిష్ఠాపన

చొప్పదండి: పట్టణంలోని శివకేశవాలయం సమీపంలో నిర్మించిన దుర్గామాత ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా పట్టణంలోని కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో చివరి రోజు అమ్మవారి విగ్రహాన్ని స్మార్త జ్యోతిష్య పురోహితుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. హనుమాన్ సాయి భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.51వేల విరాళం అందజేత

చొప్పదండి పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి సోమవారం రూ.51,116 విరాళం అందించారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులకు నగదు చెక్కు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ కొత్త గంగరెడ్డి, బత్తిని సంపత్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బొడిగె వెంకటేశ్, గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, ఎలిగేటి రాములు, ఉస్కె రాజశేఖర్ రెడ్డి, పిట్టల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ

జమ్మికుంట: మడిపల్లి గ్రామం శ్రీహన్‌మాన్ దేవాలయం వద్ద దాతల సహాయంతో వానరం విగ్రహ ప్రతిష్ఠాపన చేసి మహా అన్నదాన కార్యక్రమం చేశారు. ఈసందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. కొంతకాలం క్రితం విద్యుత్ షాక్‌తో వానరం చనిపోయిందని అందుకు ప్రతీకగా వానరం విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హన్‌మాన్ మాలధారణ భక్తులు, దాతలు, గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: వెదిర శ్రీగురుదత్తాత్రేయ ఆలయంలో ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. వేదపండితులు మయూర గిరిపీఠాధిపతి శ్రీమాన్ శ్రీనమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేశారు. ఆలయ నిర్వాహకులు స్వామివారికి ఫల, పుష్ప పంచామృత అభిషేకాలు, తీర్థప్రసాదం, అన్నదానం చేశారు.

ఎన్‌సీఈఆర్‌టీకి ఎంపిక


కంది సంపత్‌ను అభినందిస్తున్న తోటి అధ్యాపకులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కంది సంపత్ విజ్డమ్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యూకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)కు ఎంపికయ్యాడు. సోమవారం ఆయన చిగురుమామిడిలో మాట్లాడారు. సంవత్సరం పాటు ఢిల్లీ, మైసూర్ ప్రాంతీయ కేంద్రాల్లో గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ విభాగంలో అధ్యయనం ఉంటుందన్నారు. కోహెడ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న సంపత్ ఎన్‌సీఈఆర్‌టీకి ఎంపిక కావడం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలాస్, ప్రాంతీయ సమన్వయకర్త నిర్మల కోహెడ పాఠశాల ప్రిన్సిపాల్ చలపతి, అధ్యాపక బృందం, బొమ్మనపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా సంపత్ ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఏ ఇంగ్లిష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీల్లో పట్టాపొందారు. వీటితో పాటు ఎంఈడీ చేసి నీట్, సెట్ క్వాలిఫై అయ్యారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



హుజూరాబాద్‌రూరల్: చిన్నపాపయ్యపల్లి, కాట్రపల్లి, ధర్మరాజుపల్లి, కనుకులగిద్దె, జూపాక, చెల్పూర్, బొత్తలపల్లి గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కార్యక్రమం కోఆర్డినేటర్ కౌటిల్ విజయ్‌కుమార్, ఆస్మా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నపాపయ్యపల్లి సర్పంచ్ దేవేంద్ర, డాక్టర్ సఫీర్ హుస్సేన్, డాక్టర్ రవీందర్రావు, ఏఎన్ఎంలు సుమలత, రేణుక, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో మంగళవారం జరగనుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో అభివృద్ధి పనులతో పాటు మరిన్ని అంశాలపై పాలకమండలి చర్చించనుంది.

సర్వదర్శన టోకెన్ల జారీ పూర్తి:
ఈ నెల 23 నుంచి 2024, జనవరి 1వ తేదీ వరకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన సర్వ దర్శన టోకెన్ల జారీని సోమవారం టీటీడీ పూర్తి చేసింది. తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎంఆర్ పల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో 90 కౌంటర్లలో 10 రోజులకు గాను నాలుగు లక్షలకుపైగా సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను భక్తులకు అందించారు. తదుపరి సర్వదర్శనం టోకెన్లను జనవరి 2వ తేదీ నుంచి ఇవ్వనున్నారు.

నేడు పౌర్ణమి గరుడసేవ రద్దు
తిరుమలలో మంగళవారం నిర్వహించాల్సిన పౌర్ణమి గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. అయితే శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు జరుగుతున్న కారణంగా మంగళవారం పౌర్ణమి గరుడసేవ రద్దు చేసింది.

పులివెందులలో సీఎం క్రిస్మస్ వేడుకలు

కేక్ కట్‌చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ● ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు



వైఎస్సార్ జిల్లా పులివెందుల సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో సీఎం మాతృమూర్తి వైఎస్ విజయమ్మ



సీఎం జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న వైఎస్ విజయమ్మ

పులివెందుల: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లాలో మూడ్రోజుల పర్యటనలో భాగంగా మూడో రోజైన సోమవారం ఉదయం ముఖ్యమంత్రి ఇడుపులపాయ ఎస్టేట్ నుంచి హెలికాప్టర్ ద్వారా భాకరాపురం హెలిప్యాడ్, అక్కడ నుంచి రోడ్డు మార్గంద్వారా పులివెందుల పట్టణానికి చేరుకున్నారు. ఉ.9.30 గంటలకు సీఎస్ఐ చర్చి ప్రాంగణానికి చేరుకుని అక్కడ హాజరైన వారిని ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన బంధువర్గానికి, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్.. ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ.. ఏటా క్రిస్మస్ రోజున తన సొంత గడ్డపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. అందరి అభిమానం, ఆశీస్సులు, దేవుని చల్లని దీవెనలు తనకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానని ఆయన ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో తరిస్తున్నానని.. ఎప్పటికీ మీ హృదయాల్లో ప్రియమైన నాయకుడిగా సుస్థిర స్థానాన్ని పొందుతానన్నారు. అనంతరం సీఎం జగన్ తన కుటుంబసభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. 2024 నూతన సంవత్సర చర్చి కేలండర్‌ను ఆవిష్కరించారు. క్రిస్మస్ వేడుకల్లో సీఎం జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుటుంబసభ్యులు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆత్మీయులు, మిత్రులు, పురప్రజలు పాల్గొన్నారు.

కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలి

సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలని కోరుకుంటూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అని సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టులకు నోటిఫికేషన్

- 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: ఏపీ దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైంది. 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), మరో 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టులు కాంట్రాక్టు విధానంలో భర్తీకి దేవదాయ శాఖ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నియామక ప్రక్రియ మొత్తాన్ని ప్రభుత్వం ప్రముఖ సంస్థ 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా'కు అప్పగించింది. ఏఈఈ పోస్టులకు సంబంధిత కేటగిరిలో బీఈ, బీటెక్ ఉత్తర్ణీత సాధించి ఉండాలి. టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టులకు ఇంజనీరింగ్ డిప్లొమా పాసైన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కేటగిరి రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు రాత పరీక్ష ద్వారా ఈ పోస్టులు భర్తీ చేస్తారు. రాత పరీక్ష వంద మార్కులకు ఉంటుంది. 80 మార్కులకు సంబంధిత ఇంజనీరింగ్ అంశాలపైన, పది మార్కులకు ఇంగ్లీష్ ప్రావీణ్యం, మరో పది మార్కులకు జనరల్ నాలెడ్జితో కూడిన మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయని దేవదాయ శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

లోడింగ్‌లో దుమ్మురేపిన విశాఖ పోర్టు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ లోడింగ్‌లో దుమ్మురేపింది. రెండు రోజుల క్రితం నెలకొల్పిన రికార్డును అధిగమించింది. సోమవారం ఒక్క రోజులోనే ఎంవీ ఫెయిత్ నౌకలోకి 8,379 మెట్రిక్ టన్నుల కాల్సిన్డ్ అల్యూమినాను లోడింగ్ చేసింది. ఈనెల 23వ తేదీన 8,055 మెట్రిక్ టన్నుల లోడింగ్ రికార్డును బ్రేక్ చేసింది. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ స్టీవ్‌డోర్‌గాను, ఈశ్వర్ షిప్పింగ్ సర్వీసెస్ స్టీమర్ ఏజెంట్‌గా వ్యవహరించాయి.

2024లో ఇస్రో ప్రయోగాల పరంపర

జనవరి 1 నుంచే ప్రారంభం.. 2023లో 51 ఉపగ్రహాలు నింగిలోకి



పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ ద్వారా ప్రయోగించబోయే ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం...

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కొత్త ఏడాది ఆరంభంతోనే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగాల పరంపర ప్రారంభం కానుంది. 2024 జనవరి 1న ఉదయం 7.30 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా 480 కిలోల బరువు కలిగిన ఎక్స్‌పోశాట్ అనే ఖగోళ పరిశోధనా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. దీంతో పాటు కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన ఒక కేజీ బరువు కలిగిన వియ్‌శాట్ అనే బుల్లి ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించనున్నారు. భూమికి అత్యంత తక్కువ దూరంలోని లియో ఆర్బిట్‌లోకి ఈ రెండు ఉపగ్రహాలను పంపేందుకు అంతా సిద్ధం చేశారు. ఈ ప్రయోగం తరువాత చంద్రయాన్-4, గగన్‌యాన్-1 ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఇవి కాకుండా 2024లో 12 ప్రయోగాలకు తగ్గకుండా చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2023లో ఇస్రో అత్యధికంగా 8 రాకెట్ ప్రయోగాలు చేపట్టి 51 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. పీఎస్ఎల్వీ రాకెట్ల సిరీస్‌లో మూడు రాకెట్ల ద్వారా పది ఉపగ్రహాలు, ఎస్ఎస్ఎల్వీ డీ2 రాకెట్ ద్వారా మూడు ఉపగ్రహాలు, జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్ ద్వారా ఒక ఉపగ్రహం, ఎల్వీఎం 3 సిరీస్‌లో మూడు రాకెట్ ప్రయోగాల ద్వారా 37 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇవి కాకుండా గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి ఆర్ఎల్వీటీడీని ప్రయోగాత్మకంగా నిర్వహించి విజయం సాధించారు. 2023 ఇస్రోకి చరిత్రలో నిలిచిపోయిన సంవత్సరంగా చెప్పవచ్చును. ఎందుకంటే ఈ ఏడాది ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా చంద్రుడి దక్షిణధృవంపై ల్యాండర్, రోవర్‌ను విజయవంతంగా దించి చరిత్రలో మరువలేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. అదే విధంగా సూర్యుడిపై పరిశోధనలకు గాను ఆదిత్య ఎల్1 అనే ఉపగ్రహాన్ని పంపించగా అది విజయవంతంగా పనిచేస్తోంది. ఆదిత్య ఎల్1 ఉపగ్రహం 2024 జనవరి 5న లాంగ్రేజియిన్ పాయింట్ 1 వద్దకు చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు.







తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, జస్టిస్ సురేష్‌రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరీ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ హేమలేఖ సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు. అదే విధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి తిరుచానూరుకు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారంలో శ్రీవారిని 63,519 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో రూ.5.05 కోట్ల కానుకలు సమర్పించారు.

సంస్కృతిలో భాగమే సినిమా

- ప్రముఖ రచయిత అల్లం రాజయ్య
- 'సినీ ఆర్టిస్ట్ ఫెడరేషన్' ఏర్పాటుకు నిర్ణయం



సినీ కళాకారులతో రచయిత అల్లం రాజయ్య, చంద్రమౌళి, సెన్సార్ బోర్డు సభ్యులు అక్షయ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మానవ సంస్కృతిలో భాగమే సినిమా అని ప్రముఖ నవలా, కథా రచయిత అల్లం రాజయ్య అన్నారు. సమాజంలో ఉత్పత్తి విధానం, రాజ్యం, యంత్రాంగం, సంస్కృతి ఇమిడి ఉంటాయని తెలిపారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధారి ఖిల్లాలో సినీ గేయ రచయిత అక్కల చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మా సక్కని సిన్మా ముచ్చట'కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సినిమా రంగంలో రాణించాలంటే అందులో ఇమిడి ఉన్న అంశాలను గుర్తించి, ఇంటలెక్చువాలిటీ పెంచుకోవాలని సూచించారు. 'మా భూమి' సినిమా సమయంలో డబ్బు కోసం చాలా కష్టపడ్డామని గుర్తు చేశారు. సింగరేణి కార్మికులు 18 సినిమాలకు పెట్టుబడి పెట్టారన్నారు. ప్రపంచ సినిమా, తెలుగు, స్థానిక సినిమాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. సినీరంగంపై ఆసక్తి ఉన్న వారందరూ ఓ వేదికగా ఏర్పడి పనిచేయాలని సలహా ఇచ్చారు. కోరుట్ల తహసీల్దార్ ఇట్యాల కిషన్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకునేలా కథలు రాయాలన్నారు. ఇందుకు సరైన నిర్మాణం జరగాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సాహిత్యంపై అధ్యయనం చేయాలని గేయ రచయిత అక్కల చంద్రమౌళి సూచించారు. సెన్సార్ బోర్డ్ సభ్యుడు, దర్శకుడు అక్షయ్‌కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే ఎవరైనా విజయం సాధించవచ్చన్నారు. సిరిపురం రాజేశం మాట్లాడుతూ తన సినిమాల్లో ఇక్కడి వారికి అవకాశం ఇస్తామని తెలిపారు. సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో అందరూ తమ అభిప్రాయాలు పంచుకున్నారు. సమష్టి నిర్ణయం మేరకు 'మంచిర్యాల సినీ ఆర్టిస్ట్ ఫెడరేషన్' ఏర్పాటుకు అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకపోడ్ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు రాజన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజన్న, నాయకులు రమేశ్, వర్ధమాన దర్శకులు తిరుపతివర్మ, గోవింద్ రాజు, సినీ ఆర్టిస్టులు మహేశ్, సాగర్, వెంకటేశ్, జాకీర్, జూనియర్ కేసీఆర్, యూట్యూబర్లు, పలు జిల్లాల నుంచి 50 మందికి పైగా సినీ ఔత్సాహికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి డాక్టర్ కుమ్రం బాలు

- ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి ప్రయత్నాలు
- ఉద్యోగానికి వీఆర్ఎస్..?



కుమ్రం బాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఐటీడీఏ అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కుమ్రం బాలు తన ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయాల్లోకి వచ్చేందుకు తన ఉద్యోగానికి వీఆర్ఎస్ తీసుకునే యోచన చేస్తున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి ప్రణాళిక వేసుకుంటున్నారు. ఎంపీ టికెట్ దక్కితే పోటీ చేసి తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉన్నారు. రాష్ట్రంలోనే సివిల్‌సర్జన్(జనరల్ లైన్)లో మొదటి స్థానంలో ఉన్న బాలు ఉమ్మడి జిల్లాలో పీహెచ్‌సీ వైద్యుడి నుంచి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వరకు వివిధ హోదాల్లో పని చేశారు. గత 20ఏళ్లుగా ఏజెన్సీలో పలు చోట్ల పని చేశారు. కుమురంభీం, మంచిర్యాల జిల్లాలకు డీఎంహెచ్ఓగా పని చేశారు. ప్రస్తుతం ఐటీడీఏ డీఎంహెచ్‌వోగా ఉన్నారు. ఆయన స్వస్థలం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లి. ఏజెన్సీ మండలాల్లో గిరిజన, ఆదివాసీ గూడేల్లో పరిచయాలు ఉన్నాయి. ఉద్యోగ కాల పరిమితి వచ్చే ఏప్రిల్ వరకు ఉంది. ఎంపీగా పోటీ చేసే ఆసక్తి మేరకు ముందుగానే స్వచ్ఛంద ఉద్యోగ విమరణ చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ దక్కితే ఆదివాసీ కోటాలో పోటీలో నిలబడే ఆలోచనలు చేస్తున్నారు. ఎంపీగా పోటీకి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. మరోవైపు బాలు మామ మడావి బాబురావు మహారాష్ట్ర కేబినెట్‌లో సీనియర్ మంత్రిగా పని చేశారు. పొరుగున ఉన్న గడ్చిరోలి జిల్లా ఆర్మూరీ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. ఆ కుటుంబానికి ఢిల్లీ స్థాయిలో పరిచయాలు ఉండడంతో ఆ వైపు నుంచి కూడా పార్టీలో చేరి, టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరడంపై కుమురం బాలును 'సాక్షి' సంప్రదించగా పార్టీలో చేరే ఆసక్తి ఉందని, అన్ని వివరాలు త్వరలోనే వెల్లడిస్తానని చెప్పారు.



వెంకటాపూర్‌లో ఉదయం 6 గంటలకు కల్లాపి చల్లుతున్న మహిళ



వెంకటాపూర్‌లో చలిమంట కాగుతున్న గ్రామస్తులు

తెల్లారిందోయ్..



ఉదయం 4 గంటలకు కూరగాయల వ్యాపారం ఇలా..



పెద్దూరులో పాలకేంద్రం నుంచి పాలు సైకిల్‌పై తీసుకెళ్తున్న గ్రామస్తుడు

ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయకుండా జనం తెల్లవారుజామునే దినచర్యను ప్రారంభించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, కూరగాయల వ్యాపారులు, పాలవ్యాపారులు సూరీడు రాక ముందే జీవనపోరాటం మొదలుపెట్టారు. సిరిసిల్లలోని రైతుబజార్ వ్యాపారుల కోలాహలంతో సందడిగా మారింది. జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దూరు, వెంకటాపూర్ వంటి పల్లెల్లో ఆడపడచులు ఉదయం 5 గంటల వరకే ఇంటి పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు కల్లాపి చల్లుతుండగా.. మరికొందరు పొలాల వద్ద మోటార్ల కాడికి పోయి బిందెలలో నీళ్లు తీసుకొస్తున్నారు. గజగజ వణికించే చలిని సైతం లెక్కచేయకుండా వ్యవసాయ కూలీలు ఆటోల్లో పనులకు వెళ్లారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



టీ సెంటర్ వద్ద టీ తాగుతున్న కండక్టర్స్, డ్రైవర్స్



రాగి జావ స్టాల్ వద్ద విక్రయాలు



బాసరలో భక్తుల రద్దీ



దర్శనం చేసుకుంటున్న భక్తులు



ఆలయ ఆవరణలో భక్తులు

భైంసా: బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే బాసరలో భక్తుల రద్దీ కనిపించింది. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు సూర్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం సరస్వతీదేవి ఆలయానికి చేరుకుని చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం వరకు బాసర ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికలకు భారీ బందోబస్తు

- గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏసీపీ తులా శ్రీనివాస్, సీఐ ప్రమోద్‌రావు

గోదావరిఖని: సింగరేణిలో బుధవారం నిర్వహించే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్ తెలిపారు. రామగుండం రీజియన్ ఆర్జీ-1, 2, 3 ఏరియాలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఎన్నికల సందర్భంగా మూడు ఏరియాల్లో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఎన్నికల లెక్కింపు కేంద్రం వద్ద 400మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. ఇందులో 8మంది సీఐలు, రెండు యూనిట్ల ప్రత్యేక పోలీసు బలగాలు, 25మంది ఎస్సైలు విధులు నిర్వర్తిస్తారని ఆయన వివరించారు. ఒకటి ఓట్ల లెక్కింపు కేంద్రంతోపాటు 23 పోలింగ్ కేంద్రాలు రామగుండం రీజియన్‌లో ఉన్నాయని తెలిపారు. 12,992మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. ఏసీపీ వెంట వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

ఐడీ కార్డు ఉండాలి..

- సంస్థ ఐడీ కార్డు ఉంటేనే పోలింగ్ కేంద్రంలోకి అనుమతి
- ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే కార్మికులు సంస్థ అందించిన తమ ఐడీ కార్డును వెంట తీసుకెళ్లాలి
- కార్డులేకపోతే సింగరేణి యాజమాన్యం జారీచేసే తాత్కాలిక కార్డు తీసుకోవాలి.
- ప్రిసైడింగ్ అధికారులకు ఐడీకార్డు చూపిస్తేనే ఓటు వేసేందుకు లోనికి పంపిస్తారు.
- మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు.
- సస్పెన్స్‌లో ఉన్నవారికి కూడా ఓటుహక్కు ఉంటుంది.
- డిస్మిస్, రిమూవ్, రిటైర్డ్ కార్మికులకు ఓటుహక్కు లేదు.
- ఓటింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉండే ఏజెంట్లు సింగరేణి కార్మికులు అయి ఉండాలి. ఓటుహక్కు ఉండాలి.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
మంగళవారం ॥ 26-12-2023

కళ




అయేషా

వందలాది పిల్లల అమ్మ

'ఆరంభ శూరత్వం' చాలామందిలో కనిపిస్తుంది. అయితే చెన్నైకి చెందిన అయేషా మేడమ్‌లో అది మచ్చుకైనా కనిపించదు. మూడు దశాబ్దాల క్రితం నాటకరంగంలోకి అడుగు పెట్టిన అయేషా పిల్లల్లో సృజనాత్మక కళల వికాసానికి 'ది లిటిల్ థియేటర్' ప్రారంభించింది. కాలంతో పాటు నడుస్తూ కొత్త ఆలోచనలు జత చేస్తూ థియేటర్‌ను ఎప్పటికప్పుడు క్రియాశీలంగా, నిత్యనూతనంగా నిర్వహిస్తోంది.



మూడు దశాబ్దాల క్రితం 'క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేయాలని ఉంది' అని తన మనసులో మాటను తండ్రి దగ్గర బయట పెట్టింది అయేషా. ఆయన ప్రోత్సాహకరంగా మాట్లాడారు. అలా తండ్రి-కూతురు ఆలోచనల్లో నుంచి వచ్చిందే ది లిటిల్ థియేటర్ ట్రస్ట్. ఆరంభంలో ఉన్న ఉత్సాహం ఆ తరువాత చాలామందిలో కరుగుతూ పోతుంది. కాని మూడు దశాబ్దాలు దాటినా 'ది లిటిల్ థియేటర్' ఉత్సాహం. సృజన శక్తి రవ్వంత కూడా తగ్గలేదు.

'ఇంకా కొత్తగా ఏం చేయవచ్చు' అని ఆలోచిస్తూ వెళుతోంది ది లిటిల్ థియేటర్.

కళలు, ఆరోగ్యాన్ని మేళవించి 2015లో చెన్నైలోని ప్రభుత్వ పిల్లల ఆసుపత్రిలో 'హాస్పిటల్ క్లౌన్స్'ను పరిచయం చేసింది లిటిల్ థియేటర్. కీమో థెరపీ చేయించుకునే పిల్లలకు 'క్రియేటివ్ థెరపీ' అందిస్తోంది.

'లిటిల్ థియేటర్' ద్వారా ఏడాది పొడవునా సృజనాత్మక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. రెండు నుంచి నాలుగు సంవత్సరాల పిల్లల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. క్యాంప్ ఫైర్ కథల కార్యక్రమం ప్రతి నెల జరుగుతుంది. కోవిడ్ కల్లోల సమయంలో 'లిటిల్ థియేటర్' ఆన్‌లైన్‌లోకి వచ్చింది. మల్టీ-కెమెరా సెటప్‌తో షోలను ఎడిట్ చేసి అప్‌లోడ్ చేసేవారు. యూట్యూబ్ చానల్ ద్వారా ఎంతోమందికి చేరువ అయింది.

వన్స్ అపాన్ ఏ టైమ్ తన ఇద్దరు పిల్లల గురించి ఆలోచిస్తూ 'పిల్లలకు క్లాసు, హోంవర్క్ తప్ప మరో వ్యాపకం లేకుండా ఉంది' అని నిట్టూర్చింది అయేషా. విదేశాల్లో ఉన్నత చదువు చదివిన అయేషా అక్కడ పిల్లల సృజనాత్మక వికాసానికి ఎన్నో వేదికలు ఉన్న విషయాన్ని గుర్తు చేసుకుంది. ఇక్కడ వాటి కొరత ఉంది అని గ్రహించి 'ది లిటిల్ థియేటర్'కు శ్రీకారం చుట్టింది.

తనకు ఆరేళ్ల వయసు ఉన్నప్పుడు తల్లితో 'నాకు వందలాది పిల్లలు పుడతారు' అని చెప్పింది చిన్నారి అయేషా. కూతురు మాట విని తల్లి పెద్దగా నవ్వింది. ఆ జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుంటూ 'నా మాట నిజమైంది. ఇప్పుడు నాకు వందలాది పిల్లలు. ది లిటిల్ థియేటర్‌కు దగ్గరైన వాళ్లందరూ నా పిల్లలే' అంటుంది అయేషా.

స్కూల్ ముగిసిన తరువాత పిల్లల కోసం నాటకానికి సంబంధించిన ప్రాథమిక విషయాలను పరిచయం చేసే కార్యక్రమాల నుంచి కుండల తయారీ వర్క్‌షాప్‌ల వరకు ఎన్నో నిర్వహించింది ది లిటిల్ థియేటర్. 'ది లిటిల్ థియేటర్' ట్రస్టు ప్రతి సంవత్సరం వందలాది మంది నిరుపేద పిల్లలకు సహాయపడుతుంది.

ప్రస్తుతం అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన బాధ్యతలు చూస్తున్న అయేషా థియేటర్‌కు సంబంధించి సృజనాత్మక కార్యకలాపాలను మాత్రం యువతరానికే అప్పగించింది. 'ప్రతిభావంతులైన యువతరానికి సృజనాత్మక బాధ్యతలు అప్పగిస్తే కంటెంట్‌లో కొత్తదనం కనిపిస్తుంది. సంస్థ మరింత ముందు వెళుతుంది' అంటుంది అయేషా.

'నాటకరంగంలోకి అడుగు పెట్టి ఎన్నో సంవత్సరాలు అవుతుంది కదా, నేర్చుకున్నది ఏమిటి?' అనే ప్రశ్నకు జవాబు ఆమె మాటల్లోనే...

'నాటకరంగంలోకి అడుగుపెట్టి మూడు దశాబ్దాలు దాటింది. అయినప్పటికీ నేర్చుకోవాల్సింది ఇంకా ఎంతో ఉంది అనిపిస్తుంది. నాటకరంగానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ కోర్సులలో చేరుతుంటాను. నేను నేర్చుకున్నదాన్ని లిటిల్ థియేటర్‌కు తీసుకువస్తుంటాను' అంటోంది అయేషా.

క్రియేటివ్ థెరపీ

హాస్పిటల్ వాతావరణంలో గాంభీర్యం. విషాదం. నిర్వేదం మిళితమై కనిపిస్తుంటాయి. ఈ వాతావరణాన్ని మార్చడానికి ఆస్పత్రిలో చేరిన పిల్లల్లో హుషారు తెప్పించడానికి. వారి పెదవులపై నవ్వులు మెరిపించడానికి చెన్నైలోని ప్రభుత్వ పిల్లల ఆస్పత్రిలో ది లిటిల్ థియేటర్ 'క్రియేటివ్ థెరపీ' నిర్వహిస్తోంది. కథల కార్యక్రమం నుంచి తోలుబొమ్మలాట వరకు రకరకాల సృజనాత్మక కళలలో పేషెంట్లుగా ఉన్న పిల్లలను కలుపుకుంటూ వారిని కొత్త ప్రపంచంలోకి తీసుకువెళతారు. 'క్రియేటివ్ థెరపీ' కోసం హాస్పిటల్‌లో ఒక స్టూడియో ఏర్పాటు చేశారు. ఈ ఏసీ స్టూడియోలో పెర్‌ఫార్మెన్స్ లైట్లు. సౌండ్ సిస్టమ్స్. డిజిటల్ టీవీ స్క్రీన్. వర్క్‌షాప్‌కు సంబంధించి రకరకాల వస్తువులు ఉంటాయి. హాస్పిటల్‌లోని పిల్లల దిగులును దూరం చేయడంలో క్రియేటివ్ థెరపీ సత్ఫలితాలు ఇచ్చింది. హాస్పిటల్‌లోని పిల్లల కోసం షెల్ఫ్‌ల నిండా బట్టలు. బొమ్మలు. కలరింగ్ బుక్స్... మొదలైనవి ఏర్పాటు చేశారు. ఇతర హాస్పిటల్స్ కూడా పిల్లల కోసం 'ఆర్ట్ థెరపీ'ని మొదలుపెట్టాయి. అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ రకరకాల పూల మొక్కలు. ప్లే పార్క్. పిట్టగూళ్లతో పేషెంట్ల కోసం 'హ్యాపీ ప్లేస్'ను ప్రారంభించింది.

మా అదృష్టం

'చదువే కాదు మా పిల్లలకు కళలు కూడా కావాలి' అంటున్న తల్లిదండ్రుల పరిచయం నిజంగా మా అదృష్టం. 'చదువు తప్ప మా పిల్లలకు ఏమీ అవసరం లేదు' అని వారు అనుకొని ఉంటే ది లిటిల్ థియేటర్ ఇంత దూరం వచ్చేది కాదు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచేది కాదు. డబ్బున్న కుటుంబం, డబ్బు లేని కుటుంబం అని తేడా లేకుండా పిల్లలందరూ కళలతో మమేకం కావాలి. మనిషి సంపూర్ణ మానవుడిగా మారడానికి కళలు ఉపయోగపడతాయి.

– అయేషా,
ఫౌండర్, ది లిటిల్ థియేటర్

● ముగ్గు-ముచ్చట




శ్వేత సంబరాజు
బోడుప్పల్, హైదరాబాద్

17 చుక్కలు, 5 వరుసలు
అటు ఇటు వదిలి 5 వరకు


ఎం.సుగుణ
వైఎస్‌ఆర్ కడప

9 చుక్కలు
11 వరసలు
సరిచుక్క






కోమటిరెడ్డి శ్రీలత
కాపువాడ, కరీంనగర్

17 చుక్కలు, సందు చుక్క,
9 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

31న కొర్నెపాడులో డా. ఖాదర్ సదస్సు

రైతుకో కిలో కొర్ర విత్తనాలు, ఔషధ మొక్కల పంపిణీ

గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడులో గల రైతునేస్తం ఫౌండేషన్ శిక్షణా కేంద్రం ఆవరణలో డిసెంబర్ 31 (ఆదివారం)న ఉ.10 గం. నుంచి సా. 4 గం. వరకు చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు, చిరుధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయం, ఔషధ మొక్కల సాగు- వినియోగంపై అవగాహన సదస్సు జరుగుతుంది. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఆహార-ఆరోగ్య నిపుణులు డాక్టర్ ఖాదర్ వలి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డు సీఈవో జె.ఎ. చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథులుగా హాజరవుతారు. సదస్సుకు హాజరయ్యే రైతులకు కేజీ చొప్పున కొర్ర విత్తనాలు, ఔషధ మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రవేశం ఉచితం. మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయం ఉంది. ఇతర వివరాలకు 70939 73999, 97053 83666.




29న బయోచార్ క్షేత్ర సందర్శన, చర్చాగోష్ఠి

సేంద్రియ వ్యవసాయంలో నేల సారాన్ని పెంపొందించేందుకు వాడే కట్టె బొగ్గును బయోచార్ అంటారు. బయోచార్‌ను పశువుల ఎరువు లేదా కంపోస్టుతో కలిపి పంటలకు వేసుకుంటే మంచి దిగుబడులు రావటమే కాకుండా పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. బయోచార్‌ను రైతులు తయారు చేసుకునే, వాడుకునే పద్ధతులపై ఈ నెల 29న అనంతపురం జిల్లా గోరంట్లకు సమీపంలోని పూల చెట్ల పల్లిలోని టుడుటు ఫామ్స్‌లో క్షేత్ర సందర్శన, రైతులు, నిపుణులతో చర్చాగోష్ఠి జరగనుంది. విద్యాధిక ప్రకృతి వ్యవసాయదారుడు తేజాస్ బయోచార్‌ను ఉపయోగించి పంటలు పండిచటమే కాకుండా.. ఔత్సాహికులకు ఆఫ్‌లైన్/ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29 (శుక్రవారం) ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్ర సందర్శన, చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ప్రముఖ బయోచార్ నిపుణులు డా. నక్కా సాయిభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. ఆసక్తిగల రైతులు, ఔత్సాహిక వ్యవసాయ పట్టభద్రులు ముందుగా పేర్లు నమోదు చేయించుకొని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ఇతర వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 95022 93343 నంబరులో వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చు.







సాగుబడి
మూల కార్తె: డిసెంబర్ 28 వరకు
పూ.షా. కార్తె: 29 నుంచి

- పశ్చిమ కృష్ణా డెల్టా మాగాణుల్లో రైతులకు లాభదాయకంగా మారిన రబీ జొన్న సాగు
- ఖరీఫ్ వరి తర్వాత జొన్న సాగును ప్రోత్సహిస్తున్న ఐఐఎంఆర్
- గత ఏడాది 50 వేల హెక్టార్లకు పైగా సాగు.. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం

మాగాణిలో రబీ జొన్న మేలు



వాతావరణంలో మార్పు కారణంగా సరిగ్గా వర్షాలు పడకపోవడం, అధిక ఉష్ణోగ్రత, సాగునీటి కొరత వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగలిగే శక్తి గల పంటలు చిరుధాన్యాలు. ఈ పంటలను ఏడాది పొడుగునా ఎలాంటి కాలపరిమితి లేకుండా నిస్సారమైన భూముల్లో సైతం సాగు చేయవచ్చు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆర్యోగం, ఉపాధి, పర్యావరణ ప్రయోజనాలు సమృద్ధిగా లభిస్తాయి. వ్యవసాయ భద్రతనిస్తాయి. మాగాణుల్లో ఖరీఫ్‌లో వరి సాగు తర్వాత జొన్న పంట సాగు బాగోగులను పరిశీలిద్దాం.

మన దేశ ప్రజలు వరి, గోధుమల తర్వాత జొన్నలను ప్రధాన ఆహారంగా ఎక్కువగా తింటున్నారు. సాధారణంగా జొన్న పంటలను మెట్ట భూముల్లో వర్షాధారంగా రైతులు సాగు చేస్తున్నారు. అయితే, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పశ్చిమ కృష్ణా డెల్టాలోని మాగాణి భూముల్లో కూడా ఖరీఫ్ వరి తర్వాత రబీ పంటగా మొక్కజొన్న, మినుముతో పాటు జొన్నను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. క్రమంగా తెల్లజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వరి కోసిన తర్వాత మళ్లీ దుక్కి చేయకుండా.. ట్రాక్టర్‌కు జోడించిన సీడ్ డ్రిల్‌తో లేదా సీడ్ డిబ్లర్‌తో బెజ్జాలు చేసి, ఆ బెజ్జాల్లో జొన్న విత్తనాలు వేస్తూ.. జీరో టిల్లేజ్ పద్ధతిలో తక్కువ ఖర్చుతో రైతులు సాగు చేస్తూ అధికాదాయం పొందుతున్నారు.

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐసీఎఆర్- ఐఐఎంఆర్)కు చెందిన ప్రధాన శాస్త్రవేత్త డా. బొంతగొర్ల సుబ్బారాయుడు తదితర ఐఐఎంఆర్ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలతో గత రెండు దశాబ్దాలుగా ఈ విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. పుణే, చెన్నై తదితర ప్రాంతాల రైతులు వచ్చి తెల్లజొన్నలు కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులు మినుము బదులు తెల్లజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2004లో వెయ్యి హెక్టార్లలో వరి మాగాణుల్లో దాళ్వా పంటగా జొన్నను సాగు చేస్తుండగా, 2022 నాటికి ఈ విస్తీర్ణం 50 వేల హెక్టార్లకు పెరిగిందని ఆయన 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఈ విస్తీర్ణం పెరగడానికి ముఖ్యంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏపీ వ్యవసాయ శాఖ, నాబార్డ్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీలు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు తోడ్పాటునందిస్తున్నాయన్నారు. 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా చిరుధాన్యాల వినియోగం దేశవిదేశాల్లో పెరిగింది. ఒక అంచనా ప్రకారం చిరుధాన్యాల లభ్యత మార్కెట్ డిమాండ్‌కు 40% తక్కువగా ఉంది. దీంతో బోరు నీటి సదుపాయం ఉన్న పశ్చిమ కృష్ణా డెల్టా మాగాణుల్లో రెండో పంటగా జొన్న సాగు విస్తీర్ణం ఈ ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉందని డా. సుబ్బారాయుడు వివరించారు.

పశ్చిమ కృష్ణా డెల్టాలో సాధారణంగా నవంబర్-డిసెంబర్‌లో రబీ జొన్న విత్తుతారు. అయితే, ఈ ఏడాది తుపాను కారణంగా జనవరిలోనూ తెల్లజొన్న విత్తే అవకాశం కనిపిస్తోంది. సంకరజాతి తెల్ల జొన్న 100-110 రోజుల పంట. ప్రైవేటు కంపెనీల విత్తనాలతో పాటు ఐఐఎంఆర్ రూపొందించిన సిఎస్‌హెచ్ 16, 25, 30 హైబ్రీడ్లను ఎక్కువ వేస్తున్నారు. వరుసల మధ్య 18 అంగుళాలు, మొక్కల మధ్య 9 అంగుళాల దూరంలో సీడ్ డ్రిల్ ద్వారా ఎకరానికి 6 కిలోల విత్తనం వాడుతున్నారు. మాగాణుల్లో రబీలో బోరు నీటి సదుపాయం ఉన్న రైతులు మొక్కజొన్న వేస్తే కనీసం 4 నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. మినుముకు పల్లాకు తెగులు, బంగారు తీగ సమస్యగా మారాయి. తెల్లజొన్నకు 2 లేక 3 నీటి తడులు సరిపోతాయి. కాబట్టి, మినుము కన్నా అధికాదాయాన్నిచ్చే తెల్లజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారని డా.సుబ్బారాయుడు వివరిస్తున్నారు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్


సీడ్ డిబ్లర్.. వరి కోసిన తర్వాత దుక్కి చెయ్యకుండా దీనితో బెజ్జాలు వేసి, వాటిల్లో జొన్న విత్తనాలు వేస్తారు..

వరి, మినుము కన్నా రబీ జొన్న లాభమే ఎక్కువ!

పశ్చిమ కృష్ణా డెల్టా మాగాణుల్లో ఖరీఫ్‌లో వరి, రబీలో మినుము లేదా జొన్న సాగులో 2020-2022 మధ్య 200 మంది రైతులకు ఏ పంట ఎంత లాభదాయకంగా ఉందన్న కోణంలో ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో ఇటీవలే అధ్యయనం చేసినట్లు ఐఐఎంఆర్ ప్రధాన శాస్త్రవేత్త డా.సుబ్బారాయుడు తెలిపారు. దీని ప్రకారం.. ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులకు హెక్టారుకు రూ. 46,080 ఖర్చు అవుతుండగా, రూ.78,720 నికరాదాయం వస్తోంది (రూపాయి ఖర్చుకు రూ.1.70 ఆదాయం వస్తోంది). ఇక రబీకి వచ్చే సరికి.. వరి తర్వాత మాగాణి భూముల్లో మినుము సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ. 42,480 ఖర్చు అవుతుండగా, రూ.63,720 నికరాదాయం వస్తోంది. అయితే, రబీలో తెల్లజొన్న సాగు చేసే రైతులకు హెక్టారుకు కనీసం 6 టన్నుల (ఎకరానికి సగటున 25 క్వింటాళ్లకు పైగా) దిగుబడి వస్తోంది. తద్వారా రూ. 1,75,494 ఆదాయం సమకూరుతుండగా, రూ.53,180 ఖర్చులు పోను రూ.1,22,314 నికరాదాయం వస్తోంది (రూపాయి పెట్టుబడి పెడితే రూ.2.30లు ఆదాయం వస్తోంది). ఈ విధంగా మాగాణి భూముల్లో వరి తర్వాత రెండో పంటగా తెల్లజొన్న సాగు డెల్టా రైతులకు లాభదాయకంగా మారిందని ఈ తాజా అధ్యయనంలో వెల్లడైంది.

ప్రాసెసింగ్ చేసి అమ్మితే మరింత లాభం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాగాణుల్లో రబీ జొన్న సాగు 50 వేల హెక్టార్లకు పెరగడంతో ఏటా 3 లక్షల టన్నుల తెల్లజొన్నలు ఉత్పత్తి అవుతున్నాయి. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా జొన్న ఉత్పత్తులకు గిరాకీ పెరగడంతో ఈ ఏడాది మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీంతో ఈ రబీ సీజన్‌లో పశ్చిమ కృష్ణా డెల్టాలో తెల్లజొన్న సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. పండించిన జొన్నలను చాలా మంది చిన్న, సన్నకారు రైతులు నేరుగా అమ్మేసుకుంటున్నారు. వీరు సహకార సంఘాలుగా లేదా రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి తాము పండించిన జొన్నలు, ఇతర చిరుధాన్యాలను ఉమ్మడిగా ప్రాసెసింగ్ చేసి విలువను జోడించి విక్రయించుకోగలిగితే నికరాదాయాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంది. బాపట్లలోని ఫార్మసీ కళాశాల ఆవరణలో నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో చిరుధాన్యాల ప్రాసెసింగ్‌కు ఉపయోగపడే 5 యంత్రాలను రైతుల కోసం అందుబాటులో ఉంచాం. చిరుధాన్యాల ప్రాసెసింగ్‌పై ఆసక్తి గల రైతులు, వ్యాపారులు బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.గోపాలకృష్ణ (99123 42094)ను సంప్రదించవచ్చు.

– డా. బొంతగొర్ల సుబ్బారాయుడు
(99896 74550), ప్రధాన శాస్త్రవేత్త,
భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ
(ఐసీఎఆర్- ఐఐఎంఆర్),
రాజేంద్రనగర్, హైదరాబాద్.





మెయిన్ 'డ్రా'కు హుమేరా అర్హత

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ హుమేరా బహర్మస్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. నవీ ముంబైలో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో హుమేరా గెలిచి మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టింది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 'బై' పొందిన హుమేరా రెండో రౌండ్‌లో 6-1, 6-3తో అలెగ్జాండ్రా అజార్కో (రష్యా)పై, మూడో రౌండ్‌లో 3-6, 6-2, 6-4తో జెన్నిఫర్ లుఖమ్ (భారత్)పై విజయం సాధించింది.

నేటి నుంచి ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ

ఈ ఏడాదిని ఘనంగా ముగించేందుకు భారత చెస్ క్రీడాకారులు సిద్ధమయ్యారు. నేటి నుంచి ఐదు రోజులపాటు ఉజ్బెకిస్తాన్‌లో ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ జరగనుంది. భారత్ నుంచి ఓపెన్ విభాగంలో 18 మంది, మహిళల విభాగంలో 11 మంది బరిలోకి దిగుతున్నారు. మహిళల ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలిల నుంచి పతకాలు ఆశించవచ్చు.



నలుగురికి తొలిసారి చోటు

ఆస్ట్రేలియా మహిళల జట్టుతో వన్డే, టి20 సిరీస్‌కు భారత జట్ల ప్రకటన



సైకా ఇషాక్ శ్రేయాంక పాటిల్



టిటాస్ సాధు



మన్నత్

ముంబై: ఈనెల 28 నుంచి ముంబైలో ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగే మూడు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే భారత జట్లను ప్రకటించారు. ఎడంచేతి వాటం స్పిన్నర్లు సైకా ఇషాక్ (బెంగాల్), మన్నత్ కశ్యప్ (పంజాబ్), ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ (కర్ణాటక), మీడియం పేస్ బౌలర్ టిటాస్ సాధు (బెంగాల్)లకు తొలిసారి భారత వన్డే జట్టులో చోటు లభించింది. ఇంగ్లండ్‌తో ఇటీవల జరిగిన టి20 సిరీస్‌లో తొలిసారి జాతీయ జట్టులోకి ఎంపికైన 21 ఏళ్ల శ్రేయాంక, 28 ఏళ్ల సైకా ఇషాక్ మూడు మ్యాచ్‌ల్లో ఐదేసి వికెట్లు చొప్పున పడగొట్టి ఆకట్టుకున్నారు. మన్నత్, టిటాస్ సాధు ఈ ఏడాది అండర్-19 ప్రపంచకప్ టైటిల్ సాధించిన భారత జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు డిసెంబర్ 28, 30, జనవరి 2న వాంఖెడె స్టేడియంలో... మూడు టి20 మ్యాచ్‌లు జనవరి 5, 7, 9 తేదీల్లో నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతాయి. ఈ రెండు సిరీస్‌లలో భారత జట్లకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరిస్తారు. వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన 16 మంది బృందంలో రెండు మార్పులతో టి20 జట్టును ఎంపిక చేశారు. వన్డే జట్టులో ఉన్న స్నేహ్ రాణా, హర్లీన్ డియోల్ స్థానాల్లో టి20 జట్టులో కనిక అహూజా, మిన్ను మణి వచ్చారు.

భారత మహిళల వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, యస్తిక, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్, సైకా ఇషాక్, రేణుక సింగ్, టిటాస్ సాధు, పూజ వస్త్రకర్, స్నేహ్ రాణా, హర్లీన్ డియోల్.

సఫారీ 'టెస్టు' సవాల్

దక్షిణాఫ్రికా గడ్డపై ఎనిమిదిసార్లు పర్యటన... 23 టెస్టుల్లో బరిలోకి...4 టెస్టుల్లో విజయాలు ... 12 పరాజయాలు... సమంగా ముగిసిన మరో 7 మ్యాచ్‌లు... అయితే 31 ఏళ్లలో ఒక్క సిరీస్ కూడా భారత్ సొంతం కాలేదు... గతంలో ఎన్నడూ గెలవని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెస్టిండీస్ వేదికలపై కూడా ఈ మూడు దశాబ్దాల వ్యవధిలో తొలిసారి సిరీస్ విజయాలు సాధించి టీమిండియా లెక్క సరి చేసింది... కానీ ఇప్పటికి కొరకరాని కొయ్యలా మిగిలింది సఫారీ టూర్ మాత్రమే... ఇక్కడ మాత్రం మనకు ఇప్పటి వరకు సిరీస్ దక్క లేదు. ఈ రికార్డును చెరిపేసేందుకు రోహిత్ శర్మ నేతృత్వంలో టీమిండియా మరోసారి దక్షిణాఫ్రికా గడ్డపై అడుగు పెట్టింది. ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లతో సత్తా చాటి భారత్ ఈసారి ఆ లోటును తీరుస్తుందా లేక స్వదేశంలో బలమైన సఫారీ సేన తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటుందా అనేది ఆసక్తికరం.

నేటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు	సిరీస్ లక్ష్యంగా బరిలోకి టీమిండియా	సొంతగడ్డపై పటిష్టంగా బవుమా బృందం	మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం





రోహిత్

సెంచూరియన్: టి20, వన్డేల తర్వాత భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఇక్కడి సూపర్ స్పోర్ట్ పార్క్‌లో ఇరు జట్ల మధ్య నేటినుంచి తొలి టెస్టు జరుగుతుంది. కొంత విరామం తర్వాత రెండు టీమ్‌లూ టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతున్నాయి. భారత జట్టు ఆఖరిసారిగా గత జూలైలో వెస్టిండీస్ గడ్డపై సిరీస్ ఆడగా... దక్షిణాఫ్రికా స్వదేశంలో చివరిసారిగా గత మార్చిలో విండీస్‌తోనే తలపడింది. బలాబలాలను బట్టి చూస్తే ఇరు జట్లూ సమ ఉజ్జీలుగానే కనిపిస్తున్నాయి. రెండు టీమ్‌ల నుంచి కూడా టి20, వన్డే సిరీస్‌ల నుంచి విశ్రాంతి తీసుకున్న పలువురు అగ్రశ్రేణి ఆటగాళ్లు కొత్త ఉత్సాహంతో ఇప్పుడు టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో హోరాహోరీ సమరానికి అవకాశం ఉంది.



మార్క్‌రమ్, బవుమా, రబడ

ప్రసిధ్ కృష్ణకు అవకాశం...

పుష్కర కాలం... భారత టెస్టు క్రికెట్ గొప్ప విజయాల్లో భాగంగా ఉన్న పుజారా, రహానే ఇద్దరూ తుది జట్టులో లేకుండా జట్టు విదేశీ గడ్డపై టెస్టు ఆడి 12 ఏళ్లు అయింది! 2012 జనవరిలో అడిలైడ్‌లో ఆసీస్‌తో మ్యాచ్ తర్వాత వీరిద్దరూ లేకుండా విదేశాల్లో టెస్టు ఆడని భారత జట్టు ఇప్పుడు కొత్తగా సిద్ధమైంది. వరల్డ్ కప్ ఫామ్‌ను బట్టి చూస్తే కెప్టెన్ రోహిత్, కోహ్లిల బ్యాటింగ్ భారత్‌కు కీలకం కానుంది. రాహుల్‌కు రెండు సిరీస్‌ల అనుభవం ఉండగా, గిల్ తొలిసారి దక్షిణాఫ్రికా గడ్డపై ఆడబోతున్నాడు. వీరితో పోలిస్తే శ్రేయస్, యశస్వి ఇంకా కొత్త ఆటగాళ్ల కిందే లెక్క. ఈ స్థితిలో రోహిత్, కోహ్లిల ప్రదర్శనపై జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. కఠినమైన ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొని భారత టాప్-6 ఎన్ని పరుగులు సాధిస్తుందనేది చూడాలి. ఆల్‌రౌండర్‌గా జడేజా రాణించాల్సి ఉంది. పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని చూస్తే అశ్విన్‌కంటే శార్దుల్‌కే చాన్స్ దక్కవచ్చు. బుమ్రా, సిరాజ్ ప్రధానంగా పేస్ బౌలింగ్ భారం మోస్తారు. వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన షమీ లేకపోవడం జట్టుకు పెద్ద లోటే. అతని స్థానంలో మూడో పేసర్‌గా ప్రసిధ్, ముకేశ్‌లకు ఒకరికి చాన్స్ ఉంటుంది.

పేస్ పదును...

టి20, వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా బౌలింగ్‌ను చూస్తే ఆ జట్టును తక్కువగా అంచనా వేయడానికి లేదు. గాయాల నుంచి కోలుకున్న ప్రధాన పేసర్లు రబడ, ఎన్‌గిడి సమరోత్సాహంతో ఉన్నారు. వీరికి తోడుగా కొత్త స్టార్ కొయెట్జీ కూడా చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నాడు. సొంతగడ్డపై ఈ త్రయం బౌలింగ్ భారత్‌ను పరీక్ష పెట్టవచ్చు. భిన్నమైన శైలి గల జాన్సెన్ కూడా జత కలిస్తే జట్టు బౌలింగ్ మరింత పదునెక్కుతుంది. కెరీర్‌కు ఘనమైన ముగింపు ఇవ్వాలని భావిస్తున్న సీనియర్ ఎల్గర్‌తో పాటు మార్క్‌రమ్, బవుమా బ్యాటింగ్‌లో కీలకం. కొత్త ఆటగాళ్లు జోర్జి, బెడింగామ్ కూడా ప్రభావం చూపగలరు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, కోహ్లి, రాహుల్, శ్రేయస్, జడేజా, శార్దుల్, బుమ్రా, ప్రసిధ్, సిరాజ్. **దక్షిణాఫ్రికా:** బవుమా (కెప్టెన్), ఎల్గర్, మార్క్‌రమ్, జోర్జి, బెడింగామ్, వెరీన్, జాన్సెన్, మహరాజ్, కొయెట్జీ, రబడ, ఎన్‌గిడి.

పిచ్, వాతావరణం

పేస్‌కు బాగా అనుకూలమైన పిచ్. తొలి రెండు రోజులు మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవచ్చు. ఈ వేదికపై దక్షిణాఫ్రికా 28 టెస్టు మ్యాచ్‌లలో 22 గెలిచి, 3 మాత్రమే ఓడింది.

గత సిరీస్‌ల ఫలితాలు...

1992 (4 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 1-0తో సిరీస్ సొంతం
1996 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-0తో సిరీస్ కైవసం
2001 (2 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 1-0తో సిరీస్ హస్తగతం
2006 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-1తో సిరీస్ సొంతం
2010 (3 టెస్టులు)
ఫలితం: 1-1తో సిరీస్ 'డ్రా'
2013 (2 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 1-0తో సిరీస్ కైవసం
2018 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-1తో సిరీస్ సొంతం
2021 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-1తో సిరీస్ కైవసం

"నా దృష్టిలో ఈ సిరీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. గతంలో ఏ భారత జట్టూ సాధించని ఘనతను అందుకునేందుకు ఇదో మంచి అవకాశం. గతంలో రెండుసార్లు సిరీస్ గెలిచేందుకు చేరువగా వచ్చినా సాధ్యం కాలేదు. ఈసారి కూడా ఎంతో ఆత్మవిశ్వాసంతో ఇక్కడ అడుగు పెట్టాం. వరల్డ్ కప్ ఫైనల్ ఓటమిని ఈ టెస్టు సిరీస్‌కు ముడి పెట్టలేం. అయితే ఇంత కష్టపడుతున్నాం కాబట్టి ఏదో ఒకటి దక్కాలి. షమీ లేకపోవడం లోటే కానీ కొత్త బౌలర్‌కు ఇది మంచి అవకాశం. మ్యాచ్‌కు ముందే మూడో పేసర్‌పై నిర్ణయం తీసుకుంటాం. కీపర్‌గా రాహుల్ రాణిస్తాడనే నమ్ముతున్నాం. అతను ఈసారి మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేస్తాడు. నాకు ఆడేందుకు అవకాశం ఉన్న అన్ని చోట్లా క్రికెట్ ఆడుతూనే ఉంటాం. అందరికీ ఆడాలనే ఉంటుంది. (మీరు ఏం అడుగుతారో నాకు తెలుసు). నా టి20 భవిష్యత్తు గురించి త్వరలోనే మీకు సమాధానం లభిస్తుంది."
-రోహిత్ శర్మ, భారత కెప్టెన్



స్టీలర్స్‌కు ఐదో విజయం

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 42-29తో తమిళ్ తలైవాస్ జట్టుపై ఘనవిజయం సాధించింది. ఈ లీగ్‌లో స్టీలర్స్‌కిది ఐదో విజయం కావడం విశేషం. స్టీలర్స్ తరఫున శివమ్ ఎనిమిది పాయింట్లు సాధించగా... జైదీప్ దహియా, రాహుల్ ఏడు పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. తలైవాస్ తరఫున సాహిల్ గులియా పది పాయింట్లు, హిమాన్షు సింగ్ తొమ్మిది పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 38-29తో బెంగాల్ వారియర్స్ జట్టుపై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌లో పుణేరి పల్టన్‌తో పట్నా పైరేట్స్ తలపడుతుంది.

పాయింట్ల పట్టిక

PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	6	5	1	0	26
హరియాణా స్టీలర్స్	7	5	2	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	8	3	3	2	22
యు ముంబా	6	4	2	0	21
బెంగళూరు బుల్స్	8	3	5	0	19
పట్నా పైరేట్స్	6	3	3	0	17
దబంగ్ ఢిల్లీ	6	3	3	0	15
యూపీ యోధాస్	7	2	4	1	15
తమిళ్ తలైవాస్	7	2	5	0	11
తెలుగు టైటాన్స్	7	1	6	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

ధ్రువ్‌కు రెండు ఐఎం నార్మ్‌లు



సాక్షి, హైదరాబాద్: వరుసగా రెండు అంతర్జాతీయ చెస్ టోర్నీల్లో రాణించిన హైదరాబాద్ కుర్రాడు తోట ధ్రువ్ రెండు అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) నార్మ్‌లు సంపాదించాడు. బుడాపెస్ట్ ఓపెన్ టోర్నీలో ధ్రువ్ ఏడు పాయింట్లతో విజేతగా నిలిచి తొలి ఐఎం నార్మ్ సాధించాడు. అనంతరం స్పెయిన్‌లో జరిగిన సిట్‌గెస్ చెస్ ఫెస్టివల్‌లో 14 ఏళ్ల ధ్రువ్ ఏడు పాయింట్లు స్కోరు చేసి రెండో నార్మ్ దక్కించుకున్నాడు.

సినిమా



● కుమార్తె రాహాతో రణ్‌బీర్, ఆలియా

హీరో రణ్‌బీర్ కపూర్, హీరోయిన్ ఆలియా భట్ తమ ముద్దుల కుమార్తె రాహాని తొలిసారి ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ ప్రేమ పక్షులు 2022 ఏప్రిల్ 14న వివాహం చేసుకున్నారు. అదే ఏడాది నవంబర్‌లో వీరికి రాహా జన్మించింది. అయితే ఇప్పటివరకు రాహా ముఖాన్ని అభిమానులకు పరిచయం చేయలేదు. తాజాగా క్రిస్మస్ సందర్భంగా ఈ జంట కుమార్తెతో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. రాహా అచ్చం రణ్‌బీర్ కపూర్ తండ్రి రిషీ కపూర్‌లా ఉందంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రాహా వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

ఆ ఆనందం వారి కళ్లల్లో కనిపిస్తోంది

- హీరో అడివి శేష్

''బబుల్‌గమ్' ట్రైలర్ చూస్తే అందమైన సినిమా అనిపిస్తోంది. ఈ మూవీ ద్వారా రోషన్ హీరోగా పరిచయమవుతున్నాడు. పిల్లలు పరిచయమవుతుంటే తల్లిదండ్రుల కళ్లల్లో ఓ ఆనందం ఉంటుంది... అది సుమ, రాజీవ్ కనకాలగారి కళ్లల్లో కనిపిస్తోంది'' అని హీరో అడివి శేష్ అన్నారు. రోషన్ కనకాల, మానసా చౌదరి జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించిన చిత్రం 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ బుకింగ్ ఈవెంట్‌కి హీరోలు అడివి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్ నందినీ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''బబుల్‌గమ్' ట్రైలర్‌లో రోషన్ నటన చూస్తే కొత్తవాడిలా అనిపించట్లేదు'' అన్నారు. ''బబుల్‌గమ్' ప్రేక్షకుల మనసుల్లో అంటుకుపోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ''ఈ చిత్రంలో మనందరిలో ఉండే భావోద్వేగాలు ఉంటాయి. అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు రోషన్ కనకాల. ''బబుల్‌గమ్'ని థియేటర్స్‌లోనే చూడాలి'' అన్నారు రవికాంత్ పేరేపు. ''రోషన్‌ని ఏడాది క్రితం కలిసినప్పుడు అమాయకంగా కనిపించాడు. కానీ, ఈ చిత్రం టీజర్, ట్రైలర్‌లో తన విశ్వరూపం కనిపించింది'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్.



● అడివి శేష్, రోషన్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ



● రకుల్, జాకీ

పోటీ వద్దనే 'గేమ్ చేంజర్' వాయిదా

- 'దిల్' రాజు

''ఈ సంక్రాంతికి 'గుంటూరు కారం, సైంధవ్, నా సామి రంగ, ఈగల్, హనుమాన్' వంటి సినిమాలు విడుదల కానున్నాయి. ఐదుగురు నిర్మాతలనూ పిలిచి మాట్లాడాం. రెండు సినిమాల రిలీజ్‌ను వాయిదా వేసుకోవాలని సూచించాం. సంక్రాంతి పోటీలో ఉండకూడదని నా సినిమా 'గేమ్ చేంజర్'ను వేసవికి వాయిదా వేశాం. ఎవరైనా రిలీజ్ వాయిదా వేసుకుంటే.. సోలో రిలీజ్ చేసేలా ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున చర్యలు తీసుకుంటాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జనవరి 21న 'లిటిల్ మ్యుజిషియన్స్ అకాడమీ' సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను నిర్వహించనుంది. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న 'దిల్' రాజు సంక్రాంతి సినిమాల గురించి మాట్లాడారు. లిటిల్ మ్యుజిషియన్స్ అకాడమీ గురు రామాచారి మాట్లాడుతూ– ''దివంగత గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారి ఆశీస్సులతో 1999లో ప్రారంభమైన ఈ అకాడమీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఈ సిల్వర్ జూబ్లీ ఉత్సవానికి సారథ్యం వహించాలని డైరెక్టర్ రాఘవేంద్రరావు, నిర్మాత 'దిల్' రాజుగార్లను కోరగానే ఒప్పుకున్నారు'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నా తొలి సినిమా 'దిల్' నుంచి రామాచారిగారితో పరిచయం ఉంది. ఆ టైమ్‌లో 'లిటిల్ మ్యుజిషియన్స్ అకాడమీ' గురించి చెప్పారాయన. ఈ అకాడమీలో ఉచితంగా సంగీతం నేర్పిస్తున్నారు. అద్దె భవనంలో ఉన్న అకాడమీకి ప్రభుత్వం తరఫున సాయం వచ్చేలా చేయాలనే ఆలోచన ఉంది'' అన్నారు.



● 'దిల్'రాజు, రామాచారి



నీలాంటి వాళ్లు అరుదు!

- రకుల్

''నీలా దయ గల గుణం, అమాయకత్వం ఉన్న వ్యక్తులు అరుదుగా ఉంటారు. నువ్వు చెప్పే జోక్స్ సిల్లీగా ఉన్నప్పటికీ ఫన్నీగా ఉంటాయి. నీలోని ఈ లక్షణాలను ఎప్పటికీ కాపాడుకోవాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే ఇవన్నీ ఉన్న అబ్బాయిలు అరుదుగా ఉంటారు'' అంటూ ప్రేమికుడు జాకీ భగ్నానీ పుట్టినరోజు (డిసెంబర్ 25) సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేశారు. ''నీతో ప్రయాణాలు, కలిసి నవ్వుకోవడం, తినడం.. అన్నీ నాకు ఆనందాన్నిస్తాయి. హ్యాపీ బర్త్ డే మై హార్ట్. ఈ పుట్టినరోజు మాత్రమే కాదు.. ప్రతి రోజూ నువ్వు కోరుకున్నవన్నీ నీకు దక్కాలి'' అంటూ జాకీతో ఉన్న ఫొటోలను షేర్ చేశారు రకుల్. కాగా రెండేళ్ల క్రితం ఈ ఇద్దరూ తాము రిలేషన్‌లో ఉన్న విషయాన్ని ప్రకటించారు. ఇక బాలీవుడ్ నిర్మాత వాసు భగ్నానీ తనయుడు అయిన జాకీ భగ్నానీ నటు డిగా, నిర్మాతగా కొనసాగుతున్నారు.

జాతరలో ఫైట్



● ఎన్టీఆర్

ఒకవైపు గంగమ్మ జాతర జోరుగా జరుగుతోంది. గంగమ్మ భక్తుడు దేవర భక్తి శ్రద్ధలతో జాతరలో పాల్గొంటున్నాడు. అయితే జాతరలో విలన్లతో ఫైట్ చేయాల్సి వచ్చింది. అంతే.. రఫ్ఫాడించాడు. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న 'దేవర' చిత్రంలోని జాతర ఇది. ఎన్టీఆర్ పాత్ర పేరు దేవర. ఈ చిత్రంలో గంగమ్మ జాతర నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఉన్నాయని తెలిసింది. ఈ జాతర బ్యాక్‌డ్రాప్‌లోనే భారీ ఫైట్ ఉంటుందట. ఈ జాతర, ఫైట్ సినిమాకే హైలెట్‌గా నిలిచేంత భారీగా ఉంటాయని భోగట్టా. ఈ చిత్రంలో ఉన్న పోరాట సన్నివేశాలన్నీ భారీగా ఉంటాయని తెలిసింది. వాటిలో ముఖ్యంగా నీటి లోపల తీసిన యాక్షన్ సీన్, జాతర బ్యాక్‌డ్రాప్ ఫైట్ భారీ స్థాయిలో ఉంటాయట. ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ తెలుగు తెరకు కథానాయికగా పరిచయం కానున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న 'దేవర' తొలి భాగం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

జీవితాంతం గుర్తుండిపోతుంది

- కాకర్ల కృష్ణ



ప్రముఖ నిర్మాత కాకర్ల కృష్ణ స్వర్ణోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. సూపర్ స్టార్ కృష్ణ, అంజలీదేవి, చంద్రకళ ప్రధాన పాత్రల్లో కె. సత్యం దర్శకత్వంలో కాకర్ల కృష్ణ నిర్మించిన చిత్రం 'ఇంటింటి కథ' (1974). ఈ సినిమా విడుదలై 50 ఏళ్లయిన సందర్భంగా నిర్మాత కాకర్ల కృష్ణ స్వర్ణోత్సవం జరిగింది. కాకర్ల కృష్ణ మనవడు త్రికాంత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత, నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ– ''వీబీ రాజేంద్ర ప్రసాద్‌గారి జగపతి సంస్థలో ప్రొడక్షన్ మేనేజర్‌గా ప్రయాణం ప్రారంభించిన కృష్ణ ఆ తర్వాత 'ఇంటింటి కథ' సినిమాతో నిర్మాతగా మారారు'' అన్నారు. కాకర్ల కృష్ణ మాట్లాడుతూ– ''ఇంత మంది ఆత్మీయుల సమక్షంలో నా స్వర్ణోత్సవం జరగటం సంతోషంగా ఉంది. ఇది నా జీవితాంతం తీపి జ్ఞాపకంగా ఉంటుంది'' అన్నారు. ''కృష్ణ స్వర్ణోత్సవం జరగడం సముచితంగా, సంతోషంగా ఉంది'' అన్నారు రచయిత పరుచూరి గోపాలకృష్ణ. నిర్మాతలు కె. దామోదర ప్రసాద్, జి. ఆదిశేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

ఆ కన్నుల చూపుల్లోన...

హీరో అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. ఇందులో లావణ్య హీరోయిన్. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించారు. కిరణ్ వెన్న సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'ఆ కన్నుల చూపుల్లోన..' అంటూ సాగే పాటని డైరెక్టర్ కేఎస్ రవీంద్ర (బాబీ) రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''బన్నీగారిని (అల్లు అర్జున్) ఎప్పుడు కలవడానికి వెళ్లినా విరాన్ కనిపించేవాడు. అంత పెద్ద ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ పెట్టుకుని వాళ్ల సహాయం తీసుకోకుండా వారి ఆశీస్సులు తీసుకుని సొంత గుర్తింపు కోసం స్వతంత్రంగా ప్రయత్నించడం సంతోషం'' అన్నారు. ''నేను పుట్టింది, పెరిగింది ఇండస్ట్రీలోనే. బాబీ అన్నలాంటి మంచి మనిషి ఇండస్ట్రీలో లేరు. ఎన్ని జన్మలు ఎత్తినా మీరు చేసిన సహకారం మర్చిపోను'' అన్నారు విరాన్. ''తప్పు చేయాలన్న ఆలోచన వచ్చి ఆ ఆలోచనని సరిదిద్దుకునే లోపే కొన్ని అనర్థాలు జరుగుతాయి.. ఆ నేపథ్యంలో తీసిన సినిమా ఇది'' అన్నారు వేణు మురళీధర్. ''మా బ్యానర్‌లో నిర్మించిన తొలి చిత్రం 'ముఖ్య గమనిక'. త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు రాజశేఖర్.



● విరాన్ ముత్తంశెట్టి, బాబీ

పల్లెటూరి ప్రేమ



● అనురాగ్, అవికా

అనురాగ్, అవికా గోర్ జంటగా సత్య ద్వారంపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'ఉమాపతి'. కె. కోటేశ్వర రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సత్య ద్వారంపూడి, కె. కోటేశ్వర రావు మాట్లాడుతూ– ''ప్రేమ కథలు ఎప్పుడు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ప్రస్తుత తరుణంలో గ్రామీణ ప్రేమకథలు రావడం అరుదుగా మారింది. ఆ లోటు తీర్చేందుకు పల్లెటూరి ప్రేమకథతో మా సినిమా వస్తోంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాఘవేంద్ర, సంగీతం: శక్తికాంత్ కార్తీక్, నేపథ్య సంగీతం: జీవన్ బాబు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
242	94
71,107	21,349

విదేశీ సూచీలు (తొలి నాలుగు శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	14,993	▲	29
డోజోన్స్	37,386	▼	18
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,698	▲	3
డాక్స్	16,706	▲	19
షాంఘై	2,919	▲	4
నికాయ్	33,254	▲	85

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.85	83.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.49	107.06
€	యూరో	ఎస్‌బీఐ	90.53	92.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.84	59.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.55	57.53
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.02	63.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.74	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.55	12.62

ఐపీవోలకు కంపెనీల క్యూ..

2024లోనూ మరిన్ని ఇష్యూలు

- స్టాక్ నిపుణుల అంచనాలు
- 2023లో రూ. 52,000 కోట్ల నిధుల సమీకరణ

ఇటీవల సెకండరీ మార్కెట్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతూ సరికొత్త గరిష్టాలను తాకుతున్నాయి. పెట్టుబడుల ప్రోత్సాహంతో ప్రైమరీ మార్కెట్ సైతం కళకళలాడుతోంది. ఈ ప్రభావంతో కొత్త ఏడాది (2024)లోనూ పలు కంపెనీలు నిధుల సమీకరణకు క్యూ కట్టనున్నట్లు స్టాక్ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో పబ్లిక్ ఇష్యూల వెల్లువ కొనసాగనున్నట్లు అంచనా వేశారు.



న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాది (2023)లో ఇప్పటి వరకూ పబ్లిక్ ఇష్యూల ద్వారా కంపెనీలు రూ. 52,000 కోట్లు సమకూర్చుకున్నాయి. ప్రధాన ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ ద్వారా దేశీ కార్పొరేట్లు సమీకరించిన నిధులివి. నిజానికి ఓవైపు వడ్డీ రేట్లు, మరోపక్క భౌగోళిక, రాజకీయ రిస్కులు పెరిగినప్పటికీ.. ఐపీవోలు దూకుడు చూపుతున్నాయి. పలు కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ కోసం వెల్లువలా సెబీ తలుపు తడుతున్నాయి. దీంతో వచ్చే ఏడాదిలోనూ ప్రైమరీ మార్కెట్ బుల్లిష్ ధోరణిలోనే కొనసాగనున్నట్లు పలువురు స్టాక్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. గతేడాది (2022)లో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీని మినహాయిస్తే పబ్లిక్ ఇష్యూల ద్వారా కంపెనీలు రూ. 20,557 కోట్లు సమీకరించాయి. అంటే దీంతో పోలిస్తే ఈ ఏడాది 36 శాతం అధికంగా పెట్టుబడులు అందుకున్నాయి. ప్రధానంగా మధ్య, చిన్న తరహా కంపెనీలు హవా చూపాయి. మార్కెట్ సెంటిమెంటు బలంగా ఉండటం ఇందుకు దోహదపడుతోంది. అయితే ప్రపంచ సవాళ్ల నేపథ్యంలో ఏడాది మొదట్లో మార్కెట్లు డీలా పడిన సంగతి తెలిసిందే.

కారణాలున్నాయ్..

ప్రైమరీ మార్కెట్లు జోరందుకోవడానికి లిస్టింగ్ లాభాలు, అందుబాటు ధరల్లో డీల్స్ కారణమవుతున్నట్లు పంటోమత్ క్యాపిటల్ అడ్వయిజర్స్ ఎండీ మహావీర్ లూనావత్ పేర్కొన్నారు. ఆయా రంగాల్లోని లిస్టెడ్ కంపెనీలు అధిక విలువల్లో ట్రేడవుతుండటం ఇందుకు జత కలసినట్లు అభిప్రాయపడ్డారు. పటిష్ట నియంత్రణా వ్యవస్థలు సైతం ఇందుకు అండగా నిలుస్తున్నట్లు తెలియజేశారు. 2023లో కనిపిస్తున్న ప్రోత్సాహకర పరిస్థితులు 2024లోనూ కొనసాగనున్నట్లు ఆనంద్ రాఠీ అడ్వయిజర్స్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఈసీఎం వి.ప్రశాంత్ రావు అంచనా వేశారు. ఇది బంగారు కాలంగా నిలిచే వీలున్నట్లు పేర్కొన్నారు. తరలి వస్తున్న దేశ, విదేశీ పెట్టుబడులు, దేశీ మార్కెట్ల వృద్ధికిగల భారీ అవకాశాల కారణంగా వచ్చే ఏడాది లోనూ ఐపీవో మార్కెట్ మరింత జోరు చూపనున్నట్లు జేఎం ఫైనాన్షియల్ ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ నేహా అగర్వాల్ అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికల పూర్తి తదితర అనిశ్చితులు తొలగితే మరిన్ని పెట్టుబడులు తరలివస్తాయని పేర్కొన్నారు.


మరో రూ. 26,000 కోట్లు

నిధుల సమీకరణకు ఇప్పటికే క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి 24 కంపెనీలు అనుమతులు పొందాయి. ఇవి ఐపీవోలు చేపట్టడం ద్వారా రూ. 26,000 కోట్లు సమీకరించేందుకు వీలుంది. ఈ బాటలో మరో 32 కంపెనీలు లిస్టింగ్‌కు వీలుగా సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. వీటి నిధుల సమీకరణ అంచనా రూ. 35,000 కోట్లుగా ప్రైమ్ డేటాబేస్ పేర్కొంది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం 2023లో ఐపీవోల ద్వారా 58 కంపెనీలు రూ. 52,637 కోట్లు సమకూర్చుకున్నాయి. వీటిలో రూ. 3,200 కోట్లు అందుకున్న నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ రీట్ ఉంది. గతేడాది ఎల్ఐసీ (రూ. 20,557 కోట్లు) సహా.. 40 కంపెనీలు ఉమ్మడిగా రూ. 59,302 కోట్లు సమీకరించాయి. అయితే అంతకుముందు 2021లో 63 కంపెనీలు ప్రైమరీ మార్కెట్ ద్వారా ఏకంగా రూ. 1.2 లక్షల కోట్లను అందుకున్నాయి. వెరసి రెండు దశాబ్దాలలోనే అత్యధిక నిధుల సమీకరణగా 2021 నిలిచింది! అధిక లిక్విడిటీ, ఇన్వెస్టర్ల ఆసక్తి, మార్కెట్ల జోరు నేపథ్యంలో గత మూడేళ్లలో 150 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి.

త్వరలో రిలయన్స్-డిస్నీ స్టార్ ఇండియా విలీనం

ఒప్పందం ఖరారు

- ఫిబ్రవరికల్లా ప్రక్రియ పూర్తయ్యే అవకాశం



న్యూఢిల్లీ: దేశీయంగా మీడియా రంగంలో కన్సాలిడేషన్‌కు తెరతీస్తూ డిస్నీ-స్టార్ ఇండియాను విలీనం చేసుకునే దిశగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మెగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించిన నాన్-బైండింగ్ టర్మ్ షీటుపై సంతకాల కోసం లండన్‌లో జరిగిన భేటీలో డిస్నీ ప్రతినిధి కెవిన్ మేయర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి అత్యంత సన్నిహితుడైన మనోజ్ మోదీ తదితరులు పాల్గొన్నారు. ఒప్పందం కుదరడంతో వ్యాపార విలువ మదింపు తదితర ప్రక్రియలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం 45-60 రోజుల గడువు విధించుకున్నారు. అవసరమైతే దీన్ని పొడిగించే అవకాశం ఉంది. జనవరి ఆఖరు నాటికి ఈ డీల్‌ను పూర్తి చేయాలని రిలయన్స్ ఆసక్తిగా ఉన్నప్పటికీ ఫిబ్రవరి ఆఖరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్ పూర్తిగా స్టాక్, నగదు రూపంలో ఉండగలదని వివరించాయి. ఇరు సంస్థలు టర్మ్ షీటుపై చాలాకాలంగా కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రతిపాదన ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన వయాకామ్18, స్టార్ ఇండియా కార్యకలాపాలను విలీనం చేస్తారు. విలీన సంస్థలో రిలయన్స్‌కు 51 శాతం, డిస్నీకి 49 శాతం వాటాలు ఉండనున్నాయి. ఇందులో స్టార్ ఇండియాకు చెందిన 77 చానల్స్, వయాకామ్18కి చెందిన 38 చానల్స్ కలిపి మొత్తం 115 చానల్స్ ఉంటాయి. వీటితో పాటు డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, జియో సినిమా అనే రెండు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు కూడా భాగమవుతాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్, కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ (గతంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా) విలీన ప్రక్రియ జరుగుతుండగా కొత్తగా రిలయన్స్, డిస్నీ-స్టార్ డీల్ కూడా కుదిరితే దేశీయంగా మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో కన్సాలిడేషన్ జరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

అర్జెంటీనా లిథియం నిల్వలపై భారత్ దృష్టి

5 బ్లాక్‌ల కొనుగోలు కోసం తుదిదశలో చర్చలు



న్యూఢిల్లీ: లిథియం దిగుమతుల కోసం ప్రస్తుతం చైనాపైనే ఎక్కువగా ఆధారపడుతున్న భారత్.. ఇతరత్రా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా అర్జెంటీనాలో అయిదు లిథియం బ్లాకులను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టింది. భారత అవసరాల కోసం విదేశాల్లో ఖనిజ నిక్షేపాలను అభివృద్ధి చేసే జాయింట్ వెంచర్ కంపెనీ ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కాబిల్), అర్జెంటీనాకు చెందిన క్యాటామార్కా మినరా వై ఎనర్జెటికా సొసైడాడ్ డెల్ ఎస్టాడో (క్యామ్‌యెన్) ఇందుకు సంబంధించిన ఒప్పందంపై కసరత్తు చేస్తున్నాయి. చర్చలు తుదిదశలో ఉన్నాయని, త్వరలోనే ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే అయిదేళ్లలో లిథియం నిక్షేపాల అన్వేషణ, గనుల అభివృద్ధిపై భారత్ సుమారు రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించాయి. భారత్ ఇప్పటికే ఆస్ట్రేలియాలో రెండు లిథియం, మూడు కోబాల్ట్ గనులను అభివృద్ధి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే క్రమంలో లిథియంకు సంబంధించి అర్జెంటీనాతో ఒప్పందం రెండోది కానుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు మొదలైన వాటి బ్యాటరీల్లో లిథియంను విరివిగా ఉపయోగిస్తారు. భారత్ గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 25,000 కోట్ల విలువ చేసే లిథియంను చైనా, హాంకాంగ్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా 98 మిలియన్ టన్నుల లిథియం నిక్షేపాలు ఉండగా ఇందులో 20 శాతం నిక్షేపాలు అర్జెంటీనాలో ఉన్నాయి.

యూనికార్న్‌గా ఇన్‌క్రెడ్

60 మిలియన్ డాలర్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఇన్‌క్రెడ్ తాజాగా యూనికార్న్ (1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్) హోదా దక్కించుకుంది. ప్రస్తుత, కొత్త ఇన్వెస్టర్ల నుంచి 60 మిలియన్ డాలర్లు సమీకరించడంతో ఇది సాధ్యపడింది. తాజా పెట్టుబడుల రాకతో సంస్థ విలువ 1.04 బిలియన్ డాలర్లకు చేరిందని ఇన్‌క్రెడ్ పేర్కొంది. తద్వారా ఈ ఏడాది యూనికార్న్ హోదా దక్కించుకున్న రెండో సంస్థగా నిల్చిందని పేర్కొంది. రాబోయే రోజుల్లో వ్యాపారాన్ని మరింతగా విస్తరించడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు ఇన్‌క్రెడ్ సీఈవో భూపీందర్ సింగ్ తెలిపారు. ఎంఈఎంజీకి చెందిన రంజన్ పాయ్, ఆర్‌పీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ రవి పిళ్లై, డాయిష్ బ్యాంక్ గ్లోబల్ కో-హెడ్ రామ్ నాయక్ తదితరులు ఇన్వెస్ట్ చేసిన వారిలో ఉన్నారు. ఇన్‌క్రెడ్ సంస్థ కన్సూమర్ రుణాలు, విద్యా రుణాలు మొదలైన వ్యాపార విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
26-12-2023	
విశాఖ	620-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	615-00
విజయవాడ	615-00
రిటైల్ ధర (డజను)	72.00
25-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	599-00
వరంగల్	601-00
రిటైల్ ధర	6.60

ఫస్ట్‌క్రైలో సాఫ్ట్‌బ్యాంక్ వాటాల విక్రయం

310 మిలియన్ డాలర్ల విలువ చేసే షేర్ల అమ్మకం



న్యూఢిల్లీ: త్వరలో ఐపీవోకి రానున్న రిటైల్ సంస్థ ఫస్ట్‌క్రైలో జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ 310 మిలియన్ డాలర్ల విలువ చేసే షేర్లను విక్రయించింది. రెండు విడతల్లో షేర్లను విక్రయించగా, కొందరు అత్యంత సంపన్న ఇన్వెస్టర్లు కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్స్‌తో ఫస్ట్‌క్రై వేల్యుయేషన్‌ను 3.5-3.75 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టినట్లు పేర్కొన్నాయి. 900 మిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ఫస్ట్‌క్రైలో సాఫ్ట్‌బ్యాంక్ గతంలో 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. తాజా విక్రయానంతరం కంపెనీలో సాఫ్ట్‌బ్యాంక్‌కు ఇంకా 800-900 మిలియన్ డాలర్ల విలువ చేసే వాటాలు ఉన్నాయి. వీటిని తర్వాత విక్రయించే యోచనలో ఉంది. మొత్తం మీద ఫస్ట్‌క్రైలో పెట్టుబడుల ద్వారా 1.3 బిలియన్ డాలర్లు ఆర్జించడంపై సాఫ్ట్‌బ్యాంక్ దృష్టి పెట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సీసీఎంబీ, హైదరాబాద్‌లో 24 టెక్నికల్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ).. టెక్నికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-18, టెక్నికల్ ఆఫీసర్-05, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్/మెడికల్ ఆఫీసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** టెక్నికల్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్/ఎంవోల ఖాళీలకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** టెక్నికల్ అసిస్టెంట్/టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు. సీనియర్ టెక్నికల్ ఆఫీసర్/ఎంవోకు ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.01.2024
» **వెబ్‌సైట్:** www.ccmb.res.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 484 పోస్టులు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. దేశవ్యాప్తంగా ఉన్న సీబీఐ శాఖల్లో సఫాయి కర్మచారి కమ్ సబ్ స్టాఫ్/సబ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 484
» **జోన్ల వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్-76, భోపాల్-38, ఢిల్లీ-76, కోల్‌కతా-02, లక్నో-78, ఎంఎంజెడ్‌వో-పుణె-118, పాట్నా-96.
» **అర్హత:**ఎస్ఎస్‌సీ/పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:**31.03.2023 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:** నెలకు రూ.14,500 నుంచి రూ.28,145 వరకూ ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(70 మార్కులు), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్(30 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**09.01.2024
» **వెబ్‌సైట్:** https://centralbankofindia.co.in

ఐఐఎంటీ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ తిరుచిరాపల్లి (ఐఐఎంటీ).. 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **స్పెషలైజేషన్లు:** ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అండ్ అనలిటిక్స్, మార్కెటింగ్, ఆపరేషన్ మేనేజ్‌మెంట్ అండ్ డెసిషన్స్ సైన్సెస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజీ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్.
» **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ లేదా సీఏ/ ఐసీడబ్ల్యూఏ/ సీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2024.
» **వెబ్‌సైట్:** iimtrichy.ac.in

ఐఐఎం ఇండోర్‌లో డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు


ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇండోర్ 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(డీపీఎం) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **స్పెషలైజేషన్లు:** కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ లేదా సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.02.2024.
» **వెబ్‌సైట్:** www.iimidr.ac.in.

నిఫ్ట్.. ఫ్యాషన్ కెరీర్‌కు బెస్ట్!

» నిఫ్ట్ అడ్మిషన్స్ టెస్ట్ 2024 నోటిఫికేషన్ విడుదల
» ఫ్యాషన్, డిజైన్‌లో పలు బ్యాచిలర్, పీజీ ప్రోగ్రామ్స్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» కోర్సులు పూర్తి చేసుకుంటే ఉజ్వల కెరీర్స్

నిఫ్ట్.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈ విద్యాసంస్థ నిఫ్ట్ అడ్మిషన్స్ టెస్ట్-2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రవేశ ప్రక్రియలో ఉత్తీర్ణత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న నిఫ్ట్ క్యాంపస్‌ల్లో.. ఫ్యాషన్, డిజైనింగ్‌కు సంబంధించి పలు బ్యాచిలర్, పీజీ కోర్సుల్లో అడుగు పెట్టొచ్చు! నిఫ్ట్ కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఫ్యాషన్ రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో.. నిఫ్ట్ అడ్మిషన్ ప్రక్రియ, కోర్సులు, సీట్లు, ఎంపిక ప్రక్రియలో విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం..



ఫ్యాషన్ టెక్నాలజీకి సంబంధించి ఆధునిక నైపుణ్యాలు అందించే ఉద్దేశంతో కేంద్ర టెక్స్‌టైల్ శాఖ దేశవ్యాప్తంగా నిఫ్ట్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసింది. నిఫ్ట్‌కు ప్రస్తుతం జాతీయ స్థాయిలో 18 క్యాంపస్‌ల్లో పది కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియెట్ అర్హతతో ప్రవేశం లభించే బ్యాచిలర్ స్థాయి కోర్సులు ఏడు, అదే విధంగా బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ప్రవేశం కల్పించే పీజీ కోర్సులు మూడు. నిఫ్ట్ క్యాంపస్‌ల్లో ప్రవేశాల కోసం ప్రతి ఏటా నిఫ్ట్-అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తారు. తాజాగా 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకుగాను ఎంపిక ప్రక్రియ మొదలైంది.

బ్యాచిలర్ కోర్సులివే

- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్, లెదర్ డిజైన్, యాక్సెసరీ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్; బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ- అపెరల్ ప్రొడక్షన్.
- ఈ కోర్సులకు ఇంటర్మీడియెట్ ఏ గ్రూప్ విద్యార్థులైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరితోపాటు ఏఐసీటీఈ లేదా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపు పొందిన మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని డిప్లొమా కోర్సుల ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే.
- నిఫ్ట్ అందిస్తున్న ప్రోగ్రామ్‌లలో ప్రత్యేకమైనది బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్.టెక్). ఇది ఫ్యాషన్ విభాగంలో టెక్నికల్ నైపుణ్యాలను అందించే ప్రత్యేక కోర్సు. ఇందులో ప్రవేశానికి దరఖాస్తు చేయాలనుకుంటే.. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ కోర్సుకు మూడు/నాలుగేళ్ల వ్యవధిలోని డిప్లొమా కోర్సుల ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్‌లు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో.. మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు బ్యాచిలర్ డిగ్రీ లేదా నిఫ్ట్/నిడ్ నుంచి డిప్లొమా లేదా అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు. అదేవిధంగా మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి నిఫ్ట్ అందించే బీ.ఎఫ్‌టెక్ ఉత్తీర్ణులు లేదా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్/బీఈ ఉత్తీర్ణులు అర్హులు.

వయసు

2024 ఆగస్ట్ 1 నాటికి 24 సంవత్సరాలలోపు ఉండాలి. పీజీ ప్రోగ్రామ్‌లకు ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

నిఫ్ట్-అడ్మిషన్ ప్రక్రియను ఆయా కోర్సులను బట్టి మూడు దశల్లో నిర్వహిస్తారు. యూజీ, పీజీ కోర్సులకు తొలి దశలో జనరల్ ఎబిలిటీ టెస్ట్(జీఏటీ) ఉంటుంది. ఆ తర్వాత క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ (సీఏటీ), సిట్యుయేషన్ టెస్ట్ ఉంటాయి. పీజీ కోర్సులకు పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్‌లు నిర్వహిస్తారు.

తొలిదశ జీఏటీ

- తొలి దశలో నిర్వహించే జీఏటీ (జనరల్ ఎబిలిటీ టెస్ట్)ని బ్యాచిలర్, పీజీ కోర్సుల అభ్యర్థులు ఇద్దరికీ నిర్వహిస్తారు. పరీక్ష ప్రశ్నల క్లిష్టత స్థాయి మాస్టర్ కోర్సుల్లో కొంత ఎక్కువగా ఉంటుంది. బీడిజైన్ జీఏటీ పేపర్‌లో 100 ప్రశ్నలు ఉంటాయి, పరీక్ష సమయం రెండు గంటలు. ఎండిజైన్ జీఏఈ పేపర్‌లో 120 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు.
- జీఏటీలో.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ; కమ్యూనికేషన్ ఎబిలిటీ; ఇంగ్లిష్ కాంప్రహెన్షన్; అనలిటికల్ ఎబిలిటీ; జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులకు కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ రెండు విభాగాలు కలిపి 40 ప్రశ్నలు అడుగుతారు.

ఫ్యాషన్ టెక్నాలజీ.. పరీక్ష ఇలా

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు తొలి దశ ప్రవేశ పరీక్ష జీఏటీ ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. వీటితో పాటు ఒక కేస్ స్టడీ కూడా ఉంటుంది. మొత్తంగా ఈ పరీక్షలో 150 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.

రెండో దశ సీఏటీ

మొదటి దశలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో.. క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ (సీఏటీ) నిర్వహిస్తారు. అభ్యర్థుల్లోని పరిశీలనాత్మక నైపుణ్యం, సృజనాత్మకత, డిజైన్ సామర్థ్యాలను పరీక్షించే విధంగా ఈ పరీక్ష ఉంటుంది.

సిట్యుయేషన్ టెస్ట్

రెండు దశల్లో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుని యూజీ కోర్సులకు సిట్యుయేషన్ టెస్ట్ నిర్వహిస్తారు. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ అభ్యర్థులకు నిర్దిష్ట మెటీరియల్ అందించి ఏదైనా ఆకృతిని రూపొందించమని లేదా ఏదైనా ఒక సందర్భాన్ని పేర్కొని దానికి తగినట్లుగా ఊహా చిత్రం గీయమని అడుగుతారు. అభ్యర్థుల సృజనాత్మక ప్రతిభను పరిశీలించే విధంగా పరీక్ష ఉంటుంది.

గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ

జీఏటీ, సీఏటీలలో విజయం సాధించిన పీజీ అభ్యర్థులకు చివరగా గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.భావ వ్యక్తీకరణ సామర్థ్యం, విషయ పరిజ్ఞానం, ఆలోచన సామర్థ్యాలను పరీక్షించే విధంగా గ్రూప్ డిస్కషన్స్ ఉంటాయి. పర్సనల్ ఇంటర్వ్యూ పూర్తిగా ఫ్యాషన్ కెరీర్ పట్ల అభ్యర్థికున్న ఆసక్తి, దానికి సరితూగే తత్వాలను గ్రహించే విధంగా ఉంటుంది.

తుది జాబితా.. వెయిటేజీ విధానం

- నిఫ్ట్ ప్రవేశ ప్రక్రియలోని మూడు దశల్లోనూ ప్రతిభ చూపిన వారితో మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆయా టెస్ట్‌లలో పొందిన మార్కులకు నిర్దిష్ట వెయిటేజీ కల్పిస్తూ ఈ జాబితాను తయారుచేస్తారు.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులకు సీఏటీకి 50 శాతం, జీఏటీకి 30 శాతం, సిట్యుయేషన్ టెస్ట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.
- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులకు జీఏటీ సెక్షన్-ఎకు 70 శాతం; జీఏటీ సెక్షన్-బికు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.
- మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుకు సీఏటీకి 40 శాతం, జీఏటీకి 30 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ కల్పిస్తారు.
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు జీఏటీకి 70 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జనవరి 3
- ఆన్‌లైన్ ఎంట్రన్స్ టెస్ట్ తేదీ: 2024, ఫిబ్రవరి 5
- ఫలితాల వెల్లడి: 2024 మార్చిలో
- సిట్యుయేషన్ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ: 2024 ఏప్రిల్‌లో
- వివరాలకు వెబ్‌సైట్: https://www.nift.ac.in/admission

టాప్ స్కోర్ సాధించాలంటే

- **క్వాంటిటేటివ్ ఎబిలిటీ:** మ్యాథమెటిక్స్, అర్థమెటిక్స్ అంశాలపై పట్టు సాధించాలి. వర్క్ అండ్ టాస్క్, శాతాలు, నిష్పత్తులు, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్‌కు సంబంధించిన అంశాలు ప్రాక్టీస్ చేయాలి.
- **కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్:** ఇంగ్లిష్ భాషలో ప్రాథమిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని బేసిక్ గ్రామర్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ:** విశ్లేషణ సామర్థ్యాన్ని, తార్కిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక అంశంలో ఇమిడి ఉన్న ప్రధాన అంశాలు, వాటికి సంబంధించి అప్లికేషన్ అప్రోచ్‌తో ప్రాక్టీస్ చేయాలి.
- **జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్:** ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు హైస్కూల్ స్థాయి సోషల్ సబ్జెక్ట్ నుంచి ఉంటాయి. అదే విధంగా ముఖ్యమైన తేదీలు-సందర్భాలు వంటివి కూడా అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు తాజాగా జరిగిన ముఖ్యమైన సంఘటనలు కూడా తెలుసుకోవాలి.
- కేస్ స్టడీ: బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌కోర్సు అభ్యర్థులకు నిర్వహించే కేస్ స్టడీ.. ఒక వాస్తవ సమస్యను ఇచ్చి దానికి పరిష్కారం అడిగేలా ఉంటుంది. అభ్యర్థులకు అన్వయ దృక్పథం, సమస్యను గుర్తించే లక్షణం అవసరం.



ముఖ్యమంత్రి రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న చిరంజీవి

‘గ్రూప్‌-2’ నిర్వహణపై సందిగ్ధం!

- జనవరి 6, 7 తేదీల్లో పరీక్షలు ఉంటాయని 2 నెలల కిందటే ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ
- కమిషన్‌ చైర్మన్, సభ్యుల రాజీనామాతో ప్రశ్నార్థకంగా మారిన నిర్వహణ
- రెండుసార్లు వాయిదాపడ్డ పరీక్షలు
- ఈసారైనా జరుగుతాయో లేదోనని అభ్యర్థుల్లో ఆందోళన



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో గ్రూప్‌-2 అర్హత పరీక్షలపై అభ్యర్థుల్లో ఆందోళన తీవ్రమవుతోంది. ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడ్డ ఈ పరీక్షలు ఈసారైనా జరుగుతాయో లేదోనని అభ్యర్థులు కలవరపడుతున్నారు. గ్రూప్‌-2 అర్హత పరీక్షలను 2024 జనవరి 6, 7 తేదీల్లో నిర్వహిస్తామంటూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) రెండు నెలల క్రితమే ప్రకటించింది. వాస్తవానికి ఈ ఏడాది నవంబర్‌ 2–3 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తేదీలు ప్రకటించినప్పటికీ పరీక్షల సన్నద్ధతకు మరింత సమయం ఇవ్వాలంటూ అభ్యర్థుల నుంచి ఒత్తిడి రావడంతోపాటు ఎన్నికల షెడ్యూల్‌ వెలువడటం, పోలీసులు ఎన్నికల విధుల్లో ఉండటంతో 2024 జనవరిలో పరీక్షలు నిర్వహిస్తామని కమిషన్‌ ప్రకటించింది. ఈ లెక్కన మరో 10 రోజుల్లో గ్రూప్‌-2 పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీకి మరో సమస్య ఎదురైంది. టీఎస్‌సీఎస్సీ చైర్మన్‌ బి.జనార్దన్‌రెడ్డితోపాటు ఐదుగురు సభ్యులు గవర్నర్‌ను కలసి రాజీనామాలు సమర్పించాలనుకున్నా ఆమె సమయం ఇవ్వకపోవడంతో గవర్నర్‌ కార్యాలయానికి రాజీనామా లేఖలు పంపారు. అయితే రాజీనామాలు పంపి వారం దాటినా గవర్నర్‌ కార్యాలయం నుంచి వాటిని ఆమోదిస్తున్నట్లుగానీ.. తిరస్కరిస్తున్నట్లుగానీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సమాచారం. వారి రాజీనామాలను గవర్నర్‌ ఆమోదిస్తే తప్ప కొత్తగా చైర్మన్‌ను, సభ్యులను నియమించే అవకాశం లేదని అంటున్నారు. కానీ కొత్త ప్రభుత్వం వారి రాజీనామాలతో సంబంధం లేకుండా అప్పటికే ఖాళీగా ఉన్న మరో ఐదుగురు సభ్యులను నియమించే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కొత్త చైర్మన్, సభ్యులు వచ్చాకే పరీక్షలు?

ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం పాలనా వ్యవహారాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఉంది. పరీక్షల నిర్వహణ, నియామకాలకు సంబంధించిన అంశాల్లో చైర్మన్, సభ్యుల నిర్ణయమే కీలకపాత్ర పోషించనుంది. దీంతో జనవరిలో జరగాల్సిన గ్రూప్‌-2 పరీక్షల నిర్వహణ కష్టమేనని సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త కమిషన్‌ ఏర్పాటై మరోమారు తేదీలు ప్రకటించే వరకు అభ్యర్థులు పరీక్షల సన్నద్ధతను కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

గతేడాది డిసెంబర్‌లో వెలువడిన నోటిఫికేషన్‌...

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో 783 గ్రూప్‌-2 ఉద్యోగాల భర్తీకి గతేడాది డిసెంబర్‌లో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ జారీ చేసింది. దరఖాస్తుల స్వీకరణకు నెలపాటు అవకాశం కల్పించింది. దీంతో 5.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్‌-2 అర్హత పరీక్షలను ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిషన్‌ తొలుత ప్రకటించింది. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో పలు పరీక్షలను కమిషన్‌ రీషెడ్యూల్‌ చేసింది. దీంతో గ్రూప్‌-2 పరీక్షలు నవంబర్‌కు వాయిదా పడగా... అభ్యర్థుల ఒత్తిడి, ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో రెండోసారి జనవరికి వాయిదా పడ్డాయి.

నేడు ఢిల్లీకి రేవంత్, భట్టి

- సాయంత్రం ఖరారైన ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్‌
- ఐటీఐఆర్‌తో పాటు రాష్ట్ర విభజన హామీలు, రావాల్సిన నిధులపై కేంద్రానికి నివేదన
- కాంగ్రెస్‌ అగ్రనేతలతోనూ భేటీ కానున్న రేవంత్, భట్టి

సాక్షి, హైదరాబాద్‌: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీ బయల్దేరి వెళ్లనున్నారు. రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత దేశ ప్రధానిని కలిసే సంప్రదాయంలో భాగంగా రేవంత్‌తో పాటు భట్టి కూడా ఢిల్లీ వెళ్లనున్నారు. మంగళవారం సాయంత్రం 4:30 గంటలకు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్‌ ఖరారు కావడంతో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన వినతులతో ఢిల్లీ బయలుదేరేందుకు ఇరువురు నేతలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం గత పదేళ్లలో అమలు కావాల్సిన హామీలు, ఐటీఐఆర్‌ ప్రాజెక్టుపై ప్రధాని మోదీతో చర్చించి వినతిపత్రాలు అందజేయనున్నట్టు సమాచారం. దీంతో పాటు రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించి ఆ మేరకు వినతి పత్రాలు కూడా ఇస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

వీలైతే రాహుల్‌ గాంధీతోనూ భేటీ

ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో పాటు కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేతలతో కూడా రేవంత్, భట్టిలు సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కీలక నేత కె.సి.వేణుగోపాల్‌తో పాటు వీలును బట్టి రాహుల్‌గాంధీతో కూడా ఈ ఇరువురు సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్‌ పదవులతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై పార్టీ పెద్దలతో ఇరువురు నేతలు చర్చిస్తారని గాంధీభవన్‌ వర్గాలు వెల్లడించాయి.

సీఎంను కలిసిన మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎన్నారై పైళ్ల మల్లారెడ్డి, సాత్విక్‌రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కోమటిరెడ్డి.. రేవంత్‌తో భేటీ అయ్యారు. ప్రముఖ సినీనటుడు చిరంజీవి కూడా రేవంత్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్‌.. రేవంత్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

రేవంత్‌కు దగ్గు, గొంతు నొప్పి..

సీఎం రేవంత్‌రెడ్డి దగ్గు, గొంతునొప్పితో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయన సోమవారం నాడు ఎలాంటి కార్యక్రమాలు పెట్టుకోలేదు. సీఎంను పరిశీలించిన డాక్టర్లు గట్టిగా మాట్లాడరాదని సూచించినట్లు సమాచారం.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.